ప్రజాశక్తి
శనివారం 25 జనవరి 2025
5
శ్రీకాకుళం

నేడు వి.జి.కె మూర్తి సంస్మరణ సభ

శ్రీకాకుళం ప్రతినిధి : సిపిఎం సీనియర్ నాయకులు కీ.శే వి.జి.కె మూర్తి సంస్మరణ సభను శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించనున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిర్వహించనున్న కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, నాయకులు రోజ తదితరులు హాజరు కానున్నారు. వీరితో పాటు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు, కుటుంబసభ్యులు, బంధువులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

'పరపతి' కోసం పాకులాట

- ఏడేళ్లుగా ఎన్నికలు లేని పిఎసిఎస్‌లు
- త్వరలో సొసైటీలకు త్రిసభ్య కమిటీలు
- పదవుల కోసం పోటీ పడుతున్న టిడిపి కూటమి నాయకులు

బూర్జలోని పిఎసిఎస్ కార్యాలయం

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్)లకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్టు గానే కనిపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో ఎన్నికల జరిగిన తర్వాత పాలకవర్గాల గడువు 2017లో ముగిసింది. అప్పట్నుంచి ఏడేళ్లుగా సొసైటీలకు ఎన్నికలే నిర్వహించలేదు. రాష్ట్ర విభజన తర్వాత టిడిపి, తర్వాత వైసిపి ప్రభుత్వాలు త్రిసభ్య కమిటీల పేరుతో పార్టీ కార్యకర్తలను నియమించారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వమూ అదే బాటలో పయనిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు నెలల పాటు త్రిసభ్య కమిటీలతో సొసైటీలను నడపాలని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో నామినేటెడ్ పదవులు దక్కని వారు సొసైటీ కమిటీ పదవుల కోసం ప్రయత్నాలు నెరుపుతున్నారు. ప్రభుత్వం త్రిసభ్య కమిటీలు నియమిస్తుందన్న సమాచారంతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఎవరికి వారే తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 49 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. జిల్లాల పునర్విభజనలో పార్వతీపురం మన్యం జిల్లాకు ఎనిమిది, విజయనగరం జిల్లాకు ఐదు సంఘాలు వెళ్లాయి. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో 36 పిఎసిఎస్‌లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2013 ఫిబ్రవరిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు నిర్వహించారు. 2018లో వీటి పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పాత పాలకవర్గాలనే కొనసాగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం, పిఎసిఎస్ పాలకవర్గాలను రద్దు చేసింది. అదే ఏడాది ఆగస్టులో త్రిసభ్య కమిటీలను నియమించింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులతో సహకార సంఘాలకు అధ్యక్షులుగా వైసిపి నాయకులను నామినేటెడ్ ప్రాతిపదికన నియమించింది. ఆరు నెలలకోసారి చొప్పున ప్రభుత్వం కమిటీలను పొడిగిస్తూ వస్తోంది. వైసిపి ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీల పదవీ కాలం 2024 జూన్‌లో ముగిసింది. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం త్రిసభ్య కమిటీల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించింది. అప్పట్నుంచి ప్రభుత్వ అధికారులే ఆ బాధ్యతలు చూస్తున్నారు. మొత్తానికి పాలకవర్గం ముగిసి ఏడేళ్లవుతున్నా, ప్రాథమిక సహకార సంఘాలకు రెగ్యులర్ పాలకవర్గాలు లేవు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా కమిటీలతో పాలన కొనసాగించడం సహకార చట్టాలకు విరుద్ధమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

త్వరలో పదవుల పంపకాలు

ప్రాథమిక సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒక్కో సొసైటీకి ఒక చైర్మన్, ఇద్దరు డైరెక్టర్లను నియమించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల పరిధిలోని పిఎసిఎస్‌ల కమిటీలకు చైర్మన్లు, డైరెక్టర్ల పేర్లతో ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు వెళ్లినట్లు సమాచారం.

కూటమి నాయకుల ఎదురుచూపులు

విత్తనాలు, ఎరువులు, రుణాల అందజేత తదితర కార్యక్రమాలన్నీ పిఎసిఎస్‌ల ఆధ్వర్యంలో జరుగుతుండడంతో గ్రామాల్లో చైర్మన్, డైరెక్టర్లకు పలుకుబడి ఉంటుంది. డిసిసిబి సమావేశాల్లో వీరికి తగినంత ప్రాధాన్యం ఉంటుంది. పైగా పార్టీ అధికారంలో ఉండడంతో ఏదో ఒక పదవి వస్తే ముఖ్య నేతల వద్ద పరపతి పెరుగుతుందని నాయకులు భావిస్తున్నారు. ప్రస్తుతం సొసైటీల అధ్యక్ష, డైరెక్టర్ల స్థానాలకు గ్రామస్థాయి నుంచి పలువురు పోటీ పడుతున్నారు. పదవులపై టిడిపిలో చాలా పోటీ నెలకొంది. దీనికితోడు జనసేన, బిజెపి నాయకులు సైతం పదవులు ఆశిస్తున్నారు. త్వరలోనే సొసైటీల పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా
రేపు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 26న శ్రీకాకుళం నగరంలో చేపట్టనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 13 నెలల పాటు సాగిన రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాల్లోని విధానాలతోనే తిరిగి కొత్త చట్టాలుగా తీసుకొస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సహకార, వ్యవసాయ సాంకేతిక చట్టాలు రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు బానిసలుగా మార్చే విధంగా ఉన్నాయన్నారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాడి సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలను కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చే లక్ష్యంగా ఉన్నాయని విమర్శించారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతులు, వ్యవసాయ కార్మికుల రుణ విముక్తి చట్టం, ఆహార భద్రత చట్టం కొనసాగింపు, ఉపాధి హామీ విస్తరణ, కౌలు రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాటాలు తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా 26న నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి రామలక్ష్మణ జంక్షన్ వరకు మోటార్ బైక్ ర్యాలీని నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు, వైఎస్సార్ టియు జిల్లా అధ్యక్షులు సీపాన వెంకటరావు, సిఐటియు నాయకులు ఎ.సత్యం, ఆర్.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా మారుస్తా

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా మారుస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస వద్ద ప్రభుత్వరంగ సంస్థ జెన్‌కో ఆధ్వర్యాన సూపర్ క్రిటికల్ థర్మల్ ప్రాజెక్టును నిర్మించడానికి జెన్‌కో బృందం పరిశీలించిందని తెలిపారు. పవర్ ప్రాజెక్టుకు ఇఆర్‌సి అనుమతి కూడా ఉందన్నారు. దీన్ని నియోజకవర్గంలో నెలకొల్పాలని కోరానని, అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. తొలి దశలో 1600 మెగావాట్లు, రెండో దశలో మరో 1600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు రూ.30 వేల కోట్లతో నెలకొల్పడానికి జెన్‌కో సంసిద్ధత వ్యక్తం చేసిందని తెలిపారు. ఈ పరిశ్రమ రాకతో నియోజకవర్గ ముఖచిత్రం మారిపోనుందన్నారు. విజయవాడ నుంచి ఇచ్ఛాపురం ఇటువంటి విద్యుత్ ప్రాజెక్టు లేదని చెప్పారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస ప్రాంతంలో ఈ ప్రాజెక్టుకు అనుకూలమైన ప్రభుత్వ భూమి 800 ఎకరాలు, కొద్దిమంది ప్రైవేట్ వ్యక్తుల వద్ద మరో 600 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణంతో సుమారు 15 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 600 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉందని, పది వేల ఎకరాలకు సాగునీటికి వంద క్యూసెక్కుల నీరు పోగా, 500 క్యూసెక్కుల మిగులు నీరు ఉంటుందని తెలిపారు. 3,200 మెగావాట్ల పవర్ ప్లాంట్ నుంచి వచ్చిన యాష్ వల్ల నాలుగు సిమెంట్ ఫ్యాక్టరీలను నెలకొల్పవచ్చని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీ నెరవేరనుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఏడాదిలో తారు రోడ్డు లేని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. నాగావళి నదిపై ముద్దాడపేట వద్ద, వంశధార నదిపై పురుషోత్తపురం వద్ద బ్రిడ్జిలు నిర్మించి రహదారుల కనెక్టివిటీని పెంచుతానని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఐరిస్ నిర్వహిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికేట్ జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్లు ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికేట్లను ఉప ఖజానా అధికారికి అందజేసేందుకు వీలుగా పెన్షనర్ల సంఘం సహకారం అందిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సోమసుందరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాశరావు, జిల్లా జనరల్ సెక్రటరీ ప్రసాదరావు తెలిపారు. నడవలేని, కదలలేని, అనారోగ్య కారణాలు, వృద్ధాప్యం వల్ల బయటకు రాలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి ఐరిష్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్లను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలు వినియోగించుకోవడానికి వీలుగా 95022 49878, 994409 54954 ఫోన్ చేసి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఉచితంగా ఈ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఒక్క క్లిక్‌తో జిల్లా పోలీసు సమాచారం

- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి
- జిల్లా పోలీసు నూతన వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఒక్క క్లిక్‌తో జిల్లా పోలీస్ శాఖ పూర్తి సమాచారం లభిస్తుందని, పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాఖ నూతన వెబ్‌సైట్ (https://srikakulampolice.ap.gov.in)ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వెబ్‌సైట్ ద్వారా పోలీస్ యంత్రాంగం ప్రాథమిక సమాచారం, పోలీస్ స్టేషన్లు, పోలీస్ అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఫోన్ నంబర్లు, ఇతర పోలీస్ సేవలు తెలుసుకోవడానికి వీలు పడుతుందన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ద్వారా చేపట్టే కార్యకలాపాలు వీక్షించేందుకు, సమాచారం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ వెబ్‌సైట్‌ను అనుసరించి పోలీస్ యంత్రాంగం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నవీన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసరావు, ఐటి కోర్ సిఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ కోటేశ్వరరావు, ఎఎస్‌ఐ రమేష్ ఇతర సిబ్బంది ఉన్నారు.

మిస్సింగ్ కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి

అపరిష్కృతంగా ఉన్న మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి దర్యాప్తులో పురోగతి సాధించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి, సాంకేతిక ఆధారాలు, చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. సాంకేతిక ఆధారాల ద్వారా వ్యక్తుల సమాచారం తెలుసుకొని కేసులు పరిష్కరించాలన్నారు. తప్పిపోయిన మైనర్ గర్ల్, ఉమెన్ మిస్సింగ్ కేసులను ప్రాధాన్యత ఇస్తూ అన్ని కోణాలలో దర్యాప్తు చేసి బాధితులను తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు ప్రమాదాల కేసులను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు.

వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

జీవన పో(ఆ)రాటం

మట్టినే నమ్ముకుని, ఆరుగాలం శ్రమించే అన్నదాత పది మందికి పట్టెడన్నం పెట్టాలనే ఆరాటంతో తన పొలాన్ని చదును చేస్తుంటే... అందులో దొరికే చిన్నపాటి జీవరాశుల్ని తిని తమ ఆకలిని తీర్చుకోవాలనే ఆరాటంలో కొంగలు తిరుగాడుతున్నాయి. రైతన్నది ఆరాటమైతే, కొంగలది జీవన పోరాటం. టెక్కలి మండలంలోని రావివలస పంచాయతీ పరిధిలో రైతు పొలాన్ని చదును చేస్తున్న క్రమంలో 'ప్రజాశక్తి' కెమెరాకు చిక్కిన చిత్రం.

- ప్రజాశక్తి, టెక్కలి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టెక్కలి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను మంత్రికి విన్నవించుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులు ఉన్నాయని, ఇప్పటికే నిధులు మంజూరు చేయడమైందని, సమయానికి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నూతన పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి బాధ్యత ఫీల్డు అసిస్టెంట్లదేనన్నారు. అనంతరం మండలంలోని లఖందిడ్డి, రేగులపాడు, నారాయణవలస, మాసాహెబ్‌పేట, జర్జంగి పంచాయతీలకు చెందిన ఫీల్డు అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, నాలుగు మండలాలకు చెందిన పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ బంగారు రాజు

ఎరువుల సరఫరాలో జాప్యం వద్దు

మార్క్‌ఫెడ్ చైర్మన్ కె.బంగారు రాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రైతులకు అందించాల్సిన ఎరువుల సరఫరాలో ఎటువంటి జాప్యం చేయొద్దని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు అన్నారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలోని మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడుతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్క్‌ఫెడ్ కార్యాలయం అద్దె భవనంలో ఉండడాన్ని గుర్తించి భవన నిర్మాణానికి అవసరమైన స్థలం, అయ్యే ఖర్చుపై అధికారులతో చర్చించారు. మార్క్‌ఫెడ్‌కు సొంత భవనం సమకూర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డిఎం కె.యు.పి రమణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బాల్యం నుంచే చట్టాలపై అవగాహన అవసరమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యాన ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద శుక్రవారం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సూర్యమహల్ కూడలి వరకు సాగిన ర్యాలీ అనంతరం అక్కడ బాలికలతో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను ధైర్యంగా వ్యతిరేకించాలని, పోలీసు శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం అండగా నిలుస్తుందన్నారు. బాలికలు, మహిళలకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అమలు చేస్తోందని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహనా కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళలకు ఉన్న చట్టాలను అవగాహన చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను వినియోగించుకోవాలని, బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. స్త్రీ సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని అభివృద్ధి చెందాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి రమణ, దిశ ఎఎస్‌ఐ రేణుక రాణి, డిప్యూటీ డిఇఒ, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రింగు వలల వాడకంపై వివాదం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సముద్రంలో చేపల వేట సాగిస్తున్న సంప్రదాయ మత్స్యకారుల జీవనానికి అడ్డంకిగా మారిన రింగు వలల వాడకం జిల్లాలో మత్యకారుల మధ్య వివాదాన్ని రగిల్చింది. ఈ వివాదాన్ని పరిష్కరించాలంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావును, మెరైన్ పోలీసులను ఆదేశించారు. ఈనెల 20న శ్రీకాకుళం రూరల్ మండలం పి.జి పేట సర్పంచ్ మీకోసంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన ఈ ఆదేశాలు ఇచ్చారు. ఆయన ఆదేశానుసారం పి.జి పేటలో మత్స్యకారులతో సమావేశాన్ని నిర్వహించారు. సముద్రజలాల్లో రింగ్ వలల వినియోగంపై నిషేధం ఉన్న నేపథ్యంలో వారిని వేట చేయనీయొద్దని సంప్రదాయ వేట సాగిస్తున్న మత్స్యకారులు కోరారు. దీంతో రింగ్ వలలు వాడుతున్న మత్స్యకారులు ససేమిరా అనడంతో సమావేశం వివాదానికి దారితీసింది. రింగు వలలు వాడడం వల్ల మత్స్య సంపద వృద్ధి తగ్గుతుందని, దీనికితోడు సంప్రదాయ వేట సాగించే మత్స్యకారులకు చేపలు దొరక్కుండా పోతాయని పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 2005 ఆగస్టు 6న అప్పటి ప్రభుత్వం జిఒ నంబర్ 384ను జారీ చేసి రింగు వలల వినియోగాన్ని నిషేధించిందని వారు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వివాదాన్ని పరిష్కరించేందుకు అధికారులు చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో సమావేశాన్ని అర్థాంతరంగా ముగించి అధికారులు వెనుదిరిగారు.

మాట్లాడుతున్న మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు

ఎలుగుబంటి సంచారం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

కొన్ని నెలలుగా ఆచూకీ లేని ఎలుగుబంట్లు మళ్లీ గ్రామాలకు వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా అక్కుపల్లికి సమీపంలోని అమ్మవారి ఆలయం వద్ద రాత్రివేళల్లో ఎలుగు సంచరిస్తున్న స్థానికులు చెప్పారు. కుక్కలు ఎలుగుబంటిని చూసి అరవడంతో గ్రామస్తులు అప్రమత్తమై పరిశీలించగా, ఎలుగుబంటి తిరుగుతున్నట్లు కనిపించిందని తెలిపారు. కొంతమంది యువత ఎలుగుబంటి సంచారాన్ని తమ సెల్‌ఫోన్‌లో వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అక్కుపల్లి పరిసరాల్లో ఎలుగుబంటి తిరుగుతుండడంతో రాత్రివేళల్లో బయటకు వచ్చేందుకు స్థానికులు భయపడుతున్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మిక చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

గ్రానైట్, మైన్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత, హక్కుల చట్టాలు అమలు చేయాలని జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయం సమీపంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రానైట్ సంక్షోభం పేరుతో కార్మికులకు అరకొర జీతాలు చెల్లిస్తూ యాజమాన్యాలు తీవ్ర దోపిడీకి పాల్పడుతున్నాయని అన్నారు, గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కార్మిక సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయకపోవడంతో లేబర్ అధికారులు కార్యాలయాలకు పరిమితం చేశారని విమర్శించారు. తక్షణం అధికారులు స్పందించి కార్మిక చట్టాలను అమలయ్యే చర్యలు చేసుకోవాలన్నారు. జిల్లాలో మధుఖాన్, ఎంటర్ ప్రైజెస్ అండ్ ఎంటర్ ప్రైజింగ్ కంపెనీలు కార్మికులకు జీతాలు, ఇతర బకాయిలు చెల్లించాల్సి ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి వల్లనే కార్మిక చట్టాలు అమలు కాక కార్మికులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎం.కృష్ణారావు, కె.మధుసూదనరావు, రాజారావు, సూర్యనారాయణ, అన్నెపు అప్పారావు, ఉమాపతి, పట్నాయక్, రామారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి : న్యాయసేవాధికార సంస్థ కోర్టుల సముదాయంలో పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ వెలువడిందని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వయోవృద్ధులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు అర్హులని అన్నారు. దరఖాస్తు చేయాలనుకునే వారు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పరిధిలో వారు మాత్రం అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటువంటి పారితోషకం ఇవ్వమని స్పష్టం చేశారు.

ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

కవిటి : విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, ప్రాథమిక విద్య పటిష్టతకు అందరూ కృషి చేయాలని జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల పరిషత్ నిధులు రూ.1.70 లక్షలతో బొరివంక ప్రాథమిక పాఠశాల వద్ద నిర్మించిన ప్రహరీ ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి కడియాల పద్మతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని తయారు చేసే ప్రాథమిక పాఠశాలలకు పూర్తి సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, ఎస్ఎంసి చైర్మన్ బృందావన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

ఎచ్చెర్ల : మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఓటు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో 'ఓటు నమోదు' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు పొందడం ఎంత ముఖ్యమో, దాని సద్వినియోగానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియలో యువత, విద్యార్థులు అధికంగా భాగస్వాములు కావాలని సూచించారు. తహశీల్దార్ బి.గోపాల్, డిటి ఎన్.హేమసుందర్, వర్సిటీ ఎన్.ఎస్.ఎస్. సమన్వయ కర్త డా. డి.వనజ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 'ఓటు విలువ'పై ఓటుహక్కుపై క్యాంపస్‌లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు.

కవిటి: ఓటు వజ్రాయుధమని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పేడాడ రాజేశ్వరరావు అన్నారు. జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు అత్యంత విలువైనదన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. ప్రతిఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించు కునేలా విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ జె.పాపారావు, అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాదినాయుడు, బి.శ్రీనిబాబు, డి.అనుసూయ, కె.కరుణశ్రీ, బి రమేష్, ఎల్.ఆనంద్, బి.అంజన పాల్గొన్నారు.

సోంపేట : 18 ఏళ్ల పూర్తయిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సంస్కార భారతి విద్యార్థులు పిలుపునిచ్చారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ లోగో ఆకృతిలో ప్రదర్శన ఇచ్చారు.



సోంపేట : ఎన్నికల లోగో ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

విజికె మృతి తీరని లోటు

మెళియాపుట్టి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉద్యమ నేత వి.జి.కె.మూర్తి మృతి ఉద్యోగ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య అన్నారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో విజికె సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. ముందుగా విజికె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజికె సిఐటియు జిల్లా కమిటీ ప్రథమ అధ్యక్షునిగా, సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేశారని అన్నారు. ఆ సమయంలో నిరంతర శ్రామికుడుగా ఉద్యోగ, కార్మిక, ప్రజలను సంఘాల్లో చేర్పించి ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కారానికి కృషి చేశారన్నారు. విజికె అభ్యుదయ వాదిగా, కమ్యూనిస్టుగా నూటికి నూరు పాళ్ల ప్రజల కోసం పనిచేశారని అన్నారు. చనిపోయిన తర్వాత కూడా తన శరీరాన్ని రిమ్స్‌కు అప్పగించడం త్యాగానికి మారుపేరన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు, దామోదరరావు, నారాయణ, నిరంజన్, దివాకర్ పాల్గొన్నారు.

కంచిలి : సిపిఎం నాయకులు వి.జి.కె.మూర్తి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సంగారు లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో విజికె సంతాపసభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కె.గోపీనాథ్, ప్రజాసంఘాల నాయకులు రఘు, కామయ్య, నాగేశ్వరరావు, మోహనరావు, లోకనాథం, నారాయణస్వామి, తాతయ్య పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేయడమే విజికె మూర్తికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. శుక్రవారం శ్యాం పిస్టన్స్ ప్లాంట్- 3 వద్ద విజికె సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజికె మూర్తి సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షునిగా జిల్లాలో కార్మికుల కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. కార్మికులు, ఉద్యోగులు, స్కీం వర్కర్స్, అన్నివర్గాల సమస్యలపై నిరంతరం శ్రమించేవారని ఆయన మృతి కార్మిక, ప్రజా పోరాటాలకు తీరనిలోటన్నారు. కార్యక్రమంలో మండల శ్రీను, ఎం.అనిల్, పి.వాసుదేవరావు, పి.కామేశ్వరరావు, భద్రరావు, మధు, వెంకటరావు, ఎం.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కార్మికులు

కంచిలి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

మున్సిపాల్టీ బడ్జెట్ ఆమోదం

మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలక సంఘం 2025-26కు, 2024-25కు సవరించిన బడ్జెట్, 2025-26 బడ్జెట్ అంచనాలను కౌన్సల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 2024-25, సవరణ బడ్జెట్‌ను 2024-25 వార్షిక అకౌంట్‌లోని అంత్యనిల్వను రూ.2181.00 లక్షలు ఆధారంగా తీసుకొని తయారు చేశారు. 2025-26 బడ్జెట్ అంచనాలు కూడా 2024-25 సవరించిన బడ్జెట్‌లోని సాధారణ, మూలధన ఖాతాలోని అంత్యనిల్వను ఆధారంగా తీసుకొని తయారు చేశారు. ప్రభుత్వం నుంచి ఏటా వచ్చే నిధులను, నష్టపరిహారాలను, తదితర పద్దులను ప్రభుత్వంపై వంద శాతం పన్నుల వసూళ్లకు సంబంధించిన పద్దులపై 90 శాతం వరకు వసూళ్లయినా... అంచనా రాబడిగా లెక్కించి ఆదాయంగా గణనలోనికి తీసుకున్నారు. 2024-025కు సాధారణ, మూలధన రాబడి రూ.2165.27 లక్షలుగా అంచనా వేయబడి ప్రారంభ నిల్వతో మొత్తం రాబడి రూ.4022.90 లక్షలకు అంచనా ఖర్చు రూ.1831.90 లక్షలుగా చూపబడి రూ.2181.00 లక్షలు మిగులు బడ్జెట్‌గా చూపించారు. 2024-25కు సాధారణ, మూలధన అంత్య నిల్వ రూ.2181.00 లక్షలతో ముగిసిన మొత్తం 2025-26లో బడ్జెట్ ప్రారంభ నిల్వగా చూపించారు. 2025-26కు బడ్జెట్ అంచనాకు అన్ని ఖాతా పద్దులు కింద సాధారణ, మూలాధనాల రాబడి రూ.2277.28 లక్షలు, సాధారణ, మూలధన ఖర్చు మొత్తం రూ.2009.65 లక్షలు చూపించారు. ముగింపు నిల్వ రూ.2438.64 లక్షలుగా వచ్చింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉద్యమ నేతలకు మద్దతు ఇవ్వాలి

ప్రజాశక్తి- టెక్కలి

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేసే ఉద్యమ నాయకులను గెలిపించేందుకు ఉపాధ్యాయులు తమకు మద్దతు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతరావు కిషోర్ కోరారు. టెక్కలి పట్టణంలో పలువురు ఉపాధ్యాయుల నివాస గృహాలకు వెళ్లి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కె.విజయగౌరీని గెలిపించాలని శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు ప్రత్యక్ష పోరాటాలే మార్గమన్నారు. విజయగౌరీకి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలన్నారు. ఈయనతో పాటు జిల్లా నాయకులు కురమాన దాలయ్య, బాలకశంకరరావు, తమ్మినేని వైకుంఠరావు, పడాల గణపతిరావు, ఎన్.కృష్ణారావు, మోహనరావు, ఎం.రాము, పాలవలస ధర్మారావు ఉన్నారు.

గోదాం వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

హమాలీల నిరసన

ప్రజాశక్తి- లావేరు

పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీల కూలీరేట్లు పెంపు జిఒను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని మండల పౌరసరఫరాల గోదాం హమాలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం గోదాం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా హమాలీ నాయకులు గంగి గౌరీ, భుజంగరావు మాట్లాడుతూ పనిబిల్లు ప్రతినెలా పదో తేదీలోపు తమ అకౌంట్లులో వేయాలని, పని మానుకున్నవారికి పిఎఫ్ డబ్బులు వెంటనే వచ్చేలా చూడాలని, పిఎఫ్ అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారించాలని, కొత్తగా పనిలో చేరేవారికి పిఎఫ్ నెంబర్లు ఇవ్వాలని, ఇఎస్ఐ అమలుకు అన్నివిధాలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హమాలీలు టి.రాంబాబు, బారుకుల శంకర్, పసుపురెడ్డి జగదీష్, లంకలపల్లి శ్రీను తదితరులున్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

కెజిబివిలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు కెజిబివిలో శుక్రవారం డిఆర్‌పి పద్మలత ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన, విద్యార్థినుల చదువు, ఆరోగ్యం, విద్యార్థులకు అందజేస్తున్న మెనూ పరిశీలించారు. అలాగే స్టాక్ రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి పలు విషయాలను అడిగి నమోదు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, ఎస్ఎంసి చైర్మన్ ఎ.కిరణ్ కుమారి, వైస్ చైర్మన్ పారంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఐతమ్'కు ఐఐసి 4 స్టార్ ర్యాంకు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ 2023-24 విద్యా సంవత్సరంలో ప్రకటించిన ఐఐసి ర్యాంకుల్లో ఐతమ్‌కు 4 స్టార్లు వరించాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2018 నుంచి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ పేరుతో ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ సెల్ (ఐఐసి) ఉద్యోగ, ఉపాధి, ఉత్పాదక రంగాల్లో విద్యార్థులు పురోభివృద్ధి సాధించేందుకు చేస్తున్న కృషిని అభినందిస్తూ ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం, ఎంఒఇ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ అభే జెరే, ఎంఒఈ ఇన్నోవేషన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ దిపన్ సాహులు ఈ మేరకు ర్యాంకింగ్ ధ్రువపత్రాలను జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి ఆయా కళాశాలలు ఐఐసి కేంద్రాల ద్వారా చేస్తున్న కృషి అభినందిస్తూ... ఏటా కేంద్ర విద్యాశాఖ గరిష్టంగా ఐదు స్టార్లు వరకు ర్యాంక్లను ప్రకటిస్తుందన్నారు. ఐఐసి సెంటర్ అధ్యక్షులు డాక్టర్ గుడ్ల సతీష్ కుమార్ బృందానికి ఐతమ్ యాజమాన్యంతో పాటు డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హర్షం ప్రకటించారు.

అరసవల్లి ఆదాయం రూ.66.89 లక్షలు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉన్న హుండీల ఆదాయం గడచిన 65 రోజులకుగాను రూ.66,89,389 ఆదాయం సమకూరింది. దీంతో పాటు 58 గ్రాముల బంగారం, 2.137 కిలోల వెండి ఆభరణాలు, విదేశీ మారక ద్రవ్యం నోట్లు 56, అమెరికా డాలర్లు 20, నేపాల్ కరెన్సీ, 10 డిరామ్స్, ఐదు ఇంగ్లాండ్ పౌండ్లు, యువన్ కరెన్సీ 10 నోట్లు, శ్రీలంక బి2 నోట్లు లభ్యమయ్యాయి. శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో సత్యసాయి, హరిసేన, శ్రీవారి సేవాసమితి సభ్యులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు. గతేడాది నవంబరు 19 నుంచి నేటి వరకు హుండీల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వై. భద్రాజీ తెలిపారు. హుండీల లెక్కింపును పాతపట్నం ఇఒ వాసుదేవరావు, ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి తమ్మినేని రవి, అరసవల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మలు పర్యవేక్షించారు.

బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

కొబ్బరి రైతులు బీమా సదుపాయం వినియోగించుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - కొబ్బరి బోర్డు - అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన కోకోనెట్ పామ్ ఇన్స్యూరెన్స్ పథకం అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. రైతులు తమ తోటలో ఉన్న 4 నుంచి 15 ఏళ్ల ఆరోగ్యకరమైన చెట్లకు, 16 నుంచి 60 ఏళ్లు ఉన్న చెట్లకు ఒకటి నుంచి మూడు ఏళ్ల వరకు ఇన్స్యూరెన్స్ సదుపాయం పొందవచ్చని తెలిపారు. 1 నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న చెట్లకు ఏడాదికి ఒక చెట్టుకు రూ2.25, రెండేళ్లకు రూ.4.16, మూడేళ్లకు రూ.5.90లు ప్రీమియంగా చెల్లించాలని అన్నారు. 15 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న చెట్లకు ఏడాదికి ఒక చెట్టుకు రూ.3.50, రెండేళ్లకు రూ.6.48, మూడేళ్లకు రూ.9.19లు ప్రీమియంగా చెల్లించాలని సూచించారు. ప్రీమియం చెల్లించిన చెట్లకు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నష్టం వాటిల్లితే ఒకటి నుంచి పదిహేనేళ్ల వయసు చెట్లకు రూ.900లు, పదిహేను నుంచి అరవై ఏళ్ల వయసు చెట్లకు రూ.1750లు చొప్పున ఇన్స్యూరెన్స్ లభిస్తుందని తెలిపారు. ఈ ఇన్స్యూరెన్స్ పథకాన్ని కొబ్బరి రైతులు వినియోగించుకోవాలని, పూర్తి వివరాలకు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో కానీ మండల ఉద్యానశాఖ అధికారిని సంప్రదించాలని ఆమె కోరారు.

స్కాలర్‌షిప్ ధ్రువపత్రాలను అందజేస్తున్న దుర్గాప్రసాద్

స్కాలర్‌షిప్ విడుదల

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు విప్రో కేర్ సంస్థ సంతూరు స్కాలర్ షిప్ నిధులు శుక్రవారం విడుదలయ్యాయని కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదవుకోవాలనే కోరిక, ఆసక్తి ఉండి కూడా కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులు చదువులు కొనసాగించలేకపోతున్న వారికి సంతూర్ చేయూత అందించిందని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 46 మంది విద్యార్థినులకు రూ.24,000 చొప్పున విప్రో సంస్థ నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని విద్యార్థుల వారి బ్యాంకు ఖాతాల్లో జమైనట్లు తెలియజేశారు. ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు ఈ స్కాలర్ షిప్‌కు అర్హులన్నారు. ఒక్కసారి స్కాలర్ షిప్‌కు ఎంపికైతే కోర్సు ముగిసే వరకు పొందవచ్చని చెప్పారు. ఈ పథకం కింద ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులకు 60 శాతం, ఇతర ప్రొఫెషన్ విద్యార్థులకు మిగతా 40 శాతం స్కాలర్‌షిప్‌లు విప్రో సంస్థ కేటాయిస్తుందని అన్నారు. స్కాలర్ షిప్ పొందిన విద్యార్థులు ఈ మొత్తాన్ని తమ విద్య ఆవసరాలకు వెచ్చించాలని సూచించారు. స్కాలర్‌షిప్ పొందడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

మురుగునీరు పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

పరిశీలిస్తున్న జెఇ మణికంఠ, సర్పంచ్, అధికారుల బృందం

ప్రజాశక్తి- లావేరు

ఎట్టకేలకు కొత్తకోట పంచాయతీ బట్టుపాళెంలోని వీధిలో మురుగునీరు నిల్వ ప్రాంతాన్ని మండల అధికారులు, పంచాయతీ సర్పంచ్, సచివాలయ సిబ్బందితో కూడిన బృందం శుక్రవారం పరిశీలించారు. ఈనెల 23న మురుగునీరుతో అవస్థలు శీర్షికతో ప్రజాశక్తిలో వార్త ప్రచురించడంతో గ్రామీణ నీటి సరఫరా శాఖ జెఇ మీసాల మణికంఠ, సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, కార్యదర్శి రాంబాబుతో కూడిన బృందం మురుగునీరు నిల్వ ప్రాంతంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకున్నామని, మురుగునీరు పోయేందుకు 175 మీటర్లు కాలువ నిర్మాణకి రూ.4, 37,500తో అంచనాలు రూపొందించామన్నారు. కాలువ నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కారం చేయడం జరుగుతుందని ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి కాలువ నిర్మాణానికి కొలతలు వేసి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి.రజని, వెల్ఫేర్ అసిటెంట్ తోట వెంకటేష్, గ్రామ పెద్దలు కిల్లాన శ్రీనువాసరావు, ఎం.శ్రీనువాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ రొక్కం అనీల్‌కుమార్ తదితరులున్నారు.

గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు

మద్యం దుకాణాలను కేటాయిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని నాలుగు కళ్ల గీత సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలకు ప్రభుత్వం 16 మద్యం దుకాణాలను కేటాయించింది. అందులో భాగంగా ఇచ్ఛాపురం రూరల్ దుకాణాన్ని గౌడ సామాజిక వర్గానికి, ఇచ్ఛాపురం టౌన్, సరుబుజ్జిలి, ఆమదాలవలస, కవిటి, వజ్రపుకొత్తూరు, బూర్జ, నందిగాం, పాతపట్నం, మందస, పోలాకి మండలాల్లోని దుకాణాలను శ్రీశయన, శ్రీకాకుళం, టెక్కలి, కొత్తూరు, కంచిలి దుకాణాలను శెగిడి కుటుంబాలకు, హిరమండలం దుకాణాన్ని యాత కుటుంబాలకు కేటాయించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ పర్యవేక్షణలో లాటరీ పద్ధతిలో ఈదుకాణాలను కేటాయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇఎస్ తిరుపతినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉండాలి

ఎపిఎం కూర్మారావు

మందస : మండలంలోని 57 గ్రామ సంఘాలన్నీ ఎ-గ్రేడ్‌లోనే ఉండేటట్టు సిబ్బంది కలిసికట్టుగా పనిచేయాలని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. మండల మహిళా సమాఖ్యలో కాంతమ్మ, విజయల ఆధ్వర్యాన శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను అన్నింటినీ వివరించాలన్నారు. మహిళల సామాజిక, ఆరోగ్య, అభివృద్ధికి జండర్ పొదుపులు చేస్తూ, సమాజంలో మహిళలపై చిన్న చూపు లేకుండా గౌరవమైన స్థానంలో ఉండడానికి మహిళలంతా ఐకమత్యంతో కృషి చేయాలని అన్నారు. స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా అర్హులు పొందుతున్న రుణాలను ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ వీరంనాయుడు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు కిషోర్, స్వామినాయుడు, ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

దొంగల బీభత్సం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలో వ్యాపార కేంద్రమైన పూండిలో దొంగలు బీభత్సం సృష్టించారు. బంగారు షాపులే లక్ష్యంగా ఏడుగురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సిసి కెమెరా పుటేజ్లో రికార్డులు నమోదయ్యాయి. దున్న రవికి చెందిన బంగారు దుఖాణం తలుపులు పగలగొట్టి బంగారు, వెండి అపహరణకు పాల్పడ్డారు. అలాగే ఆర్కే జూలయర్స్ షాపు తలుపులు పగలగొట్టడానికి ప్రయత్నించారు. అయితే తలుపులు ఊడకపోవడంతో దొంగులు అక్కడ నుంచి పరారయ్యారు. గురువారం రాత్రి 2 గంటల సమయంలో ఏడుగురు దొంగలు పెద్దపెద్ద కట్టర్లు. ఇనపరాడ్లుతో దున్న రవికి చెందిన బంగారషాపు పగలు గొట్టినట్లు సిని పుటేజ్‌ల ద్వారా తెలుస్తుంది. దొంగలించిన సొత్తును సమీపంలో ఉన్న చెరువుగట్టుపై ఆగి ఆభరణాలు మూటగట్టి వాటి కవర్లు, బాక్స్‌లు చెరువు గట్టువద్ద దొంగలు విడిచి పెట్టారు. శుక్రవారం ఉదయం దుకాణం తలుపులు వగలు గొట్టి ఉండడంతో షాపు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్, కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావులు సంఘటనా స్థలానికి పరిశీలన చేసి క్లూస్ టీంకు సమాచారం అందించారు. వారు వచ్చి షాపును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బాదితుడు దుకాణం ఉన్న ఇంటిలోనే నివాసం ఉంటున్నారు. దీంతో బంగారం, వెండి సామానులు షాపులోను ఉంటాయని షాపు యజమాని చెప్పారు.

అట్రాసిటీ కేసు నమోదు

కొత్తూరు: మండలంలోని మదనపురానికి చెందిన ఆగతముడి మాధవరావు, జంక కృష్ణమూర్తి కులం పేరుతో దూషించారని చెందిన అదే గ్రామానికి లిమ్మక దేవిక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 336 సర్వే నంబరులో డి పట్టా భూమి ఎకరా లిమ్మక సిమ్ముడు పేరున గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ భూమిని కుమారులు సుందరయ్య, బుజ్జయ్యలు సాగులో ఉంది. మాధవరావు ప్రోత్సాహంతో జంక కృష్ణమూర్తి దౌర్జన్యంగా ఆక్రమించారు. ఈ భూమిని ఆక్రమించుకోవడంపై కలెక్టర్‌కు గతేడాది డిసెంబరు 28న ఫిర్యాదు చేశారు. నన్ను, మా బావ సుందరిలను మాధవరావు ఇంటికి పిలిపించుకొని కలెక్టర్ ఫిర్యాదు చేస్తారా? అని కులం పేరుతో మాధవరావు, కృష్ణమూర్తిలు దూషించారు. ఈ విషయంపై పెద్ద మనసులు దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో ఆమె ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలను వెల్లడిస్తున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయి పట్టివేత

కవిటి: ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నుంచి గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు అక్రమంగా తరలిస్తున్న 16.230 గంజాయిని మండలంలోని కొజ్జిరియా కూడలి వద్ద ఎస్ఐ రవివర్మ ఆధ్వర్యాన పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇచ్ఛాపురంలో సిఐ చిన్నంనాయుడు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన సురేష్ చంద్రగౌడ, రాకేష్ పొదిలి అనే వ్యక్తులు గంజాయి అక్రమంగా తరలిస్తుండగా, కవిటి పోలీసులు పట్టుకున్నట్టు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌బిఐలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

టెక్కలి రూరల్ : టెక్కలి పాత బస్టాండ్ వద్ద ఉన్న ఎస్‌బిఐలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పొగలు వ్యాప్తి చెందారు. దీంతో ఉద్యోగులు, ఖాతాదారులు పరుగులు తీశారు. దీంతో ఒక్కసారిగా బ్యాంకులో దట్టంగా పొగలు వ్యాపించాయి. అయితే బ్యాంకులో ఒక విద్యుత్ బోర్డు వద్ద మంటలు, పొగలు రావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న టెక్కలి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. బ్యాంకులో ఎటువంటి నష్టం చోటు చేసుకోకపోవడంతో సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

కమ్ముకున్న పొగలు



ప్రారంభిస్తున్న విప్ అశోక్

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని డొంకూరులో నూతనంగా నిర్మించిన రోడ్డును లాంఛనంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని విమర్శించారు. సిఎం చంద్రబాబు తనదైన ముద్రతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ దాసరి రాజు, దక్కత ఢిల్లీరావు, బుద్దల నిర్మాలారెడ్డి, లెటపింటి పద్మనాభం, దున్న లోకనాథ్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఆర్డిఒ కృష్ణమూర్తి

పట్టుమహాదేవి కోనేరు పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీలోని పట్టుమహాదేవి కోనేరు గట్టును ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బి, వెలుగు, పంచాయతీ అధికారులతో మాట్లాడుతూ కోనేరు గట్టు అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం గట్టు మొత్తం తిరుగుతూ ఆక్రమణలను గుర్తించి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, పంచాయతీ కార్యదర్శి కె.వి.పి.జగన్నాథరావు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మణి

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- బూర్జ

మహిళల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలపై ప్రతిఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి మహిళ పురుషుని కంటే అన్నింటిలోనూ ముందంజలో ఉండాలన్నారు. మహిళల హక్కులకు భంగం వాటిల్లితే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం పురుషుల కంటే మహిళలు ముందంజులో ఉన్నారన్నారు. మహిళల కోసం, వారి రక్షణ కోసం ఎన్నో చట్టాలను అమలు చేస్తుందన్నారు. వాటిపై అవగాహన కలిగి ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు హరిప్రియ, సౌజన్యతో పాటు ఎంపిడిఒ తిరుపతిరావు, ఎస్ఐ ప్రవల్లిక, ఐసిడిఎస్ సిడిపిఒ గీతారాణి, డిప్యూటీ తహశీల్దార్ సత్యవతి, మహిళలు పాల్గొన్నారు.

ఫలితాలను విడుదల చేస్తున్న ఉదయ్‌భాస్కర్

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల పరిధిలో డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాలను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం సైన్స్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్ విడుదల చేశారు. కళాశాలలో శుక్రవారం లాంఛనంగా ఆయన ప్రకటించారు. కళాశాల పరిధిలో బిఎ 97.10 శాతం, బికాం జనరల్ 100 శాతం, బీకాం ఒకేషనల్ 100 శాతం, బిఎస్‌సి 77.11శాతం ఉత్తీర్ణతయ్యారని తెలిపారు. మొత్తం 85.68 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సూర్యచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆదిలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పిఎస్ కనకదుర్గ, వై.ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ సిహెచ్ కాత్యాయని, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

డ్రైవర్లకు నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని నెహ్రూ యువజన కేంద్రం ఆవరణలో రవాణా శాఖ ఆధ్వర్యాన ప్రైవేటు స్కూల్ బస్‌డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉప రవాణా కమీషనర్ ఎ. విజయ సారధి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి.వి. బాలమురళీ, నెహ్రూ యువజన కేంద్రం డిడి కె.వి. ఉజ్వల్ ప్రారంభించారు. ఈ శిబిరంలో శశిధర్ ఆస్పత్రి, త్రివేణి ఆస్పత్రి సిబ్బంది, డాక్టర్ అనుష పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. 45 ఏళ్ల పైబడ్డ డ్రైవర్లకు కంటి పరీక్షలతో పాటు బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారులు పి.వి.గంగాధరరావు, ఆర్.అనీల్, కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో అన్నదానం

పలాస: కాశీబుగ్గలో తెలుగు రాష్ట్రాల 49వ దివ్యజీవన మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి మహాసభల ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీను అంతర్జాతీయ దివ్యజీవన సంఘం ఉపాధ్యక్షులు పద్మనాభనంద సరసర్వతి మహారాజ్ ప్రారంభించారు. అనంతరం మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా రామకృష్ణ, టి.చంద్రమౌళి, ఎం.నాగేశ్వరరావు, పైడిశెట్టి అశోక్ కుమార్, కె.వి.రామకృష్ణ, పెంట సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్‌కు తోడ్పాటునివ్వాలి

ఇచ్ఛాపురం : ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కవిటి: బాలికలదే భవిష్యత్ అని బివికె ప్రిన్సిపాల్ ఎం.అనిల్ అన్నారు. కవిటికొత్తూరు కూడలి వద్ద ఉన్న బివికె పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతో పోటీపడి మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. కొన్ని విషయాల్లో పురుషుల కంటే మిన్నగా రాణిస్తున్నారని కొనియాడారు. గతంలో ఆడ పిల్లపుడితే తల్లిదండ్రులు ఆందోళన చెందేవారని ప్రస్తుతం ఆడపిల్ల పుడితే అమితానందం చెందుతున్నారని అన్నారు. ముఖ్యంగా సమాజంలో ఉన్న అన్ని అవకాశాలు ఆడపిల్లలు అందిపుచ్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : పలాస రైల్వేస్టేషన్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యాన జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ప్లాట్ ఫామ్‌లో రైలు ప్రయాణకులకు బాలికల రక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ బాలసరస్వతి, ఆర్‌పిఎఫ్ సిబ్బంది ప్రధాన్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక మహాత్మజ్యోతీరావు పూలే బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, ఉమెన్ పవర్‌మెంట్ విభాగం ఆదికారి లీలాపద్మజ, బి.ఝాన్సీ, సుహరిక, ప్రిన్సిపాల్ పి.సుధారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన రూపకం ఆకట్టుకుంది.

లావేరు: జాతీయ బాలికా దినోత్సవాన్ని బుడుమూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలు వివక్షతకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. లింగ వివక్షత పోవడానికి 2008 నుంచి ప్రతి ఏడాది జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటునట్లు ఎపి ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు తెలిపారు. బాలికల ఉజ్వల భవిష్యత్ కోసం అందరూ తోడ్పాటు అందించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుష్మిత కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.అలాగే మురపాక కెజిబివి పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డవలప్‌మెంట్ అధికారి సింహాద్రి నీరజ, పాఠశాల ప్రత్యేకాధికారి బల్ల సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రణస్థలం: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కొండములగాం ఆదర్శ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఒ ఝాన్సీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్య ప్రోత్సహించడానికి అనేక పథకాలు ఏర్పాటు చేశాయని వివరించారు. ఈ సందర్భంగా చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించి బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, ఐసిడిఎస్ సూపరింటిండెంట్ మంగమ్మ, పి.కృష్ణ, సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

లావేరు : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థినులు

రణస్థలం: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని మండల పరిషత్ ఎఒ వి.ధనుంజయరావు, ఎంఇఒ ఎ. త్రినాథ రావు పిలుపునిచ్చారు. ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు సమావేశమందిరంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఇచ్ఛాపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. 11-18 వయసు గల కిశోరి బాలికలను పాల్గొని రుసు సంబంధిత పరిశుభ్ర, పోషకాహార ప్రాముఖ్యత, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్ ప్రాముఖ్యత వివరించారు. డొంకూరు హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొన్నారు. సమావేశంలో సిడిపిఒ నాగరాణి, బి.సుజాత, ఎస్.నీలవేణి, పి.పుష్పలత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

వర్తకులు భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న రథసప్తమి ఉత్సవాల్లో నగరంలోని వర్తకులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పట్టణ వర్తక సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా నగరంలో మూడురోజుల పాటు పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈవేడుకల్లో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికులకు అసౌకర్యం కలగకుండా పూర్తి సహకారం అందించాలన్నారు. సమావేశంలో నగర వర్తకులు కోరాడ హరి గోపాల్, కోరాడ రమేష్ పాల్గొన్నారు.

టౌన్ ఎస్‌ఐగా ముకుందరావు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం టౌన్ ఎస్‌ఐగా ఎం.ముకుందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పిటి వరకు ఎస్‌ఐగా పనిచేసిన చిన్నంనాయుడు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీకాకుళంలో విఆర్‌గా ఉన్న ముకుందారావును నియమించారు. దీంతో టౌన్ ఎస్ఐ బాధ్యతలు చేపట్టారు. కొత్త ఎస్‌ఐకి స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

హుండీ ఆదాయం రూ.3.61 లక్షలు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని 55 రోజుల హుండీల ఆదాయాలను శుక్రవారం లెక్కించారు. రూ.3,61,145లు ఆదాయం వచ్చిందని కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్. రవికుమార్ ఆధ్వర్యాన ఈ హుండీల లెక్కించారు. కార్యక్రమంలో దేవాదాయ సిబ్బంది, యూనియన్ బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న నాయకులు

అభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి పెద్దపీట వేస్తారని మాజీ ఎంపిపి గొరకల వసంతరావు, ఆగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. నౌపడ ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి అమలపాడు వరకు 2.3 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యాలు లేక ఉద్దాన ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రజల తక్షణ అవసరాలైన రోడ్ల అభివృద్ధి అవసరాలను ఎమ్మెల్యే గౌతు శిరీష గుర్తించి మండలంలో కొత్తగా 11 తారు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, కూటమి నాయకులు మాదనాల జోగారావు, మాదానాల మోహనరావు, దున్న షణ్ముఖరావు, గోవింద పాపారావు, గొరకల వసంతరావు, వంక రామారావు, అంగ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు

మండలం లక్ష్మీపురంలో సచివాలయం వద్ద శుక్రవారం నెల్లిమర్ల మిమ్స్ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కొల్లి ఈశ్వర్ రెడ్డి, ఎంపిటిసి కాగితాల కృష్ణారెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించిన 420 మందికి కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్, ఆర్థోపెడిక్, పల్మానాలజీకి చెందిన ప్రముఖ వైద్యులు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి శస్త్రచికిత్స కోసం ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆపరేషన్ మేనేజర్ కృష్ణకాంత్, సచివాలయ ఉద్యోగులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బెదిరిస్తూ స్థలం కబ్జా

స్థలం డాక్యుమెంట్లను చూపిస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి-ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని ప్రధాన రహదారిపై ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం ముందర ఉన్న మూడు సెంట్ల రేకుల షెడ్డును పట్టణంలోని బొడ్డేపల్లి పేటకు చెందిన బొడ్డేపల్లి విజయ్ కుమార్ బెదిరిస్తూ స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని స్వర్ణకారుడు, స్థల యజమాని పి.వెంకటరమణ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. శుక్రవారం ప్రధాన రహదారిపై ఉన్న తన స్థలం వద్ద విలేకరులతో మాట్లాడుతూ 2023 జూన్ నెలలో భోగి రాజేశ్వరి, సూర్య నంద దగ్గర స్థలాన్ని కొనుగోలు చేశానని ఆ తరువాత ఒక షెడ్డు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ మధ్యనే తన తల్లి మరణించిందని ఆ బాధలో తాను ఉండగా గత ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో బొడ్డేపల్లి విజయ్ అనే వ్యక్తి జెసిబితో షెడ్డు వద్దకు వచ్చి కూల్చేసి షెడ్డుకు ఉన్న విద్యుత్ మీటరు, అందులోని ఫర్నిచర్‌ను ట్రాక్టర్లలో వేసుకొని వెళ్తుండగా తాను అడ్డుకోగా తనపై దాడికి ప్రయత్నించాడన్నారు. తాను వెంటనే జిల్లా ఎస్‌పికి ఫోన్‌లో ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి స్థానిక ఎస్‌ఐను సంఘటనా స్థలానికి పంపించారని తెలిపారు. గడచిన రెండు నెలలుగా తనను ఫోన్‌లో బెదిరిస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడని, తనకు బొడ్డేపల్లి విజయ్ కుమార్‌తో ప్రాణహాని ఉందని వాపోయాడు. తన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని తాను బలహీనుడును కావడంతోనే తనపై దాడి చేసి బెదిరించి ఎలాగైనా తన స్థలాన్ని కబ్జా చేసి ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశాడు. తన స్థలాన్ని తనకు దక్కేలా తన భార్య బిడ్డలకు న్యాయం జరిగేలా చేయాలని అధికారులను కోరాడు. గతంలో కూడా పట్టణంలోని వన్వే సెంటర్ వద్ద ఉన్న ఒక పెద్ద భవంతిని కుటుంబ తగాదాల్లో ఇలాగే కారు చౌకగా దక్కించుకున్నాడని పలువురు చర్చించుకుంటున్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

పోలాకి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశువైద్యాధికారి తదితరులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కపాసుకుద్దిలో పశువైద్యాధికారి కిరణ్ కుమార్ శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు టీకాలు వేసి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు మాట్లాడుతూ పాడి రైతులు పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి పార్వతి, వైద్య సిబ్బంది పురుషోత్తం, దమయంతి, సూరిబాబు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని లింగాలవలసలో పశు వైద్యాధికారి మెట్ట పూర్ణచంద్రరావు 25 పశువులకు గర్భకోశ చికిత్సలు, 113 పశువులకు ఏలిక పాము నివారణ మందులు వేశారు. 21 మేకల్లో నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ రఘునాథ్, వి.ఎ.జి.వరలక్ష్మి, జెవిఒ జె.చిన్నమ్మ, ఎహెచ్‌ఎఎస్ ఎం.అనిల్‌కుమార్, ఎ.ప్రసాదరావు, బి.ధనలక్ష్మి, బి.యోగేంద్రరాజు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని పిర్యాగ్రహారంలో పశు వైద్యాధికారి షణ్ముఖరావు పాడి పశువులకు, మేకలకు, గొర్రెలకు గర్భకోశ తనిఖీలు, కృత్రిమ గర్భధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. నట్టల నివాణా మందులు, టీకాలు వేశారు. టిడిపి నాయకులు ఇల పండ ధర్మారావు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని పెదంచలలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు ప్రారంభించారు. ఈ మేరకు పశు వైద్యాధికారులు పశువులకు నులిపురుగుల నివారణ, సంతానోత్పత్తి వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఎడి డాక్టర్ పి.చంద్రశేఖరరావు, వైద్యులు శ్రీకాంత్, ఉమా భారతి, మధుబాబు, పారావెట్లు కె.కళ్యాణ్, ఎన్.ధర్మేంద్ర, ఎచ్‌ఎ, జిఎం, మెబైల్ వైద్యులు దేవి పాల్గొన్నారు.

లావేరు : పశువైద్య శిబిరాలను రైతులు, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం గుర్రాలపాళెంలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు ఈ కార్యక్రమంతో మేలు జరుగుతుందన్నారు. పాడి రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. 250 పశువులకు చికిత్స చేసినట్లు వైద్యదికారిణి లావణ్య తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గారావు, కిషోర్, వైద్యులు శరత్, హేమంత్ కుమార్, ఎంపిటిసి జనపాల బానోజీరావు, మొరం సోంబాబు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మందులు వేస్తున్న రామ్మోహనరావు తదితరులు

'ఉల్లాస్'తో నిరక్షరాస్యత నిర్మూలన

పలాస : ప్రభుత్వం అమలు చేస్తున్న ఉల్లాస్‌తో నిరక్షరాస్యత నిర్మూలన సాధ్యమని ఎంపిడిఒ కె.వసంతకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల పంచాయితీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, ఎపిఎం జాంభవతి, ఎంఎంఎస్ అధ్యక్షులు జి.శాంతమ్మ, వాలంటర్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉల్లాస్ పథకం ద్వారా నిరక్ష్యరాసులకు ఉజ్వల భవిష్యత్‌ను కల్పించనుందని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎసి శ్రీరాములు, మహిళా మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

నందిగాం : ప్రతి ఒక్కరికీ అక్షర జ్ఞానం ఎంతైనా అవసరమనే ఎంపిడిఒ టి.రాజారావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం మనవరాత్నం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి, అరుణ, సరోజని, సిసిలు గణేష్, పద్మ, హైమ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు రెండో విడత ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం గొడబ ప్రసాదరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులను ఆక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే ఉల్లాస్ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. వాలంటీర్, టీలర్లతో రెండో విడత శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ, ఎపిఎంలు కలిసి అభ్యసన పుస్తకాలను అందజేశారు.

శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ ప్రాంతంలో ముస్లిములకు ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని పెద్దలు కోరారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.రామారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కాశీబుగ్గ కెటి రోడ్డులో క్రైస్తవులు, ముస్లీములను కలిసి ఉన్న శ్మశాన వాటిక ఇరు మతాలకు సరిపోవడం లేదన్నారు. ముస్లిములు ఎక్కువుగా సూదికొండ ప్రాంతంలో ఉన్నారని, ఎవరైనా చనిపోతే మృతదేహాలు తీసుకు వెళ్లడానికి కెటి రోడ్ ప్రాంతం దూరాభారం అవుతుందని, సూదికొండ ప్రాంతంలో ముస్లిములకు ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి రెవెన్యూ అధికారులతో చర్చించి శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీఇచ్చారు. ముస్లిం జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ ఆహ్మద్ గౌస్, సూదికొండ ముస్లిం కాలనీ మైనారీ అధ్యక్షులు ఖాసిమ్, జలానీబాయ్, అమీర్ బాయ్, మీరాబాయ మనీబాయ్, ఇబ్రమ్‌బాయ్, మెహిదీన్ బాయ్, ముస్తాన్బాయ్, అబ్దుల్లాబాయ్ పాల్గొన్నారు

వినతిపత్రం అందజేస్తున్న ముస్లిములు

బొడ్డపాడులో చలపతి అంత్యక్రియలు

ప్రజాశక్తి- పలాస

చత్తీస్‌ఘడ్-ఒడిశా సరిహద్దు గరియ బంధ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత చలపతిరావు అలియాస్ సుధా మృతి చెందారు. ఈ మేరకు మండలంలోని బొడ్డపాడులో ఉద్దాన ప్రజల అశ్రునివాళుల మధ్య శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు తీసుకుని రాగా, అమరవీరుల స్మారక భవనం ప్రాంతంలో శవపేటికను భద్రపరిచారు. గ్రామస్తులు, ఆ ప్రాంతానికి చేరుకుని చలపతిరావుకు నివాళ్లర్పించారు. చలపతిరావు ఆశలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ భూనారు. కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అంజమ్మ, వై.వెంకటేశ్వర్లు, కోదండ, నీలకంఠం, ధనలక్ష్మి, దానేషు, వీరస్వామి, అరుణ, కుసుమ, మద్దిల రామారావు, మద్దిల ధర్మారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

పలాస : పలాస వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న సిఎఫ్‌లు నెల 27, 28, 29న శ్రీకాకుళం ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు ముందస్తుగా సమ్మె నోటీసును వెలుగు ఎపిఎం జాంభవతికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 నెలలుగా జీతాలు అందక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎఫ్‌ల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు శ్రీకాకుళం తరలిరావాలని పిలుపునిచ్చారు.

నాణ్యమైన పొట్టేలు ఎంపిక ఉత్తమం

ప్రజాశక్తి- రణస్థలం

మాట్లాడుతున్న ఎడి దుర్గారావు

గొర్రెల మంద పెరగాలన్నా, నాణ్యమైన పిల్ల రావాలన్నా.. మందలో మంచి విత్తన పొట్టేలును ఎంపిక చేసుకోవాలని, ప్రతి 20-25 గొర్రెలకు ఒక విత్తన పొట్టేలు ఉండాలని రణస్థలం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు బి.దుర్గారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది రైతులు తమ మందలో పుట్టిన పిల్లలను విత్తనం కోసం ఎంపిక చేసుకుంటారు. దీనివల్ల నాణ్యమైన పిల్ల పుట్టకపోగా, బలహీనంగా, అంగవైకల్యంతో, తక్కువ బరువు, సంతానోత్పత్తికి పనికిరాకుండా ఉంటాయని, వేరే మంద నుంచి నాణ్యమైన పొట్టేలును ఎంపిక చేసుకోవడం ఉత్తమమన్నారు. ముఖ్యంగా కవల పిల్లలను కనే సంతతి నుంచి వచ్చిన పొట్టేలును ఎంచుకోవాలని, రెండేళ్లకుపైన వయసున్న పొట్టేలును మాత్రమే ఎంచుకోవాలని, సందేహాలుంటే సమాచారం కోసం వెటర్నరీ నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఛారిటబుల్ ట్రస్టు కల్వరి బాపిస్టు చర్చ్ ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో వైద్య సిబ్బంది 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్ల ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్, గంగాధర్‌రెడ్డి, జి.పెద్దరెడ్డి, బోర ప్రసాద్, అంబటి ఈశ్వరరావు, బోర వాసురెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ రవివర్మ

కళ్యాణిలో 'సంకల్పం'

కవిటి: కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో ఎస్ఐ రవివర్మ ఆధ్వర్యాన సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా సెల్ ఫోన్ వాడకంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి, సిబ్బంది శ్రీదేవి, శ్రావణి, శ్రావ్య, సరస్వతి, భానుమతి, రాము పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబరచాలి

టెక్కలి : విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు అన్నారు. మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు చదువులో ఒక భాగమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ పర్యవేక్షణలో నిర్వహించిన క్రీడలను ఆమె ప్రారంభించారు. మొదటి రోజు కబాడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, అథ్లెటిక్ వంటి క్రీడలు నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల నుంచి 60 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బాడాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మ, కుప్పిలి ప్రకాష్, లక్ష్మణరాజా, కాపల రఘునాథరావు, ఆలివేణి, నాగళ్ల రమేష్, శ్రీనివాసరావు, వెంకటరమణ, త్రినాథరావు పాల్గొన్నారు.

నూర్పులను విద్యుత్ లైన్లకు దూరంగా చేపట్టాలి

ఆమదాలవలస: రైతుల ధాన్యం నూర్పిడి చేస్తున్న యంత్రాల యజమానులు నూర్పులను 11 కెవి, 33 కెవి వంటి పెద్ద విద్యుత్ లైన్లకు దూరంగా చేపట్టాలని విద్యుత్ ఆపరేషన్ ఇఇ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం నూర్పుల విషయంలో వచ్చిన మార్పుల కారణంగా రైతులు తమతమ వరి నూర్పులను నేరుగా పంట పొలాల్లోనే నూర్చుతున్న కారణంగా యంత్రాల నుంచి వస్తున్న గడ్డి పైనున్న 11 కెవి, 33 కెవి వంటి పెద్దలైన్లకు తగిలి అవి మంచు కారణంగా పైనుంచి వెళ్తున్న వైర్లకు చుట్టుకుని విద్యుత్ అంతరాయానికి కారణమవుతూ వినియోగదారులకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వరి నూర్పులను చేయాలని కోరారు.

క్రీడాకారులకు అభినందన

శ్రీకాకుళం అర్బన్ : జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటి సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. శుక్రవారం విజయోత్సాహంతో జిల్లాకు చేరుకున్న క్రీడాకారులు ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సిల్వర్ మెడల్ అందుకున్న ఎచ్చెర్లకు చెందిన ఎం.గాయత్రిని అభినందించారు. ఆమె నగరంలో చైతన్య కో-ఆపరేటివ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం హెచ్ఇసి చదువుతోంది. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

కామ్రేడ్ వి.జి.కె మూర్తి సంస్మరణ సభ

ప్రత్యేక అనుబంధం

Advt. Feature

శనివారం 25-1-2025 శ్రీకాకుళం జిల్లా 16 పేజీలు

- కార్మిక పోరాటాల్లో కీలక పాత్ర
- ప్రజా ఉద్యమాల నిర్మాణంలో విశేష కృషి
- ఎల్ఐసి నుంచే ఉద్యమాలకు తొలి అడుగు
- సేవా కార్య క్రమాల్లోనూ తనదైన ముద్ర

"ఎంత గొప్పగా జీవించావో నీ చేతలు చెప్పాలి. ఎంత గొప్పగా మరణించావో ఇతరులు చెప్పాలి."

- మహాత్మా గాంధీ

ఉద్యమ స్ఫూర్తి... వి.జి.కె

వి.జి.కె మూర్తి... మూర్తీభవించిన వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం. నిబద్ధత, నిరాడంబరత, నిస్వార్ధ సేవలతో అందరి మన్ననలను పొందిన మహోన్నత వ్యక్తి. సిద్ధాంతపరంగా ఆయన కమ్యూనిస్టే అయినే, అందరితోనూ విస్తృత సంబంధాలు కలిగిన నేత. మధ్యతరగతి ప్రజలు ఆయనున్న తమ మనిషిగా చూసుకునేలా వారితో విస్తృత సంబంధాలు నెరిపారు. విద్యావంతులు, మేధావులు, కవులు, రచయితలు ఇలా అన్ని తరగతుల ప్రజలతో సంబంధాలు నెరుపుతూ ఆదర్శంగా నిలిచారు. జిల్లాలో కార్మిక పోరాటాలు, వారి సమస్యల పరిష్కారానికి పోరాటం సాగిస్తున్న సిఐటియు ఆవిర్భావానికి నాంది పలికిన వారిలో ఆయన ఒకరు. ప్రజా ఉద్యమాలను నిర్మించి వారి సమస్యలపై చివరి వరకు పోరు సాగించారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వి.జి.కె మూర్తి జీవితం అనేక ఒడిదొడుకుల మధ్య సాగింది. బాల్యం నుంచే అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. ఆయన గార మండలం అంపోలు పంచాయతీ అంబటివానిపేటలో జూలై 15, 1951లో జన్మించారు. తండ్రి వి.హనుమంతురావు, తల్లి రామలక్ష్మి. వీరికి ఏడుగురు సంతానం కాగా ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. అందులో మూర్తి ఆరో సంతానం. శ్రీకాకుళం, హైదరాబాద్ ప్రాంతాల్లో ఆయన పాఠశాల విద్య సాగింది. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బిఎస్సి చదివారు. ఆంధ్రా యూనివర్సిటీ అప్లయిడ్ మేథమేటిక్స్ ప్రథమ సంవత్సరం చదువుతుండగానే ఆయనకు 1973లో ఎల్ఐసిలో బ్రాంచి సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. తండ్రి హనుమంతురావు ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ కమిషన్ రీజనల్ ఆర్గనైజర్‌గా పనిచేసేవారు. స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్నారు. థియోసోఫికల్ సొసైటీ అనుచరుడు కావడం వంటి అంశాలు మూర్తిపై ప్రభావం చూపాయి. మూర్తి చాలా కాలం ఖద్దరు చొక్కా, ప్యాంటూ వాడేవారు. ఆయన ఏడేళ్ల

మిగతా 2లో

శ్రద్ధాంజలి

శ్రీ వాడపల్లి గోపాల కృష్ణమూర్తి గారు

Rtd. HGA, LIC of India, Srikakulam

సమ సమాజం కోసం అహర్నిశలూ కృషి చేస్తునే
మాకు కూడా అందమైన భవితను అందించారు...
ఎన్నెన్ని ఆర్థిక, ఆరోగ్య సమస్యలు చుట్టూముట్టినా...
మమ్మల్ని వాటికి ఆమడ దూరంగా ఉంచారు...
ఎన్నో సంఘాలకు దిశా నిర్దేశం చేస్తూనే...
మమ్మల్ని కూడా సన్మార్గంలో నడిపారు...
మీరు చూపిన మార్గం మాకు సదా అనుసరణీయం..!
సదా మిమ్మల్ని స్మరించుకుంటాం...
బాధాతప్త హృదయాలతో...

పెద్ద కుమార్తె - అల్లుడు -మనుమడు
భారతి - రవికుమార్ -రిషి

కుమారుడు- కోడలు- మనమరాళ్ళు
శ్రీనివాస్-సూర్యకుమారి
సహస్ర, చైతు

చిన్న కుమార్తె - అల్లుడు- మనుమడు - మనవరాలు
స్రవంతి - శ్రీనివాస్
మధు ప్రణయ్, మీనాక్షి

మరియు కుటుంబ సభ్యులు

నేను చూసిన మూర్తి గారు...

సైద్ధాంతిక, నిబద్ధత, ప్రణాళికాబద్ధమైన కార్యదక్ష మేళవింపు వి.జి.కె మూర్తి గారి జీవితం. అనునిత్యం అధ్యయనం, అవసరమైనవి రాసి పెట్టి ఉంచుకోవడం ఆయన దినచర్యలో భాగంగా ఉండేది. వర్గాలకు అతీతంగా విస్తృత సంబంధాలు కలిగి ఉన్న వారిలో ఆయనకు ఆయనే సాటి. అంత విస్తృతస్థాయిలో పరిచయాలు ఉన్న వారిలో ఉద్యమ వేదికగా చూస్తే ఆయన అగ్రగణ్యులుగా నిలుస్తారు. పరస్పర విరుద్ధ రాజకీయ అభిప్రాయాలు ఉన్న వారితోనూ తన అభిప్రాయాలను చెప్పడం ద్వారా వారి నుంచి మరింత అభిమానాన్ని పొందగలిగేలా సంభాషణ చాతుర్యం ఉండడం ఆయన ప్రత్యేకత. పనిలోనూ ప్రాధాన్యత ఎంచుకోవడంలోనూ ఆచరణాత్మకంగా ఉండేది. అలాంటి సమయాల్లో పని ముందుపీఠిన నిలిచేది. ఆరోగ్య పరిరక్షణ ద్వితీయ ప్రాధాన్యతగా ఉండేది. ఆ విషయాన్ని చాలా సందర్భాల్లో ఆయన దృష్టిలో పెట్టేవాళ్లం. దాన్ని తేలిగ్గా తీసుకోవడం మమ్మల్ని ఆందోళనపరిచేది. సమావేశాలకు ఆహ్వానించేందుకు గానీ అవసరమైన వారిని కలవడానికి వెళ్లే సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడంలో కొంత అలక్ష్యం చూపేవారు. మనకు వీలు కలిగినప్పుడు మనం వెళ్లడం కాదు, మనం వెళ్లాల్సిన వారి అనుకూల సమయాలు చూసుకొని వెళ్లాల్సి ఉంటుందని చెప్పేవారు. ఏ కార్యక్రమం చేపట్టినా ఎంతమందిని సమీకరించాలన్నది ముందుగానే సమావేశంలో నిర్ణయమయ్యేది. దాన్ని దృష్టిలో పెట్టుకుని తాను ఎంతమందిని కలిసి చెప్పాలి, ఎంతమందికి ఫోన్ల ద్వారా చెప్పాలన్నది ఆయన ముందుగానే నిర్ణయించుకునేవారు. ఇటీవలే గరిమెళ్ల విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో ఓ కార్యక్రమం చేపట్టిన సమయంలో 200 మందికి సమావేశం గురించి ఫోన్ ద్వారా తెలియజేశారు. అంత ఓపికగా, పట్టుదలతో పనిచేసిన వారు అరుదుగా ఉంటారన్నది అతిశయోక్తి కాదు. ఫోన్ చేసిన సమయంలో ఎవరైనా దొరక్కపోతే, వారి పేర్లను రాసుకొని మళ్లీ ప్రయత్నం చేయడం ఆయన పనిలో మరో ప్రత్యేకత. కార్యక్రమం జయప్రదం కావాలన్న కాంక్షతో ఇతరులు చేయాలన్న పనిలోనూ లోటుపాట్లు ఉంటాయేమోనన్న భయంతో ఆ పనిలోనూ చొరబడి పనిచేసే వారు. అంటే తాను తీసుకున్న బాధ్యతలను కాకుండా అదనపు

పనులు చేయడం అలవాటుగా మారింది. పార్టీ కార్యకర్తల విషయంలో ఆయన స్పష్టమైన అభిప్రాయం ఉండేది. ఎవరి విషయంలోనైనా ప్రతికూల అంశాలను వెనక్కి పెట్టి సానుకూల అంశాలను ముందుపీఠిన పెట్టి చూడాలన్నది ఆయన అభిమతంగా ఉండేది. అలాంటి విషయాలు చాలా సందర్భాల్లో పరస్పరం చర్చించుకునే సందర్భాలు ఉన్నాయి. నేను పక్క ఇంటికి చేరి 20 నెలలు పైబడింది. ఇక్కడకు చేరిన తర్వాత కనీసం రెండు రోజులకోసారైనా పెరట్లో మాట్లాడుకునేవాళ్లం. మాట్లాడింది కొద్ది నిమిషాలైనా అన్ని విషయాలు చర్చకు వచ్చేవి. ఏ విషయాన్నైనా సమగ్రంగా చెప్పాలన్నది ఆయన అభిమతంగా ఉండేది. దీంతో క్లుప్తంగా చెప్పాలన్న చోట కూడా ఎక్కువ సమయం తీసుకునే సందర్భాలు ఉన్నాయి. నిరంకుశత్వం, మతతత్వం దూకుడుగా ముందుకొస్తున్న సమయంలో ప్రజలకు అభ్యుదయ సాహిత్యం అందించాలన్న తపన ఎక్కువగా ఉండేది. అందుకోసం ప్రజాశక్తి ముద్రించిన సాహిత్యాన్ని ప్రత్యేకంగా తెప్పించి అందించే ప్రక్రియ కొనసాగింది. ఖర్చులను తానే భరిస్తూ ప్రజాశక్తి ఇచ్చే రాయితీతోనే పుస్తకాలను అందించడం ఆయన ప్రత్యేకత. ప్రజాశక్తి దినపత్రిక చేర్పించడంలోనూ అదే కృషి ఉండేది. నగరంలో అందుకు అగ్రగామిగా ఉన్న సందర్భాలు అనేకం ఉన్నాయి. బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఇటీవల ముద్రించింది. ముద్రించిన వాటిలో సగానికి పైగా సంచికలను విద్యార్థులకు అందించడంలో చేసిన కృషి ప్రశంసనీయం. ప్రత్యేకంగా పాఠశాలలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కలుసుకొని వారి ద్వారా ఆ కర్తవ్యాన్ని పూర్తి చేశారు. పలురంగాల ప్రతిభావంతుల విగ్రహాలతో శ్రీకాకుళంలో స్మృతివనం ఏర్పాటైంది. అందులో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం ఏర్పాటు చేయాలన్న ఆలోచన రావడమే కాదు. తానే వేల రూపాయల ఖర్చుతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. ఇటీవల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉద్యోగులు, కార్మికుల సమన్వయ కమిటీకి సారథ్యం వహిస్తూ ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టి జిల్లాలో కార్మికోద్యమం పెరుగుదలకు ఎనలేని కృషి చేశారు. సమాజంలో అంతరాలు పోవాలని వర్గ రహిత సమాజం రావాలని కోరుకునే ప్రజా ఉద్యమ నాయకులు, కార్యకర్తలకు, ఉద్యమ శ్రేయోభిలాషులకు ఆయన నిరాడంబర సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. నిలవాలి. ఇదే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి.

- సత్తారు భాస్కరరావు

భిన్నత్వంలో ఏకత్వం వి.జి.కె ప్రత్యేకత

ఎన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా అందరిలో ఏకత్వాన్ని సాధించడం వి.జి.కె మూర్తి ప్రత్యేకత. దాదాపు పదేళ్లు ఆయనతో కలిసి పనిచేశా. ఎవరు చెప్పినదాన్నైనా ఓపికగా విని, తాను చెప్పాల్సింది సూటిగా చెప్పేవారు. మధ్య తరగతిని ఐక్యపరచడంలో ఆయనొక ప్రత్యేకం. 'ప్రజాశక్తి'కి ఆయన సూచనలు చాలా ఉపయోగపడ్డాయి. ఏమైనా ఆయన లేనిలోటు పూడ్చలేనిది. ఆయన చేసిన ఉద్యమ మార్గంలో కృషి చేయడమే ఘన నివాళి.

– ఎస్.సుధాకర్, చీఫ్ ఆడిటర్, ప్రజాశక్తి

ఉద్యమ స్ఫూర్తి వి.జి.కె

(మొదటిపేజీ తరువాయి)

చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. అన్నయ్యలు వి.సుబ్రమణ్యం, వి.శ్రీరామ్మూర్తి ఇతర బంధువుల సంరక్షణలో పెరిగారు.

కుటుంబ నేపథ్యం

ఆయన వైవాహిక జీవితమూ సజావుగా సాగలేదు. 1975లో లక్ష్మిని వివాహం చేసుకున్నారు. వారికి భారతి, శ్రీనివాసకుమార్, స్రవంతి ముగ్గురు సంతానం. భార్య లక్ష్మి 1991లో మరణించారు. 1993 వరకు ఆయన ఒంటరిగానే జీవితం గడిపారు. బంధువులు, స్నేహితుల సలహా మేరకు 1993లో డి.బి.ఆర్.జి ప్రసూనాంబను వివాహం చేసుకున్నారు. మొదటి భార్య సంతానాన్నే తమ పిల్లలుగా చూసుకోవడానికి పిల్లలను కనగూడదని నిర్ణయించుకున్నారు. 2017లో ప్రసూనాంబ మరణించారు. 2011లో ఆయన ఉద్యోగ విరమణ పొందారు. మరోవైపు అనారోగ్య సమస్యలూ ఆయన్ను వెంటాడాయి. 2017లో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. 2021లో కరోనా బారిన పడి కోలుకున్నారు.

ఎల్ఐసి నుంచి తొలి అడుగు

ఎల్ఐసిలో చేరిన తర్వాత 1974లో బ్రాంచి ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ఎమర్జెన్సీ కాలం నడుస్తుండడంతో నిర్బంధం నడుమే కార్యకలాపాలు సాగించారు. జిల్లాలో ఉన్న బ్యాంకు, పోస్టల్, టెలికాం తదితర ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు, కార్మికులతో కలిసి 1978లో సమన్వయ సంఘం ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వ విధానాలు, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడారు. మరోవైపు ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించారు. ఫెలోషిప్‌లో అఖిల భారత స్థాయిలో మొదటి స్థానం సాధించారు.

ఉద్యోగోన్నతిపై 1983లో హైయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పలాసకు బదిలీ అయ్యారు. అక్కడా ఉద్యోగులు, కార్మికులతో సమన్వయం సంఘం ఏర్పాటు చేశారు. 1985లో సిపిఎం సభ్యత్వాన్ని తీసుకున్నారు. 1991 నుంచి 1994 వరకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. 1986లో బదిలీపై మళ్లీ శ్రీకాకుళం వచ్చారు. ఈ క్రమంలో విశాఖ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమ్మె, పోస్టల్, టెలికాం, కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు సమ్మెలో వారికి సంఘీభావంగా పాల్గొనడంతో పాటు చర్చల్లో పాల్గొని సమస్యలకు పారిష్కారం చూపారు. ఉద్యోగులను ఉన్నపళంగా తీసేసే రాజ్యాంగంలోని 310, 311 ఆర్టికల్స్‌కు వ్యతిరేకంగా చేపట్టిన అందోళనల్లో కీలకపాత్ర పోషించారు. జిల్లాలో సిఐటియుకు ఒక నిర్మాణం ఇచ్చే క్రమంలో తొలి అధ్యక్షులు అయ్యారు.

ఉద్యమ నేపథ్యం

జిల్లాలో నీలం జ్యూట్, వెంకటబాలాజీ, సరితా సింథటిక్స్, వంశధార పేపర్ మిల్లు, ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కార్మికుల వేతనాల పెంపునకు, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశారు. భవన నిర్మాణ కార్మికులను వేలాది మందిని సమీకరించి సంఘటితం చేయడంలో కీలకపాత్ర పోషించారు. చందన, బొమ్మన బ్రదర్స్ వస్త్ర దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు వచ్చేలా చేశారు. బ్యాంకులు, ఎల్ఐసి, టెలికాం, ఉద్యోగులు, పెనన్షర్లతో కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ఎల్ఐసి స్ప్లిట్, ఐఆర్‌డిఎ, ఇన్సూరెన్స్ ప్రైవేటీకరణపై పోరాటాలకు ప్రజలను సమీంకరించడంతో పాటు సంతకాల సేకరణలో కీలకపాత్ర పోషించారు.

1991లో ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు అందరినీ సమీకరించి విజయవంతం చేయడంలో తనవంతు పాత్ర పోషించారు. 1992లో సిఐటియు నిర్మాణానికి ఒక రూపు తెచ్చేందుకు సిఐటియు జిల్లా మొదటి అధ్యక్షుడు అయ్యారు. సిఐటియులో అఖిల భారత కౌన్సిల్ మెంబర్ వరకు ఎదిగారు. 1997లో శ్యామ్‌పిస్టన్స్ 220 రోజుల సమ్మె, ఆయన ఉద్యమ చరిత్రలో కలికితురాయిగా మిగిలిపోతుంది. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు ఆ కుటుంబాలకు ఆకలి బాధ లేకుండా బియ్యం, డబ్బులు, మందులు సేకరించి వారిని ఆదుకోవడంలో ముందున్నారు. 1998లో వాసవి జ్యూట్ మిల్లులో ఏడాది పాటు ఆందోళనలు జరిగిన సందర్భంలో కార్మికులపై భాష్పవాయువు ప్రయోగించారు. ఈయనతో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. రాజాం కోర్టు ఆరు నెలల శిక్ష విధించగా, శ్రీకాకుళం జిల్లా కోర్టు ఆ కేసును కొట్టి వేసింది.

అనేక సేవా కార్యక్రమాలు

ప్రజా ఉద్యమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తనవంతుగా ఆర్థికసాయమూ అందించారు. 1981లో వంశధార వరద బాధితుల సహాయార్థం నిధుల సేకరణ చేపట్టారు. 1995-97 మధ్య కాలంలో జిల్లాలో సంభవించిన తీవ్ర దుర్భిక్షం, 2020-21లో కరోనా సమయంలో సహాయం అందించారు. విశాఖలో కేన్సర్ బాధితుల కోసం విరాళం అందించారు. తను చదువుకున్న ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ దుస్థితి, కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేయడంతో అన్ని బ్యాచ్ విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకొచ్చి పాఠశాల అభివృద్ధికి పాటుపడ్డారు.

ముస్లిం మైనార్టీలకు అండగా...

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఆ తరగతి ప్రజలను సమీకరించి సదస్సులను నిర్వహించారు. సిఎఎ, ఎన్ఆర్‌సి తదితర అంశాలపై సెమినార్‌లు పెట్టి వారిలో భయాందోళనలు తొలగించే ప్రయత్నం చేశారు. మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. వక్ఫ్ బిల్లుపై సవరణలకు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలకు అండగా నిలిచారు. వీరితో పాటు దళితుల సమస్యలపై పోరాటాలకు ప్రాధాన్యమిచ్చేవారు.

ఇతర ఉద్యమాలకు మార్గదర్శకత్వం

2005లో ఆయన ఇతర ఉద్యమాలకు మార్గదర్శకత్వం వహించారు. సాహితీ సంస్థలకు, ఉపాధ్యాయ సంఘాలకు దిశానిర్దేశం చేసేవారు. 2011లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఎల్ఐసిలో జోనల్ మేనేజర్ స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉన్నా హోదా, ఉద్యోగోన్నతితో వచ్చే ఆదాయం వదులుకుని శ్రీకాకుళం ఎల్ఐసిలోనే ఉంటూ ఉద్యమాలకు అంకితమయ్యారు. ఉద్యోగ విరమణ తర్వాత భార్య ప్రసూనాంబ అనారోగ్యం ఒకవైపు వెంటాడుతున్నా, ఉద్యమాలకు దూరం కాలేదు. 2015లో శ్రీకాకుళం జిల్లా సాహితీ స్రవంతి ఏర్పాటులో ఆయన కీలక భూమిక పోషించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షులుగా జిల్లాలో ఉద్దానం కిడ్నీ వ్యాధులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర సమస్యలపై సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవారు. 2017లో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కన్వీనర్‌గా బాధ్యతలను స్వీకరించి, ఆ కార్యక్రమాలను పతాక స్థాయికి తీసుకువెళ్లారు. ఆ బాధ్యతల్లోనే ఉంటూ ఆయన తనువు చాలించారు.

వి.జి.కె జీవితం పోరాటాలకే అంకితం

తన యావత్ జీవితాన్ని ప్రజా పోరాటాలకు అంకితం చేసిన యోధుడు కామ్రేడ్ వి.జి.కె మూర్తి. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించడంతోపాటు ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప నిర్మాణ దక్షుడు. ఆయన మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీవ్ర లోటు. ఒకవైపు ఉద్యమాల్లోనూ, మరోవైపు సాంస్కృతిక రంగంలో విశేషమైన కృషి చేయడంలోనూ, చిన్న పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు బాలల క్లబ్‌ను ఏర్పాటు చేయడంలో తనదైన శైలిలో ఓపికతో సమయం కేటాయించిన ధీరుడు.

- ఎస్.కిషోర్ కుమార్,
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రజా ఉద్యమాల వారధి

ప్రజా ఉద్యమాల వారధిగా, కార్మిక ఉద్యమాల సారథిగా విద్యార్థి దశ నుంచే నాకు సైద్ధాంతిక భూమికను ఇచ్చిన అభ్యుదయ వాదుల్లో వి.జి.కె మూర్తి. ఆయన స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ వంటి అభ్యుదయ సంఘాల్లో కీలక భూమిక పోషించాను. స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ సంస్మరణార్థం ప్రియాగ్రహారంలో గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు నిర్వహణలో నాకు అండగా నిలిచారు. గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు నిర్వహిస్తున్న కార్యక్రమాలు గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం స్థాపనకు ఒక కారణమని నన్ను ప్రశంసించడం ఆయన ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వేదికగా ఆయన సారథ్యంలో సమ కాలీన సమస్యలు, అంశాలపై చర్చా వేదికలు, సెమినార్లు ఏర్పాటు చేసి ప్రజాచైతన్యానికి తన తుదివిశ్వాస వరకు శ్రమించిన అసలు సిసలైన వామ పక్షవాది. గతేడాది డిసెంబరు 18న శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చివరిసారిగా ఆయన ఆధ్వర్యాన సందేశాత్మక కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో గడిపిన ప్రతి క్షణం ఒక విజ్ఞాన భరితం ఒక సందేశాత్మకం.

– బాడాన రాజు,
గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి, పోలాకి

అన్నీ తానై...

అన్నీ తానై నిలిచి తన వ్యక్తిగత, కుటుంబ విషయాలన్నింటిలో వారధిగా నిలిచిన అన్నయ్యతో బాల్యం నుంచి ప్రత్యేక అనుబంధం, బహు అరుదైనవ్యక్తి, ఆణిముత్యం.

- సరోజ,
వి.జి.కె చెల్లెలు

ఉద్యోగుల శ్రేయోభిలాషి

కార్మికవర్గ ఉద్యమానికి, మధ్య తరగతి ఉద్యోగుల శ్రేయోభిలాషి. బిఎస్ ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ బలోపేతానికి నిరంతరం వెన్నుదన్నుగా నిలిచిన కామ్రేడ్ వి.జి.కె. మూర్తి అకాల మృతికి బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం జిల్లా కమిటీ తరుపున ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు విచారాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నాం.

– బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ

మంచి కమ్యూనిస్టును కోల్పోయాం

క్రమశిక్షణ, అంకితభావం కలిగిన మంచి కమ్యూనిస్టును కోల్పోయాం. వి.జి.కె మూర్తి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు, కార్మిక పోరాటాలకు తీరని లోటు. మూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- బి.వి రాఘవులు,
సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

ప్రజల కోసం పరితపించారు

ఆయన ఆకస్మిక మరణం బాధాకరం. ప్రజా సమస్యల కోసం ఆయన నిరంతరం తపించారు. కమ్యూనిస్టు పార్టీలో వ్యక్తిగా కాకుండా శక్తిగా ఎదిగారు. పండగ ముందే తన క్లాస్‌మేట్ మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణను పరామర్శించడానికి వచ్చారు. అప్పటివరకు ఆరోగ్యంగానే ఉన్న ఆయన ఆకస్మికంగా మరణించడం బాధాకరం.

- గుండ లక్ష్మీదేవి, మాజీ ఎమ్మెల్యే

ఆదర్శ మూర్తి వి.జి.కె

వి.జి.కె మూర్తి హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. డివైఎఫ్ఐ రాష్ట్ర బాధ్యతలు చూస్తున్న సమయంలో ఆయన పరిచయమ్యారు. జిల్లాలోని ఉద్యోగులు, శ్రీకాకుళం పట్టణంలో మధ్య తరగతి ప్రజల సమస్యలపై పనిచేస్తున్నట్లు చెప్పారు. దేశమంతా ఎమర్జెన్సీ అనంతరం వెల్లివిరిసిన ప్రజాతంత్ర వాతావరణం ఉన్నా జిల్లాలో 60వ దశకంలో సాగిన ఉద్యమం, దానిపై పాలకవర్గాల పాశవిక నిర్బంధం అనంతరం కొంత ఇబ్బందికరమైన పరిస్థితి ఉండేది. ముఖ్యంగా మధ్యతరగతి వారిని ఉద్యమాలకు సానుకూలంగా మలచడం, యువతను కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించడం కొంత కష్టమైన పనిగా ఉండేది. అలాంటి బాధ్యతను విజికె చేపట్టడం శ్లాఘించదగిన విషయం. గడిచిన మూడు, నాలుగేళ్లలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షునిగా ఆయన చేసిన కృషిపై జిల్లా సమీక్షల్లో తెలుసుకున్నాను. మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేస్తున్న తీరును ఆయన్ను అడిగి తెలుసుకున్నాను. స్వాతంత్ర్య సమరయోధుల వారసులను ఒకచోటకు చేర్చి సభ నిర్వహించడం స్ఫూర్తిదాయకం. శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించడానికి నాలుగు నెలల క్రితం వెళ్లినప్పుడు ఆ సందర్భంగా హాజరైన సభలోనే చివరిసారిగా ఆయన్ను కలిశాను. విగ్రహ ఏర్పాటుకైన పూర్తి ఖర్చు ఆయనే సొంతంగా భరించడమే గాక ఎన్నో విధాలుగా పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తోడ్పడ్డారు. అక్కడి మిగతా విగ్రహాల ఫలకాలపై దాతల పేర్లుండగా, ఈ విగ్రహానికి కనీసం అలా రాయడానికి కూడా అంగీకరించని గొప్ప దాత వి.జి.కె మూర్తి. పార్టీకి, ప్రజా ఉద్యమాలకు ఆయన ఎంతగానో కృషి చేశారు. ఆయన ఆకస్మిక మరణం తీరని లోటు. మూర్తి కుటుంబానికి, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పార్టీ రాష్ట్ర కమిటీ తరుపున వి.జి.కె మూర్తికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

- వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

పదవులకే వన్నె తెచ్చిన నేత

కామ్రేడ్ వి.జి.కె మూర్తితో నా అనుబంధం ఐదు దశాబ్దాలది. నేను ఎల్ఐసిలో ఉద్యోగిగా 1974లో చేరినప్పటికే వి.జి.కె విశాఖ డివిజన్ ఇన్సూరెన్స్ సంఘంలో ఒక గుర్తింపు ఉన్న నాయకుడు. దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలను ఐక్యపరచాలన్న విధానాన్ని శ్రీకాకుళంలో చాలా ప్రతిభావంతంగా అమలు చేయగలిగారు. అందరినీ ఆకట్టుకునే తీరు, అందరినీ కలుపుకొనిపోగలిగిన సహనం, భిన్నాభిప్రాయాలను స్వీకరించి సమన్వయపరచగల నైపుణ్యం కామ్రేడ్ వి.జి.కె ప్రత్యేకతలు. అన్నింటికీ మించి మూర్తీభవించిన మానవత్వం ఆయన వ్యక్తిత్వానికి ప్రధాన బలం. అందుకే అందరికీ ఆప్తుడు కాగలిగాడు. అజాతశత్రువు అనిపించుకోగలిగాడు.

శ్రీకాకుళం

ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్య వేదిక మొదలు జిల్లా సిఐటియు, శ్రీకాకుళం యూనివర్శిటీ సాధన సమితి వంటి అనేక ఐక్య వేదికలు, ఉద్యమ వేదికలను నిర్మించడంలో కామ్రేడ్ వి.జి.కె చూపిన చొరవ నేటితరానికి ఆదర్శప్రాయంగా ఉంటాయి. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం స్థాపన, నిర్వహణ కూడా ఆయన చొరవ ఫలితమేనని వేరే చెప్పనవసరం లేదు. ఉద్యమ సంబంధాలను ఎలా పలురూపాల్లో సంఘటితం చేసుకోవాలో మనం ఆయన వద్ద నుంచి నేర్చుకోవాలి. అనేకమంది కార్యకర్తలు, నాయకులు తమకు కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని చెప్తూ పరిమితులకు లోనవుతూ ఉండడం మనం చూస్తుంటాం. వి.జి.కె తన కుటుంబ సభ్యులనందరినీ ఉద్యమాల్లో భాగస్వాములుగా చేయగలిగారు. ఇదీ ఆదర్శప్రాయమే.

కామ్రేడ్ వి.జి.కె మూర్తి ఎన్ని పదవులను చేపట్టినా, ఆయన వల్ల ఆ పదవులకు గుర్తింపు వచ్చిందే తప్ప పదవుల కోసం, గుర్తింపు కోసం ఆయన ఎప్పుడూ పాకులాడలేదు. ఒక మంచి మిత్రుడిని, ఒక ఉద్యమశీలిని, ఆదర్శ నేతను కోల్పోవడం బాధాకరం. ఆయన బిడ్డలు శ్రీనివాస్, భారతి, స్రవంతికి, బంధుమిత్రులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- ఎం.వి.ఎస్ శర్మ,
ఎడిటర్ ప్రజాశక్తి బుక్‌హౌస్,
మాజీ ఎమ్మెల్సీ

విజికె గారికో నివాళి

అరుణ కిరణమొకటి
అవని విడిచి వెళ్లింది
కష్టజీవుల కంటిపాప
మింటికెగసి మెరిసింది
ఏడమ్మా ఏడి మా కామ్రేడ్ విజికె అంటూ
సిక్కోలు జనావళి భోరున విలపించింది

పోరాటాల యోధుడా
సమరశీల సైనికుడా
నమ్మినట్టి సిద్ధాంతానికై
నడుము కట్టి నిలచిన వాడా
జోహార్లు.. మీకు జోహార్లు
మా విజికె మీకు జోహార్లు!
విద్యార్థి దశ నుంచే
ఉద్యమాల నెంచుకొని
ఉద్యమ నిర్మాణానికి
ఉవ్వెత్తున పోరాడి
పేదసాద గుండెల్లో
చెరగని ముద్రవేసి
సిక్కోలు చరిత్రలో
చిరస్థాయిగా నిలిచావు
"పోరాటాల"

గరిమెళ్ల విజ్ఞాన కేంద్రాన్ని నిర్వహించి
సైద్ధాంతిక పరిమళాలు
నలుదిశల వెదజల్లి
మాతృ సంస్థ ఎల్ఐసి
పరిరక్షణోద్యమంలో
ఎనలేని పోరు చేసిన
ఆదర్శమూర్తివయ్యా...
"పోరాటాల"

నీటిలోన ఉన్న నీరంటనంత స్వచ్ఛంగా
నిజాయితీకే మీరు నిలువుటద్దమయ్యారు
మార్క్సిస్టు విలువలకే
చిరునామా అయ్యారు
"పోరాటాల"

సామ్యవాద పంథాయే
సర్వస్వమని నమ్మి
లౌకికవాదిగా మీరు
పోరుబాట నడిచారు
అందుకో.. కామ్రేడా మా విప్లవ జోహార్లు
అమరుడా వి.జి.కె మూర్తి
ఎర్ర ఎర్రని దండాలు
మా అందరి వందనాలు

రచన : స్టీల్ రామచంద్ర (శ్రీకాకుళం)

నిబద్ధతకు నిలువెత్తు రూపం

ఆత్మీయులు, సహచరులు విజికె అని, మూర్తి గారనీ ఆప్యాయంగా పిలుచుకునే వాడపల్లి గోపాలకృష్ణమూర్తి జనవరి 16న కన్నుమూశారన్న వాస్తవం జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉంది. ఉద్యమ నిర్మాణం కోసం నేను 1981లో శ్రీకాకుళం వచ్చినప్పటి నుంచి 1997లో రాష్ట్ర కేంద్రానికి వెళ్లేంత వరకు ఆయనతో, వారి కుటుంబసభ్యులతో సన్నిహితంగా మెలిగాను. ఆ కాలంలోనే కొన్నేళ్లు సిపిఎం జిల్లా కమిటీలో, కార్యదర్శివర్గం లో సహచరునిగా పనిచేసే అవకాశమూ నాకు కలిగింది. ఆ తర్వాత ఆయా సందర్భాల్లో కలిసినప్పుడు లేదా ఫోన్ సంభాషణలోనే అనేక విషయాలను చర్చించడం, కొన్నింటిపై కార్యాచరణను రూపొందించడమూ జరుగుతుండేవి. అంతగా పెనవేసుకున్న విజికె లేని శ్రీకాకుళం గురించి ఊహించడం చాలా కష్టమైంది. ఆ శూన్యత వలనే 17న జరిగిన సంతాప సభలో నోట మాట రాలేదు.

ఎల్ఐసి ఉద్యోగిగా 1973లో చేరిన విజికె తొలుత ఆ సంస్థలో ఉద్యోగుల యూనియన్ నాయకుడయ్యారు. ఆ తర్వాత కేవలం ఎల్ఐసికే పరిమితం కారాదని, మిగిలిన రంగాల్లోని ఉద్యోగులను, కార్మికులను ఆర్గనైజ్ చేయడం ప్రారంభించారు. ఆ కృషిలోనే శ్రీకాకుళం ఉద్యోగులు, కార్మికుల సమన్వయ కమిటీ రూపుదిద్దుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలకు చెందిన ఉద్యోగుల సంఘాలతో పాటు జట్టు కలాసీల (హమాలీ) యూనియన్లు కూడా అందులో భాగస్వాములు. అంతేగాక వివిధ అఫిలియేషన్లు కలిగిన వారు, అలాంటివి లేని వారు - ఒక విధంగా చెప్పాలంటే విభిన్న భావాలు, వైవిధ్యం, వైరుధ్యాలూ కలిగిన వారంతా కలిసిమెలసి పనిచేసిన సంస్థగా అది సుదీర్ఘ కాలం కొనసాగింది. దానికి కేంద్ర బిందువుగా నిలిచిందీ, అందరి మధ్య ఏకీభావం సాధించిందీ విజికె మూర్తి. అది అనితర సాధ్యం. మేడేను ఏటా ఘనంగా నిర్వహించడం ఓ ప్రధాన కార్యక్రమంగా ఉండేది. ఆ కృషిలో ఒక బృహత్ కార్యక్రమంగా పేర్కొనదగినది 1982 జనవరి 19న జరిగిన తొలి అఖిల భారత జనరల్ సమ్మె. కేంద్ర ప్రభుత్వం ఆనాడు తీసుకొచ్చిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని, కార్మికులు ఉద్యోగులకు కనీస వేతనాలు, రైతుకు మద్దతు ధర, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం వంటి 13 డిమాండ్లపై సాగిన చారిత్రాత్మక సమ్మె అది. శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు తొలుత అరెస్టు చేసింది విజికె మూర్తినే! జిల్లాలో వివిధ ఉద్యోగ సంఘాల నిర్మాణం, నిర్వహణకూ ఎంతగానో తోడ్పడ్డారు. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లోని శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సుదీర్ఘ పోరాటానికి వెన్నెముకగా నిలిచారు. ఇలాంటి ఉదాహరణలెన్నో! సిఐటియు జిల్లా వ్యవస్థాపక అధ్యక్ష బాధ్యతలను ఎంతో దక్షతతో నిర్వహించారు.

స్పష్టమైన ఉచ్ఛారణ, అవతలి వారికి నొప్పి కలగకుండా ఒప్పించగల సంభాషణా చతురత ఆయన సొంతం. ఆ సందర్భానికి, తాను చెప్పదల్చుకున్న భావాన్ని సరిగ్గా వ్యక్తం చేసే సరైన (ఎప్రోప్రియేట్) పదాలు వాడడం, అందుకు కొన్నిసార్లు అటు ఇంగ్లీషు ఇటు తెలుగు భాషలను ఉపయోగించేవారు. విజికె మంచి వక్త. మేధావులతోపాటు సాధారణ ప్రజానీకానికి సుబోధకంగా వివరించడంలో ఆయన దిట్ట. స్వతహాగా గాయకుడు, కళాకారుడు. ఆయనో ఆల్‌రౌండర్! సాహిత్యానికి, కళలకు, కళాకారులకు ఎంతో ప్రోత్సాహం అందించారు. శ్రీకాకుళ సాహితి, కథా నిలయం, రంగస్థల కళాకారుల సమాఖ్య వంటి సంస్థలకు సంపూర్ణ తోడ్పాటునిచ్చారు. అభ్యుదయ సాహిత్యాన్ని యువతకు, బాల బాలికలకూ అందించడానికి తుదివరకూ ఆయన తపన పడ్డారు. జిల్లా చరిత్ర, ప్రముఖ వ్యక్తుల విశిష్టతలూ ఆయనకు కరతలామలకం. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం స్థాపన, దాని నిర్వహణ, అధ్యక్ష బాధ్యతలను సమర్థవంతం గా నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణంలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పెంపొందించ డానికి, లౌకిక భావనలను వృద్ధి చేయడానికి ఆ సంస్థ చేపట్టిన కార్యక్రమాలు ఆదర్శవంతమై నవి. శ్రీకాకుళం గాంధీ స్మారక మందిరంలో స్వాతంత్ర్య సమరయోధుల సరసన సుందర య్య విగ్రహం ఏర్పాటు కోసం ఆయన ఎంతో తపన పడ్డారు. అందుకైన ఖర్చంతా సొంతంగా భరించారు. కానీ ఎక్కడా తన పేరుండకూ డదన్నారు. ఖర్చు చేస్తున్నారు కనుక మీ పేరు రాయాలనీ, మిగతా విగ్రహాలకు దాతల పేర్లు రాసి ఉన్నాయి కనుక దానికి మాత్రం ఎందుకు మినహాయింపు అంటూ కొందరం చెప్పినా ఆయన అలా రాయనివ్వలేదు.

వ్యక్తిగత, కుటుంబ జీవితంలో ఎన్నో కుదుపులు, ఒడిదుడుకులకు గురైనా ఆయన చెక్కుచెదరకుండా ప్రజా ఉద్యమాలకు అంకితమైన తీరు ప్రశంసనీయం. ఉద్యమం

కోసం త్యాగాల బాటలో నడచిన విజికె మరణానంతరం తన భౌతికకాయం కూడా మానవాళికి ఉపయోగపడాలన్న ఉదాత్త లక్ష్యంతో దేహ దానం చేయడం ఆదర్శప్రాయం. చెప్పింది చేయడం - చేసేది మాత్రమే చెప్పడం ఆయన విశిష్టత. నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకూ నిలిచిన ఆయన తన కుటుంబాన్ని, సన్నిహిత బంధువులను ప్రగతిశీల భావాల వైపు, వాటికి గట్టి మద్దతుదారులుగా నిలబెట్టారు. నయా ఉదారవాద విధానాల దుష్ప్రభావం పిల్లలపైన, కుటుంబాలపైన ఎంతగానో ఉన్న నేపథ్యంలో ఇది సామాన్య విషయం కాదు. విజికె భౌతికకాయాన్ని రిమ్స్ ఆస్పత్రికి అప్పగించిన సమయంలో ఆయన చిన్న కుమార్తె స్రవంతి 'మా నాన్నగారు ప్రత్యేకించి ఇది చెయ్యండి, అది చేయొద్దు అని మాకు చెప్పలేదు. కానీ ఆయన్ను చూసి ఏం చేయాలో, ఏం చేయకూడదో, ఎలా ఉండాలో మేం నేర్చుకున్నాం' అన్న మాటలు చెవుల్లో మార్మోగుతున్నాయి. జోహార్ కామ్రేడ్ విజికె!

- బి.తులసీదాస్
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

వి.జి.కె మూర్తి ఆదర్శ కమ్యూనిస్టు

వి.జి.కె మూర్తి తన జీవితమంతా కమ్యూనిస్టు సిద్ధాంత ఆశయ సాధన కోసం కృషి చేశారు. జిల్లాలో ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణంలో వి.జి.కె మూర్తి, కె.శ్రీనివాసు జంటగా పనిచేశారు. నీలం జూట్ కార్మికుల సమస్యలపై ఉద్యమం చేశారు. జిల్లాలో శ్యామ్‌పిస్టన్స్ కార్మికుల సమస్యలపై ఎనిమిది నెలల పాటు నిర్విరామంగా పనిచేశారు. కార్మికులకు న్యాయమైన జీతభత్యాలు సాధించుకోవడంతో పాటు తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాలు కల్పించగలిగారు. జిల్లాలో ప్రతి పరిశ్రమకు సిఐటియును విస్తరించడానికి ఆయన చేసిన కృషి అపూర్వం. సమస్యలపై పోరులో కార్మికులను ఒప్పించి వారికి స్ఫూర్తి కలిగించడం ద్వారా పోరాటాల్లో పాల్గొనేలా చేయడంలో ఆయన దిట్ట. ఆయన ప్రసంగాలు కార్మికులను ఆకర్షించేవి. సమస్యల పరిష్కారం



కోసం యాజమాన్యం విషయంలో కటువుగా వ్యవహరించేవారు. పైడిభీమవరం పారిశ్రామికవాడలో కార్మికులను సంఘటిత పరిచి పోరాటాలు చేయడంలో మంచి కృషి చేశారు. ఇతర ఆరోగ్య సమస్యలున్నా కష్టజీవుల ఉద్యమాల్లో పాల్గొనడానికి వెనుకాడలేదు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ద్వారా ఆయన మధ్యతరగతి ప్రజలకు మరింత చేరువయ్యారు. చివరి నిమిషం వరకు ఆ బాధ్యతలను నిర్వర్తించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు.

- సిహెచ్.నర్సింగరావు,
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

Sri VGK Murthy Garu

You have shown us the way and paved the path.
You have given us knowledge and been our guiding light.
You laid the foundation and stood as the unshakable pillar.
You have shown patience and instilled discipline.
You are the rock of the family.
The cornerstone,
The guiding line.
To us, you are a father: to some, a teacher.
To a few, a brother; to everyone else, a well-wisher.
You are the change that inspired.
You the are courage that led.
You are an artist, a singer, a writer.
You are a loving husband and a caring grandfather.
You are VGK: Vadapalli Golala Krishna Murthy.
But VGK stands for so much more-
You are Visionary, Generous, and Kind.
You are one of a kind.
You will be loved. You will be remembered.
You will live on in every heart you touched
Whenever I close my eyes to remember you
All I see is your beautiful, caring smile.
This is not mere praise.
This is not a eulogy.
These are words that spring from little heart that have known you for so many years.
Rest in peace, Peddananna garu

- Swapna ketavarapu





ప్రజా ఉద్యమాల నిర్మాణమే వి.జి.కెకి ఇచ్చే ఘన నివాళి

సిపిఎం పూర్వ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సిఐటియు జిల్లా ప్రథమ అధ్యక్షులు కామ్రేడ్ వి.జి.కె మూర్తి భౌతికంగా మరణించినా, నిరంతరం ఎర్రజెండాలో సజీవంగా ఉంటారు. ఆయన ఎల్‌ఐసిలో ఉద్యోగంలో చేరిన తర్వాత 1979లో పోస్టల్, టెలికం, బ్యాంకు, ఎల్‌ఐసి, పీర్‌లెస్, ప్రభుత్వ ఉద్యోగులతో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారు. పాలకుల నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఐక్య ఉద్యమాల

నిర్మాణానికి విశేషమైన కృషి చేశారు. ఆమదాలవలస షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ సమస్యలపై కామ్రేడ్స్ చాపర అప్పారావు, మెట్ట కొండయ్యతో కలిసి అనేక ఉద్యమాలు చేశారు. కామ్రేడ్ దిగుమర్తి విశ్వనాథంతో కలిసి శ్రీకాకుళం పట్టణంలో సినీ వర్కర్స్ యూనియన్, ప్రెస్ వర్కర్స్ యూనియన్, వంశధార లష్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆయా కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేశారు. ఒకమాటలో చెప్పాలంటే సిఐటియు జిల్లా ఉద్యమంలో తొలి తరం నాయకుల్లో కామ్రేడ్ విజికె మూర్తి ఒకరు.

1992 డిసెంబర్ 6న సిఐటియు జిల్లా ప్రథమ మహాసభలు శ్రీకాకుళం పట్టణంలో జరిగాయి. ఈ మహాసభల్లో ప్రథమ అధ్యక్షులుగా కామ్రేడ్ వి.జి.కె మూర్తి ఎన్నికయ్యారు. ఆ కాలంలో జిల్లాలో నీలం జూట్, వెంకట బాలాజీ జూట్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి సమ్మెలు జరిగాయి. సమ్మె కాలంలో నిరంతరం కార్మికులతో మమేకమై ఉండే వారు. గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి సమ్మె పోరాటానికి విశాల మద్దతు కూడగట్టేవారు. ఆయన ఉపన్యాసం గ్రామస్తులను ఆకర్షించే విధంగా ఉండేది. ఎవరైనా ప్రశ్నిస్తే ఎంతో నమ్రతతో సమాధానాలు చెప్పేవారు. గ్రామసభలకు వెళ్లేటప్పుడు తీవ్రమైన మంచు, చలి ఉన్నా సమయానికి గేటు మీటింగ్స్‌కు హాజరయ్యేవారు. ఏదైనా పని అనుకుంటే దాన్ని సాధించే వరకు చివరి వరకు కొనసాగించేవారు. వ్యక్తిగత ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాలకు క్లాష్ వచ్చినప్పుడు వ్యక్తిగత ప్రయోజనాలు పక్కనపెట్టి, పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే వారు. ఇందుకు శ్యామ్‌పిస్టన్స్ కార్మికుల సమ్మె ఒక ఉదాహరణ మాత్రమే. శ్యామ్‌పిస్టన్స్ కార్మికుల సమ్మె జరుగుతుంది, అదే సమయంలో ఆరోగ్యం బాగా లేక హైదరాబాద్‌లో గుండె ఆపరేషన్‌కు బయలుదేరారు. ఆపరేషన్ తేదీన స్టేట్ లేబర్ కమిషనర్ వద్ద జాయింట్ మీటింగ్ ఉంది. హైదరాబాద్ వెళ్లి ఆపరేషన్ వాయిదా వేసుకుని జాయింట్ మీటింగ్‌కు హాజరయ్యారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కార్మిక వర్గం, ప్రజల కోసం తన యావత్ జీవితం పనిచేసిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ వి.జి.కె మూర్తి.

వాసవి జూట్ కార్మికుల పోరాటానికి మద్దతుగా అనేక సంఘాలతో కార్యక్రమాలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సిఎఎకు వ్యతిరేకంగా సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించడంలో కీలక భూమిక పోషించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యం సందర్భంగా సమరయోధుల వారసులకు సన్మాన కార్యక్రమం చేసి వారందరితోనూ పరిచయాలు కొనసాగించడంలో మంచి కృషి చేశారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శిగా సాంస్కృతిక రంగంలో తనదైన శైలిలో కృషి చేశారు. శ్రీకాకుళం నగరంలో తాను చదువుకున్న ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులను సమీకరించి నిధుల సమీకరణ చేసి భవన నిర్మాణం కోసం కృషి చేశారు. తన యావత్ జీవితం ఉద్యమాలకు అంకితం చేసిన వ్యక్తి కామ్రేడ్ వి.జి.కె మూర్తి. చనిపోయిన తర్వాత కూడా కళ్లతో పాటు వైద్య కళాశాల విద్యార్థులకు పరిశోధన కోసం తన శరీరాన్నీ దానం చేసిన గొప్ప వ్యక్తి. ప్రజా ఉద్యమాలను నిర్మించడమే ఆయనకు మనం ఇచ్చే నివాళి.

- డి.గోవిందరావు
సిపిఎం జిల్లా కార్యదర్శి







వ్యక్తిత్వానికి అదనపు ఆభరణం

2022 జూలై 6న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, తెలుగు విభాగం దగ్గరికి ఒక పెద్దాయన వచ్చారు. ఆయన తనను కలిసి జూలై 15న గరిమెళ్ల సత్య నారాయణ జయంతి సందర్భంగా శ్రీకాకుళం ఎన్‌జిఒ హోంలో ప్రసంగి ంచడానికి ఆహ్వానించారు. వారే వి.జి.కె.మూర్తి. జూలై 15న తన ప్రసంగం తర్వాత మాటల్లో మా తాతగారైన కళ్లేపల్లి ఉమామహేశ్వరరావు దగ్గర వారు చదువుకున్నారని చెబుతూ నాటి నుంచి చివరిదాకా తనపై వారు చూపిన వాత్సల్యం నా జీవితంలో ఎప్పటికీ ప్రత్యేకమే. కేతవరపు శ్రీనివాస్‌ని పరిచయం చేసి సాహితీ స్రవంతిలో సభ్యునిగా చేరడానికి, శ్రీకాకుళంలో గొప్ప సాహితీ మిత్ర బృందాన్ని నేను పొందడానికి కూడా ప్రధాన కారణం వి.జి.కె. మూర్తి. యూనిఫాం, సివిల్ కోడ్ తీవ్రతను తెలియజేసే దృష్టితో విశ్వ విద్యాలయంలో కార్య క్రమాన్ని ఏర్పాటు చేయడం మొదలు మొన్న జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహణ వరకు వారితో సన్నిహితంగా మెలిగే అవకాశం నాకు దక్కింది. పై సంఘటనలన్నీ భౌతికంగా వారితో నా సాన్నిహిత్యాన్ని ప్రకటిస్తాయి. వారి మైత్రి నాకు విస్తృతమైన ఆలోచన సరళిని, విభిన్న పార్శ్వాల్లో సమస్యను అర్థం చేసుకోగలిగిన సామర్థ్యాన్ని, సామాజిక అవగాహనను పెంపొందించాయి. మృదుత్వం, చమత్కారంతో కూడిన సంభాషణలో లోతైన భావజాలాన్ని వ్యక్తం చేయగలగడం మూర్తి వ్యక్తిత్వానికి అదనపు ఆభరణం. తన కవితా సంపుటి పరిచయ సభలో వారి ప్రసంగం ఎప్పటికీ మర్చిపోలేనిది. తన జీవితాన్ని అనూహ్య పథంలోకి మార్చి వేగవంతం చేసిన ఆయన మరణం చాలా కుంగదీసింది. భవిష్యత్ ప్రణాళికలను కుంటుపడేలా చేసింది. శూన్య స్థితిలోకి మెదడు నెట్టేసింది. అటు ఉద్యమాలలో, ఇటు సాహిత్య రంగంలో శ్రీకాకుళం జిల్లా ప్రజానీకానికి మళ్లీ ఎప్పటికీ కోలుకుంటామో అనే భయాన్ని కలిగించిన మూర్తి మరణం ఎప్పటికీ మరువలేని ఉపద్రవమే.

- డాక్టర్ కె.ఉదయ్ కిరణ్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,
డా. బిఆర్ఎయు విశ్వవిద్యాలయం,
ఎచ్చెర్ల

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

1997లో పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ లిమిటెడ్ పరిశ్రమలో సిఐటియు అనుబంధ యూనియన్ ఏర్పాటు చేసిన సందర్భంగా కార్మికులతో సమావేశం నిర్వహించి పరిశ్రమ వివరాలు సేకరించి పరిశ్రమ ఏర్పాటు చేయడానికి అయ్యే ఖర్చు, ఉత్పత్తి ఎంత చేస్తున్నారు, వేతనాలు ఎంత చెల్లిస్తున్నారు, యాజమాన్యం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా, ఎటువంటి చట్టాలు అమలు చేయకుండా దోపిడీ ఎంత తీవ్రంగా చేస్తుందో వివరించి కార్మికులను పోరాటానికి సన్నద్ధం చేయడంలో వి.జి.కె మూర్తి మంచి పాత్ర పోషించారు. 8 నెలల పాటు కార్మికులతో సుదీర్ఘ సమ్మె నడి పించడంలో వి.జి.కె.మూర్తి కృషి ఎనలేనిది. శ్యాం పిస్టన్స్ కార్మికుల పోరాటంతో పాటు అప్పటికే రాజాంలో వాసవి జ్యూట్ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. ఆమదాలవలస వెంకట బాలజీ జ్యూట్ మిల్ అక్రమ లాకౌట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల నేపథ్యంలో 1998లో అప్పటి కలెక్టర్ ఎస్.ఇ. శేఖరబాబుకు కార్మికులు పడుతున్న ఇబ్బందులు, సమస్య వివరించి వెంటనే జోక్యం చేసుకొని మూడు పరిశ్రమల సమస్య పరిష్కారానికి చేసిన కృషి కార్మికుల గుండెల్లో ఇప్పటికీ మరిచిపోలేని విషయం. తాను ట్రేడ్ యూనియన్ నాయకుడుగా అభివృద్ధి కావడానికి, 2002లో పూర్తికాలం కార్యకర్తగా రావడానికి ఆయనే కారణం. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చు కున్నాను. నాకు ఆయనే స్ఫూర్తి.

- పి.తేజేశ్వరరావు,
సిఐటియు, జిల్లా ప్రధాన కార్యదర్శి

విజికె వ్యక్తిత్వం అపూర్వం

వి.జి.కె మూర్తి సుమారు 50 ఏళ్ల నుంచి పరిచయం. ఆయన మరణవార్త జీర్ణించు కోలేక పోతున్నాం. ఆయన వ్యక్తిత్వం అపూర్వం. మనసు వెన్నపూస. ఆయన పలకరింపు ఒక మధురం. ఆయన మాటలు అతి సున్నితం. ఆచి తూచి మాట్లాడడం ఆయనకే సొంతం. ఇతరుల మనసు నొప్పించకుండా, చేసిన తప్పులు చెప్పడంలో కడునేర్పరి. ఆయనకున్న సహనం సముద్రం కన్నా గొప్పది. వి.జి.కె నుంచి పొందిన స్ఫూరి కారణంగా తాను ఆదర్శ వివాహం చేసుకోవడం, ఆయనే మా వివాహాన్ని దగ్గరుండి జరిపించడం మరచిపోలేనిది. యూనియన్ ఎలా నడపాలి, అందులో ప్రజాతంత్ర యుతంగా ఎలా మెలగాలి నేర్పిన నేర్పరి. అనేక సమావేశాల్లో ఆయన చేసిన ప్రసంగం నదీ ప్రవాహంలా సాగేది. ఆయన హాజరైన అన్ని సమావేశాల్లోను ఆయన ప్రసంగం ఉండేది. ఆయన చేసిన సామాజిక సేవ ఆదర్శం. ఆయన తన ఇంటి పక్కనే ఉండడం కారణంగా ఆయనతో ఎంతో సాన్నిహిత్యం పొందే అవకాశం దక్కింది. చాలా సందర్భాల్లో ఆయన సలహాలు తీసుకుని వాటిని పాటించడం ఎంతో సంతృప్తినిచ్చింది. అంతే కాకుండా ఆయన గుణగణాలు, నడవడిక, వ్యక్తిత్వం తనను ఎంతో ప్రభావితం చేశాయి. ఆయన ఆశాయాలు ముందుకు తీసుకెళ్లడమే మనందరి కర్తవ్యంగా ఉండాలి.

- ఎం.వి కామేశ్వరరావు,
జీవిత బీమా విశ్రాంత ఉద్యోగి

అన్ని వర్గాలకు ఆత్మీయులు

జనవరి 16, 2025న శ్రీకాకుళం జిల్లా వామపక్ష, కార్మిక, ఉద్యోగులకు ఒక మరపురాని దుర్దినం. సిపిఎం సీనియర్ నాయ కులు కామ్రేడ్ వి.జి.కె. మూర్తి చివరిగా విద్యుత్ బిల్లులు భోగి మంటలలో వేసి నిరసన తెలియజేసే కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపి అనంతరం ఆస్పత్రిలో అశువులు బాశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయనకు జిల్లా పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం తరపున శ్రద్ధాంజలి. వి.జి.కె.మూర్తి సిపిఎం సీనియర్ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు మాత్రమే కాకుండా ఒక రచయిత, గాయకులు, చిత్రకారులు, నటులు, ఒక మంచి ఆర్గనైజర్, అన్ని వర్గాలకి ఆత్మీయులు. అన్ని రంగాల్లో నైపుణ్యం, ప్రతిభ కలిగి ఉండటం అనితర సాధ్యం. ఆయన మృదువైన సంభాషణ, లక్ష్యంపై నిజాయితీ అందరం అలవాటు చేసుకోదగినదే. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా పోస్టల్ ఉద్యోగులకు, ఉద్యోగ సంఘాల పోరాటాలకు ఆయన ఊపిరి. పోస్టల్ ఉద్యోగ సంఘాలు, కార్మికవర్గ దృక్పథంతో సమరశీలంగా పని చేస్తున్నాయంటే ఆయన 80 దశకం నుంచి చూపించిన శ్రద్ధ కారణం. పోస్టల్ ఉద్యో గుల సమ స్యలపై అధ్యయనం, వారిని కార్యకర్తలుగా తీర్చిదిద్దటం, చైతన్య పర్చడంలో ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. జిల్లాలో విజికె.మూర్తి, శ్రీనివాస్, ప్రభాకర్, ఆదినారాయణ మూర్తి ఎల్ఐసి నుంచి వచ్చి వామపక్ష అభివృద్ధికి వారు నేటకీ చూపిస్తున్న చొరవ, కృషి అనుసరణీయం.

- జ్యోతీశ్వరరావు,
పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం,
శ్రీకాకుళం

ప్రజా ఉద్యమాల నిర్మాణంలో కీలకపాత్ర

జిల్లాలో ప్రజా ఉద్యమాలను నిర్మించి, నడపడంలో విజికె మూర్తి కీలక పాత్ర వహించారు. జ్యూట్ మిల్లు, శ్యామ్‌పిస్టన్స్ కార్మికుల పోరాటాలకు ఆయన బాసటగా నిలిచారు. గరిమెళ్ల విజ్ఞానం కేంద్రం ద్వారా మధ్యతరగతి ఉద్యోగులు, మేధావులకు ఆయన దగ్గర కాగలిగారు. ఏ కార్యక్రమం తీసుకున్న అది పూర్తయ్య వరకు పట్టుదలగా వ్యవహరించేవారు. కరోనా సమయంలోనూ ప్రజలకు ఆయన అనేక సేవలు అందించారు. జిల్లాలో ఉన్న అన్ని సమస్యలపై అవగాహన కలిగి ఉండేవారు. ఆయన ఆదర్శవంతమైన వ్యక్తి.

- కె.మోహనరావు,
జిల్లా కార్యదర్శి, రైతు సంఘం

పలు రంగాల్లో విశేష కృషి

సమాజంలో ఏ రంగం అభివృద్ధిలోనైనా తనవంతు పాత్ర పోషించే గొప్ప వ్యక్తి విజికె మూర్తి. ఉద్యోగ, కార్మిక సంఘాల నేతగా తొలుత సమాజానికి పరిచయమైనా సాహితీ రంగ వికా సంలోనూ, జిల్లా సమగ్ర అభివృద్ధి లోను, విద్యారంగ ప్రగతిలోనూ తన ముద్ర ఉందని నిరూపించుకోగలిగారు ఆయన. ఎచ్చెర్లలో పిజి సెంటర్‌ను యూనివర్సిటీగా రూపొందించడానికి యూనివర్సిటీ సాధన సమితి ఏర్పాటు చేసి పోరాటం సాగించారు. మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిం చారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి సాహితీరంగ అభివృద్ధి కొత్త తరం సాహితి రంగంలో ప్రవేశించేందుకు అవకా శాలు కల్పించిన నేతగా మూర్తి ఎందరికో స్ఫూర్తి. సిక్కోలుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను పుస్తక రూపంలో తీసుకు రావడంతో పాటు సమరయోధుల కుటు ంబాలను ఒక వేదికపైకి తీసుకురావడం ఈయన ఎన్నో ఏళ్ల కృషి ఫలితం. మూర్తి పేరు చిరస్థాయిగా నిలవాలంటే మున్సిపల్ హైస్కూల్‌లో కొత్తగా నిర్మించే ఓ భవనానికి పాలకులు ఆయన పేరు పెట్టాలి.

- కొంక్యాన వేణుగోపాల్,
రాష్ట్ర కార్యదర్శి, ఎపిడబ్ల్యుజెఎఫ్
ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు, శ్రీకాకుళం

ఉద్యమాలకు మార్గనిర్దేశకులు

ప్రభుత్వ స్కీం వర్కర్ల సమస్యల పై పూర్తి అవగహన ఉన్న నాయ కుడు విజికె మూర్తి. గత అను భవా లను నిరంతరాయంగా నేటి ఉద్యమ సమయాన మార్గ నిర్ధేశం చేసేవారు. అంగన్వాడీ కార్య కర్తలు, సహా యకుల ఉద్యమ కాలంలో ఆయన అందించిన సహకారం మరచిపోలేం. సమ్మె కాలంలో మనోధైర్యం కోల్పో కుండా ఆయన ఇచ్చి న సూచనలు ఎంతగానో ఉత్సాహాన్ని ఇచ్చేవి. ఆయన లేనిలోటు తీరనిది.

- డి.సుధ,
ప్రధాన కార్యదర్శి,
అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజల మదిలో సుస్థిర స్థానం

విజికె మూర్తి అనేక ఉద్యమాల సందర్భంగా సన్నిహితంగా ఉండే వారు. ఆయన ఏ విషయంపై మాట్లాడిన స్పష్టతను ఇచ్చేవారు. తాను ఎక్కువ సందర్భాలలో సమ కాలిన అంశాలపై చర్చించే దాన్ని. ఆ క్రమంలోనే విజయనగరం జిల్లాలో అనేక ప్రాంతాల్లో స్టడీసర్కిల్స్ పెట్టేటప్పుడు, సదస్సులు ఆర్గనైజ్ చేసేటప్పుడు వక్తగా పిలిచాం. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా స్టడీ చేసి చెప్పేవారు. అందరితో స్నేహ భావంతో ఉండేవారు. మధ్యతరగతి ఉద్యోగుల్లో మంచి సంబంధాలు, కార్మికవర్గ దృక్పథం నుంచి విశ్లేషణ చేయడం ఆయన ప్రత్యేకత. అటువంటి నాయకుడిని కోల్పోవడం బాధాకరం. ఆయన ఆశయాలను అమలు చేయడమే ముఖ్యమైన కర్తవ్యంగా భావిస్తున్నా.

- కె.విజయగౌరి,
ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

మరువలేని వ్యక్తిత్వం

విజెకె మూర్తి తో తనకు సుమారు 25 ఏళ్ల అను బంధం ఉంది. బ్యాంకింగ్ రంగ సమస్యలు, కార్మిక ఉద్యమాలపై బ్యాంకు అధికారిగా ఆయనతో చర్చిస్తూ ఉండేవాడిని. ఆయనకున్న అపారమైన జ్ఞానంతో నాకు సలహాలు, సూచనలు ఇస్తూ ఉండే వారు. సైన్స్, సమకాలిన రాజ కీయాలు, మార్క్సిజం భావాజాలంపై అబి ప్రాయాల్ని పంచుకునే వాళ్ళం. నా వ్యక్తిగత జీవితంలో కూడా ఆయన నాకు నైతిక ధైర్యాన్ని ఇచ్చారు. దన్నుగా నిలిచారు. ఆయనతో నాకున్న సాన్నిహిత్యాన్ని నేను మరువలేను. ఆయన జీవితం స్ఫూర్తి దాయకం. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా.

- ఐ.జగన్మోహనరావు, విశ్రాంత బ్యాంకు అధికారి (పంజాబ్ నేషనల్ బ్యాంక్) శ్రీకాకుళం

ప్రజా ఉద్యమాల నిర్మాణ సారధి

సమాజంలో ఎక్కడ సమస్య ఉందని గుర్తించినా దీన్ని పరిష్కరించేందుకు మూలాలను వెతికి ఉద్యమాన్ని నిర్మించడంలో విజికె మూర్తి నిష్ణాతులు. జిల్లాలో ఉన్నత చదువులు చదువు కోవాలంటే విశాఖ వరకు వెళ్లాల్సి వచ్చేది. అటువంటి సమయంలో సమస్యను గుర్తించి జిల్లాలో ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో పీజీ సెంటర్ సాధన కోసం ఉద్యమాన్ని నిర్మించారు. ఈ ఉద్యమంలో ఆయనదే కీలక పాత్ర. ఆతర్వాత పీజీ సెంటర్ స్థాయిని యూనివర్సిటీ స్థాయి సాధించడంలోను ఆయన కృషి ఎంతో ఉంది. ఉద్యోగంలో ఉన్నప్పుడే వామపక్ష ఉద్యమాల్లో చురుగ్గా వ్యవహరించిన ఆయన సిఐటియు బాధ్యతలను చేపట్టారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యక్ష ఉద్యమాల్లో కీలకంగా లేకపోయినా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి అనేక సూచనలు, సలహాలు అందించారు. నాటి విభజన ఉద్యమం మొదలు నేటి విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం వరకు ప్రతిచోట ఆయన భాగస్వామ్యం కనిపించేది.

- హనుమంతు సాయిరాం,
ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు

ఆయన స్ఫూర్తిని మరువలేం

ఉద్యమాల్లో కష్ట నష్టాలు ఎదురైనపుడు నిరాశ చెందకుండా ఉండేందుకు ఆయన చెప్పిన మాటలు నేటికీ గుర్తున్నాయి. అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్మికులు, శ్రామికుల్లో బతుకుపై నమ్మకం పెరగాలంటే ఉద్యమాలు చేయాలని చెప్పేవారు. ఆయన తరగతులకు వస్తే చైతన్యం పెంచే విధంగా మాట్లాడి ఉత్సాహాన్ని నింపేవారు.

ఆశ కార్యకర్తలు సమిష్టిగా ఏకతాటిపైకి తీసుకురావడంలో ఆయన ఇచ్చిన స్ఫూర్తి మరిచిపోలేం.

- అమరావతి, జిల్లా అధ్యక్షులు
ఆశావర్కర్స్ యూనియన్

హఠాన్మరణం కలచివేసింది

విజికె మూర్తి హఠాన్మరణం ఎంతో కలచి వేసింది. గత 25 ఏళ్లగా నాపై ఆయన పెట్టుకున్న నమ్మకం ఎంతో సంతృప్తినిచ్చేది. ఉన్నత భావాలు, వ్యక్తీకరణ కలవారిగా పరస్పర అభిమానంతో మా ప్రయాణం సాగింది. కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా.

- డా.సి.వి రావు, చీఫ్ కార్డియాలజిస్ట్,
కేర్ హాస్పిటల్, విశాఖపట్నం

అభ్యుదయ ఉద్యమాలకు తీరని లోటు

సిపిఎం నాయకులు వి.జి.కె మూర్తితో కలిసి నాలుగున్నర దశాబ్దాలకు పైగా పని చేశాను. మూర్తి మృతి చాలా బాధాకరం. వివేకం, సౌమ్యం, హుందాతనం, పనిపై నిబద్ధత, ప్రజలపై నమ్మకం, తాను నమ్మిన సిద్ధాంతంపై అచంచల విశ్వాసం వంటి గొప్ప లక్షణాలను పుణికి పుచ్చుకున్న వ్యక్తి. ఆయన మూర్తీభవించిన మానవతా వాది. తన అభిప్రాయంతో విభేదించే వారితో కూడా చిరునవ్వుతో కలిసి పోవడం, అన్ని తరగతుల ప్రజలతో విస్తృత సంబంధాలు కలిగి ఉండడం వంటి లక్షణాలు ఆయన సొంతం. సిద్ధాంతాన్ని వల్లె వేయడం గాక, దాన్ని ఆచరించడంలో ముందుండే ఆచరణ వాది ఆయన. చిన్న చిన్న పనులను సైతం ఎంతో ప్రణాళికాబద్ధంగా చేసేవారు. గత పదేళ్లుగా ఆయన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక వ్యవస్థాపక ఉపాధ్యక్షునిగాను, నేను ప్రధాన కార్యదర్శిగానూ ఉంటూ జిల్లాలో విస్తృతంగా పర్యటించాం. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ముఖ్యంగా జిల్లా నీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఉద్దానం కిడ్నీ వ్యాధి, పారిశ్రామిక కాలుష్యం, ఎచ్చెర్లలో ట్రిపుల్ ఐటి తరగతుల ప్రారంభం వంటి అనేక సమస్యల పరిష్కారానికి, ఈ ప్రాంత ప్రజల మద్దతు కూడగట్టడానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉండేవారు. తాను చదివిన స్కూల్ అభివృద్ధి కమిటీ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వంటి సంస్థలకు ప్రధాన బాధ్యత వహించారు. ఆయన మృతి అభ్యుదయ ఉద్యమాలకు తీరని లోటు. మూర్తికి అరుణాంజలి. వారి కుటుంబ సభ్యులకు, సహచరులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాం.

- ఎ.అజశర్మ, ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఉద్యమ సహచరుడు

ఉద్యమ సహచరుడు. మా కుటుంబ ఆప్తమిత్రుడు మూర్తి ఆకస్మిక మృతి జీర్ణించుకోలేకపోతున్నాం. 1973లో జీవిత బీమా సంస్థలో ఒకేసారి చేరిన నాటి నుంచి ప్రారంభమైన మా ఇరువురి ప్రయాణం ఇంత వేగంగా ముగుస్తుందని ఏనాడూ ఊహించలేదు. స్నేహం, ప్రేమ, అప్యాయత, నమ్రత, వితరణ, సమయంలో ఆదుకోవడం, సలహాలు, సామాజిక అవగాహన, సమస్యలపై తక్షణం స్పందించడం, ఇలా ఏ విషయంలో చూసుకున్నా ఆయనకు ఆయనే సాటి. మా పెద్ద కుమారుడి ఆదర్శ వివాహాన్ని ఆయనే నిర్వహించడం దగ్గర నుంచి మా కుటుంబానికి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లోనూ, ఆయన మాకు చేదోడుగా నిలిచారు. ఉమ్మడి కుటుంబ జీవనాన్ని ఏ విధంగా నిర్వహించాలో ఆయనను చూసి మేము నేర్చుకున్నాం. ఏ విషయాన్నైనా కూలంకుషంగా అధ్యయనం చేయనిదే ఆయన స్పందించరు. ఎదుటి వారి చెప్పినది పూర్తిగా వినడం ఆయనకున్న గొప్ప ఆభరణం. జీవిత బీమా ఉద్యోగుల సంఘ సభ్యులుగా ప్రారంభమైన మా ఉద్యమ ప్రస్థానం, ప్రయాణం కార్మిక రంగంలోను, ఉద్యోగులు, కార్మికుల సమన్వయ సంఘంలోను, ప్రజాతంత్ర ఉద్యమాల్లోనూ, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నుంచి నేటి గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వరకు కొనసాగింది. ఇన్నేళ్ల మా ప్రయాణంలో ఆయనను నేను సంప్రదించని రోజులు అరుదుగా ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు. సమస్యలపై అవగాహన, ఉద్యమాలు కార్యక్రమాల రూపకల్పన నుంచి అమలు వరకు ఆయన శైలి ప్రత్యేకమైంది. ఆయన లేని లోటు ఎవరూ పూడ్చలేనిదైనా, ఆయన ఆశయాలను, వదిలిన కర్తవ్యాలను చేపట్టడం, అందుకు తగిన ఉద్యమ నిర్మాణం చేపట్టడమే ఘన నివాళిగా భావిస్తూ... మా శక్తి మేరకు కృషి చేస్తానని తెలియజేస్తున్నాం. ఆయన కుటుంబ సభ్యులకు మా కుటుంబ సభ్యుల తరుపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

- మండ ప్రభాకరరావు,
గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి

త్యాగశీలి

వి.జి.కె మూర్తి కార్మిక, కర్షక, ఉద్యోగుల పక్షాన నిలబడి ప్రజల గొంతుకై నిరంతరం ఉద్యమంలో ఉన్న వ్యక్తి. ఈయన పోరాట పటిమ, ప్రజలను చైతన్య పరచడం, ప్రజల భావాలను తెలుసుకొని దానికి అనుగుణంగా పయనించే వ్యక్తి. నిరంతరం ప్రజల పక్షాన ఉండి హక్కులకై పోరాడే ఇటువంటి వ్యక్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. చనిపోయిన తరువాత కూడా తన శరీర భాగాలను ప్రయోగశాలకు అప్పగించిన త్యాగజీవి. ఎందరికో ఉద్యమ పంథాలు నేర్పిన నిత్య గురువు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ద్వారా సాహిత్యం పంచిపెట్టిన విశాల హృదయుడు. ఆయనకు మరణం లేదు. మనము చేసే ప్రతి పోరాటంలోనూ ఆయన మనతోపాటే ఉంటారు.

- బమ్మిడి శ్రీరామ్మూర్తి,
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యమాల స్రవంతి

వి.జి.కె మూర్తితో 36 ఏళ్ల అనుబంధం నాది. 1989లో నేను ఉపాధ్యాయునిగా చేరిన దగ్గర నుంచి మూర్తి నాకు మంచి మార్గనిర్దేశం చేశారు. యుటిఎఫ్‌లో, జనవిజ్ఞాన వేదికలో ఉద్యమ అభివృద్ధికి నాకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవారు. ఎంతటి జఠిలమైన సమస్య అయినా ఆయన దృష్టిలో పెడితే చిరు నవ్వుతో పరిష్కార మార్గాలను చూపేవారు. ఆయన నడవడిక, ప్రవర్తన, పనిచేసే విధానం, సమస్యలపై దూసుకుపోయేతత్వం నన్ను కట్టి పడేసేవి. అలాగే నన్ను ఎంతగానో ఆకర్షించేవి. అందువల్లేనే అనతి కాలంలోనే అతనికి అభిమానిగా మారిపోయాను. ఇద్దరమూ పరస్పరం కుటుంబ విషయాలు, సంఘ విషయాలు, ప్రజాతంత్ర ఉద్యమ విషయాలు అనేక సారులు ముచ్చటించుకునే వారం. ఆ చర్చలే పారే స్రవంతిలా నన్ను మరింత ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు ఉరకలేసే దానికి దోహదం చేశాయి. అటువంటి మహోన్నత వ్యక్తి దూరం కావడం నేను జీర్ణించుకోలేకపోతున్నాను. ఇది రాయడానికి కూడా చాలా ఇబ్బంది పడ్డాను.

- కొత్తకోట అప్పారావు
జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక
జిల్లా కార్యదర్శి

మూర్తి లేని లోటు తీరనిది

1986లో పలాసలో పంచాయతీరాజ్ జూనియర్ ఇంజినీర్‌గా పనిచేసినప్పుడు వి.జి.కె మూర్తితో పరిచయం ఏర్పడింది. వామపక్ష భావజాలం ఉన్న వ్యక్తులకు ఎంతో ఆదర్శప్రాయం కలిగించారు. ఇప్పుడు మన మధ్య లేకపోవడం తీరనిలోటుగా భావిస్తున్నాను. కార్మికుల హక్కుల కోసం, సైన్స్ ఉద్యమం కోసం ఎంతో కృషి చేశారు. వామపక్ష భావజాలం ఉన్న వ్యక్తులతో పాటు.. న్యూట్రల్‌గా ఉన్న వ్యక్తులతోనూ మంచి సంబంధాలు ఏర్పరచుకున్నారు. అలాంటి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులు జిల్లాకు ఒకరు ఉంటే వామపక్ష ఉద్యమం ఎంతో బలపడుతుంది.

- ఎం.వి.ఆర్.కృష్ణాజి,జన విజ్ఞాన వేదిక
జాతీయ ప్రధాన కార్యదర్శి

అందరివాడు

వి.జి.కె మూర్తితో నా అనుబంధం సుదీర్ఘమైనది. విద్యార్థి దశ నుంచి 35 ఏళ్లుగా నా విద్యార్థి దశలో కొన్ని విలువలు నేర్చుకున్నాను. 1994 నుంచి ఒక ప్రయివేట్ ఉపాధ్యాయులుగా రూ.650 నెల జీతంతో ప్రారంభించిన నా జీవన యాత్ర మూర్తి ఇచ్చిన అత్యంత విలువైన సందేశం. నేడు శ్రీసాయి విద్యా మందిర్ అనే ఒక విద్యా సంస్థ స్థాపనకు స్ఫూర్తి నిచ్చి ఒక విద్యా సంస్థ అధినేతగా సుమారు 70 మందికి పైబడి నిరుద్యోగ, ఉపా ధ్యాయులకు ఉపాధి కల్పిస్తున్న నిర్వహకుడిగా సమాజంలో ఒక గౌరవ స్థానంలో ఉన్నాను. ఆ మహనియడు భౌతికంగా మన మధ్య లేకపోయి నా కోపతాపాలు ఎరుగని ప్రేమ పూర్వక చిరునవ్వుతో కూడిన మధుర స్మృతులు చిరస్థాయి గా హృదయంలో నిలిచి ఉంటాయి. భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇటీవల ఆయన ప్రత్యేక కృషితో హైస్కూల్ దశ లోనే దేశంపై, భారత రాజ్యాంగ మౌలిక అంశాలపై, కేవలం హక్కుల కోసం ఆరాటపడడం కంటే ప్రాథమిక విధులలపై సంపూర్ణ అవగాహన పెంపొందింపచేయాలనే సత్సంకల్పం ఉండేది. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో చదువుతున్న హైస్కూల్ విద్యార్థులచే అన్ని పాఠశాలల్లో ఒకేరోజు సామూహిక రాజ్యాంగ ప్రవేశిక పఠనం చేయించడం ద్వారా ఆయన అకాల మరణం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అంతర్లీనంగా ఒక గొప్ప బాధ్యతలను అప్పజెప్పి వెళ్లినట్లు అయ్యింది. ఆయన ఇక లేరు అన్న భావన జీర్ణించుకోలేకపోతున్నాం. ఆయన నేత్రాల ద్వారా ఇద్దరి అంధులకు అంధకార ప్రపంచం నుంచి వెలుగును ప్రసాదించారు. భౌతిక దేహం బూడిదలో కలిసి పోకుండా పాత కాలపు పట్టింపులు పక్కన పెట్టి భావితరాల వైద్య విభాగానికి విద్యార్థులకు ప్రత్యక్ష పాఠ్యాంశంగా, తద్వారా ఆ సమాజంలోని ఎందరో హృదయాల్లో... సజీవంగా ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులూ భౌతిక దేహాన్ని స్వయంగా వైద్య విభాగానికి అప్పజెప్పి ఆదర్శ మూర్తికి ఆదర్శ మూర్తులే వారసులుగా పరంపర కొనసాగిస్తారని అని కూడా నిరూపించారు. ఆ మహనీయుని అంతిమ యాత్రలో నేనూ చివరి వరకు అనుసరించాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- బూరగాపు లక్ష్మణరావు మాస్టర్
ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాల సంఘం
జిల్లా అధ్యక్షులు

ఎన్నో విషయాలు నేర్చుకున్నా...

1999లో పలాస ఎల్ఐసి బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చినప్పటి నుంచి ఆయనతో కలిసి పనిచేసిన కాలంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఇన్స్యూరెన్స్ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయడానికి ఆయన చేసిన కృషి అమోఘం. ఉద్యోగులను సంఘటిత పరచడంలోను, వారి సమస్యలను పరిష్కరించడంలోను, ఉద్యోగులను పోరాట మార్గంలో నడిపించడంలోను ఆయన అందెవేసిన చెయ్యి. సమాజంపై ఆయనకు ఉన్న బాధ్యత, ప్రజా సంఘాలను నిర్మాణాత్మకంగా పనిచేయించడంలో ఆయన చూపిన దార్శనికత నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. నేను ప్రస్తుతం బ్రాంచ్ కార్యదర్శిగా, విశాఖ డివిజన్ ఇన్స్యూరెన్స్ ఉద్యోగుల సంఘానికి ఉపాధ్యక్షునిగా ఎదుగుదలలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పడానికి గర్విస్తున్నాను. మిత భాషిగా, మంచి వక్తగా, అంతకుమించి విషయ పరిజ్ఞానంపై ఆయనకున్న మంచి పట్టు నాకు గౌరవాన్ని పెంచింది. ఆయన లేనిలోటు అటు కార్మిక, ఇన్స్యూరెన్స్ ఉద్యోగుల సంఘానికి తీరని లోటుగా భావిస్తున్నాను. ఆయన ఆశయాలను, ఆలోచనలు ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి. విజికె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

- టేకి ఆచారి, ఇన్సూరెన్స్ కార్పొరేషన్
ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు,
విశాఖపట్నం డివిజన్

ఉద్యమ దిక్సూచి

వి.జి.కె మూర్తి ఎల్ఐసి సంఘ నాయకునిగా, సిఐటియు జిల్లా వ్యవస్థాపక అధ్యక్షునిగా, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా నాయకునిగా పనిచేశారు. ఉపాధ్యాయ, సైన్స్ ఉద్యమాలకు మార్గదర్శకత్వం వహించారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యేవారు. సాహిత్య అభిమానిగా వ్యవహరించారు. కళలను ప్రోత్సహించే వ్యక్తి. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం నాయకునిగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆలంబనగా, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరంతరం నిరసిస్తూ, చివరి వరకు పోరాడిన గొప్ప మానవతావాది, ప్రజాస్వామ్యవాది, కమ్యూనిస్టు. నేను ఉపాధ్యాయ ఉద్యమం నాయకత్వం లో ఉన్నప్పుడు ఉపాధ్యాయ ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించారు. ప్రజాస్వామ్య యుతంగా ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించడానికి సహాయ పడేవారు. ఉద్యమం అభివృద్ధి కావాలంటే భిన్నాభిప్రాయా లను స్వాగతిస్తూనే, పెడధోరణిలపై నిరంతరం అంతర్గత పోరాటం చేయాలని సూచించిన గొప్ప ప్రజాస్వామ్యవాది. ప్రజా సైన్స్ ఉద్యమానికీ వెన్నుదన్నుగా నిలబడ్డారు. దళిత, సామాజిక తరగతుల పోరాటాలకు స్నేహహస్తం అందించడం 'లాల్ నీల్' ఉద్యమాలకు ఊపిరి లూదారు. జీవిత సహచరులను మహిళా, ప్రజా సైన్స్ ఉద్యమాల్లో భాగస్వామ్యం చేసేవారు. వారి స్మృత్యర్థం శాస్త్రీయ దృక్పథ ప్రచారానికి గాను విద్యార్థులను ప్రోత్సహించేందుకు ట్రస్టులను నిర్వహించారు. అన్నిటికీ మించి కుటుంబ సభ్యులను ప్రజల ఈతి బాధలను గుర్తించేలా పెంచి, ప్రజాస్వామ్య వాదులను చేశారు. చివరికి తనువు చాలించిన అనంతరం కూడా తన శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం దానం చేసే గొప్ప దార్శనికుడు. సమాజ హితుడు, ప్రజాస్వామ్యవాది, నిజమైన కమ్యూనిస్టు వి.జి.కె మూర్తికి రెడ్ సెల్యూట్.

- గొంటి గిరిధర్
రాష్ట్ర కార్యదర్శి, జన విజ్ఞాన వేదిక

విజికె అంటే...

విజికె అంటే మూడు అక్షరాలే కాదు
మూర్తీభవించిన నిబద్ధతకు రూపాలు
జోహారు జోహారు విజికె
జోహారు కామ్రేడా! 'విజికె'
పరిచయమైతే అతడొక పరిమళం
సిరిమల్లెకు సరితూగే చిరునవ్వొక ఆభరణం
ఆలోచన, అవగాహన, అందమైన సంభాషణ
చెరగవు ఆ జ్ఞాపకాలు– వెలిగే నక్షత్రాలు
"విజికె"
సామాజిక బంధాలలో సమతా సౌగంధాలు
నింపాలని పదే, పదే పరితపించినారు
సనాతనం ముసుగులోన పురాతనం భావాలను
వ్యతిరేకించిన తీరు అనుసరణం ఎవరికైన
"విజికె"
ఆకాంక్షల సాధనలో మనసుకు అలసట లేదు
సైద్ధాంతిక గమనంలో అడుగులు తడబడలేదు
ఉద్యమ కార్యాచరణకు నియమబద్ధ జీవితం
ఆదర్శంగా మిగిల్చి
అమరత్వం పొందినారు
"విజికె"

- నల్లి ధర్మారావు,
రచయిత,
అరసం జిల్లా అధ్యక్షులు





విలువలు నేర్పిన వ్యక్తి

మంచి తనం, మానవత్వం కలగలిపిన వ్యక్తి మూర్తి మామయ్య. వారి కుటుంబంలో చిన్నవాడైనా మా అందరికీ పెద్ద. మంచి విలువలు నేర్పి ఎవరిని నొప్పించకుండా ఉండేవారు. మేము కుటుంబ సభ్యులమై కాకుండా తనతో పార్టీలో కూడా కలిసి పని చేసే అవకాశం వచ్చింది. ఏ పనిలోనైనా చాలా శ్రద్ధ ఉండేది. పని చిన్నదైనా, పెద్దదైనా చాలా శ్రద్ధగా చేసేవాడు. అలా చేయకపోతే సంతృప్తి ఉండేది కాదు. వయసులో చిన్న వారైనా, పెద్దవారైనా అందరితో మాట్లాడటం, వారి అవసరాలు తెలుసు కోవడం మా కుటుంబ సభ్యులకు, తనకు ఒప్పించి శ్రీనివాసతో అభ్యుదయ వివాహం చేయించారు. మంచి అభ్యుదయ భావాలే కాక నైతిక విలువలు కలిగిన వ్యక్తి. తాను ఏ ఆశయాలను అయితే నమ్మారో వాటిని చివరి వరకు తీసుకెళ్లారు. ఆ ఆశయాలను మేము కూడా చివరి వరకు తీసుకెళ్లడానికి మావంతు ప్రయత్నం చేస్తాం.

- కె.నాగమణి, జిల్లా కన్వీనర్,
శ్రామిక మహిళ సమన్వయ కమిటీ

పాఠశాల అభివృద్ధికి మూలస్తంభం

ఎందరో మహోన్నతమైన వ్యక్తులను, త్యాగధనులను ఉద్భవింపచేసిన, ఘనచరిత్ర కలిగిన తన చదువుల తల్లి ఎన్.టి.ఆర్. పురపాలక సంఘోన్నత పాఠశాల దయనీయమైన పరిస్థితి గాంచి, హృదయం ద్రవించి, పాఠశాల అభివృద్ధికి నడుం బిగించారు వి.జి.కె. పాఠశాలలో 1962 నుంచి చదువుకున్న పూర్వ విద్యార్థులందరిని సంఘటిత పర్చి, 2012లో ఎన్.టి.ఆర్. పురపాలక సంఘోన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేయడంలో అనన్య సామాన్యమైన భూమిక పోషించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల తరగతుల నూతన గదుల నిర్మాణంలో, ఆనాటి ప్రభుత్వాధికారులతో అనేక సందర్భాల్లో కలిసి, గదుల నిర్మాణంలో నిధులు రాబట్టడంలో అవిరళమైన కృషి చేశారు. తన ఉనికిని కోల్పోయిన 'తిలక్ హాల్' నూతన భవన నిర్మాణానికి ఆనాటి పార్లమెంట్ సభ్యులు ప్రస్తుత కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి పాఠశాల అభివృద్ధి, ఆవశ్యకతను వివరించారు. తిలక్ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించే విధంగా కృషి చేయడం విశేషం. పాఠశాలలో అన్య వ్యక్తుల చొరబాటు, అన్య కార్యక్రమాలకు వినియోగించడాన్ని నిలువరించడంలో అలుపెరగని పోరాటాన్ని సాగించారు. పాఠశాల విద్యార్థులు భోజనం చేయడానికి వసతి లేక అవస్థలు పడుతున్న తరుణంలో రూ.5 లక్షలతో సంఘ నిధుల నుంచి వెచ్చించి, విద్యార్థులకు భోజన వసతి సదుపాయం కల్పించడంలో కృతకృత్యులయ్యారు. విజికె ఆశయాల సాధనకు తిలక్‌హాల్ నూతన భవన నిర్మాణం పూర్తి చేయడానికి సంఘం సంకల్పం చెప్పుకుంది.

- ఎన్.టి.ఆర్ మున్సిపల్ హైస్కూల్
పూర్వ విద్యార్థుల సంఘం

విజికె సేవలు మహోన్నతం

విజికె మూర్తి నిశ్శబ్ద నిష్క్రమణ జీర్ణించుకోలేనిది. చిన్న వాడైనా అందరి మంచి చెడ్డలు చూసు కోవడంలో పెద్దమనసు కలవాడు. కడ దాకా ఆయన చేసిన సేవలు, నేత్రదానం, దేహదానం మహోత్కృష్టమైనవి.

- రమామణి, విజికె చిన్న వదిన



ఆయన వ్యక్తిత్వంతో స్ఫూర్తి పొందా...

వి.జి.కె మూర్తి మరణం వామపక్ష ఉద్యమాలకు ప్రత్యేకించి సిపిఎంకు తీరని లోటు. ఆయన వల్ల పార్టీకి మధ్యతరగతి ప్రజలతో సంబంధాలు పెరిగాయి. ఆయన నడిచిన బాట అందరికీ ఆదర్శం. కార్యకర్తలతో కలుపుగోలుగా ఉండేవారు. ఆయన్ని చూసి చాలా స్ఫూర్తి పొందాను. 1991లో సిపిఎం 8వ జిల్లా మహాసభల్లో ఆయన కష్టపడిన తీరు నన్ను ఆకట్టుకుంది. ఆయన భార్య చనిపోయి అప్పటికి ఐదు రోజులే అవుతున్నా, మహాసభ కార్యక్రమాల్లో తీరిక లేకుండా పనిచేశారు. మార్క్సిస్టు పార్టీ సభ్యునిగా ఆయన మాత్రమే కాకుండా కుటుంబంలోనూ ఆ భావజాలాన్ని నింపారు. అందుకే తన భౌతికకాయాన్ని వైద్య పరిశోధనల కోసం రిమ్స్‌కు అదించగలిగారు. ఆయన అమరుడైనా, సేవలు మాత్రం సజీవం.

- గంగరాపు సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

ఐక్య ఉద్యమాల రూపశిల్పి

కామ్రేడ్ వి.జి.కె మూర్తితో 40 ఏళ్లగా పరిచయం ఉంది. ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శిగా చాలా కాలం పనిచేశారు. పోస్టల్ నాయకులు వి.జి.కె. మూర్తికి సన్నిహితులు. పోస్టల్ సీనియర్ నాయకులు కామ్రేడ్ తరినయ్య శర్మ వద్ద ట్రేడ్ యూనియన్ పాఠాలు నేర్చుకున్నానని చెప్తుండేవారు. కామ్రేడ్ విజికెను పోస్టల్ టెలికం ఉద్యోగులు తమ నాయకునిగా, కామ్రేడ్‌గా భావిస్తారు. జిల్లాలో ఉద్యోగుల, కార్మికుల, పెన్షనర్ల ఐక్య ఉద్యమాల రూపశిల్పి. సంఘీభావ ఉద్యమాలను చేయడంలో ఆయన శైలి విలక్షణమైనది. శ్రామికవర్గ ఐక్య ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఇచ్చే నివాళి.

- కె.చంద్రశేఖర్, కార్యదర్శి, పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్ల అసోసియేషన్, శ్రీకాకుళం







అభివృద్ధికి ఆయన సలహాలు స్ఫూర్తి

రాజకీయాల్లో సమర్థవంతంగా రాణించడానికి, నియోజకవర్గంలో అభివృద్ధిని సాధించడానికి విజికె మూర్తి ఇచ్చిన సూచనలు, సలహాలు స్ఫూర్తి నిచ్చాయి. వయో బేధం లేకుండా ఎటువంటి సమస్యనైనా అతని ముందు ఉంచితే దానిపై అధ్యయనం చేయడమే కాకుండా పరిష్కారం చూపే వరకు ఆలోచించే స్వభావి. గడచిన ఎన్నికల సమయంలో ఆయనను కలవడం జరిగింది. టిడిపి అదిష్టానం టిక్కెట్‌ను కేటాయించిన తర్వాత నగరంలో అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులు కోరుతూ ఆయన్ను కలిశాను. ఆ సమయంలో ప్రజల సమస్యలపై ఆయన కొన్ని విశ్లేషణలు చెప్పారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కంటికి కనిపించని ఆర్థిక ఇబ్బందులు వచ్చి వెళ ..ంటాయని ఆయన చెప్పిన విశ్లేషణ తనకు ఎంతగానో నచ్చింది. అలాగే ఏదైనా సమస్య ఉంటే దాన్ని పరిష్కరించుకునేందుకు రోడ్డెక్కి పోరాడుతున్న వర్గాల ప్రజలు బాధితుల్లో ఒకరని భావించాలని చెప్పిన మాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

ప్రజల మధ్య తిరుగు తున్నప్పుడే ప్రజల కష్టాలు తెలుసుకోవచ్చని ఆయన చెప్పిన సూచన జీవితంలో మరచిపోనిది.

అందుకే నిరంతరం ప్రజల మధ్య ఉండాలని భావిస్తున్నాను. ఆయన ముందు చూపు, సూటిగా చెప్పే తత్వం అలవర్చు కోవాలన్నదే తన ఆలోచన. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

- గొండు శంకర్,
ఎమ్మెల్యే, శ్రీకాకుళం

అజాత శత్రువు

విజికె మూర్తి శ్రీకాకుళం, తాను విజయనగరం సిఐటియు జిల్లా నాయకులుగా కలిసి పనిచేశాం. అనేక కార్మిక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించిన తీరు ఆకట్టుకునేది. మృదు స్వభావిగా అందరిని కలుపుకుని పోయేవారు. పార్టీలకు అతీతంగా అందరు ఆయన్ని అభిమానించే వారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం నిర్వహించడం ద్వారా ఆయన సహకారం, సూచనలతో విజయనగరం జిల్లాలో గురజాడ అధ్యయన కేంద్రం నిర్వహణ చేశాం. విజయనగరం జిల్లాలో అనేక రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన బోధకులుగా విచ్చేసి తమ జిల్లాలో ఉద్యమా భివృద్ధికి ఎంతో సహ కరించారు. మూర్తి వంటి మార్క్సిస్టు మేధావిని కోల్పో వడం ఉద్యమాలకు తీరని లోటు. ఏమైనా ఆయన కృషిని ముందుకు తీసుకుపోవడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి.

- తమ్మినేని సూర్యనారాయణ,
సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి

మూర్తీభవించిన స్ఫూర్తి

నిరంతరం ప్రజల కోసం పనిచేసే వారి ఆలోచనలు ఉద్యమం చుట్టూనే తిరుగు తుంటాయి. ఈ నేపథ్యాన్ని భూమికగా చేసుకుని కామ్రేడ్ విజికె మూర్తి నిత్య నూతనంగా ఆలోచిస్తూ కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా, చొరవతో అంకిత భావంతో పనిచేస్తుంటారు. గొప్ప సమయస్ఫూర్తి, మూర్తిభవించిన మూర్తిని చూసినప్పుడు ఉద్యమ కార్యకర్తలు ఎంతో స్ఫూర్తిని పొందుతారు. ఆయనతో కార్యక్రమాల సందర్భంగా పనిచేసినప్పుడు పనిలో నూతన ఉత్సాహం కలుగుతుంది. 2016 జూలైలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా పార్టీ ఆఫీసులో మొదటిసారి మూర్తిని చూశాను. తనకు తానుగా పరిచయం చేసుకొని సంఘం యొక్క పనికి సంబంధించిన ఆశక్తికరమైన నిర్మాణాత్మక చర్చలు జరిపారు. అది మొదలు అనేక సమావేశాల సందర్భంగా సలహాలు, సూచనలు చేస్తూ మరింత చొరవగా మహిళా సంఘం పనిచేయాలని ఆరాట పడుతుండేవారు. మహిళా సంఘం కొరకు నూతనంగా నిర్మించదలచిన భవనానికి సంబంధించిన కృషిలో కూడా తను భాగస్వామ్యమైన తీరు ప్రజా సంఘాలపై ఆయనకున్న నిబద్ధతని చాటిచెబుతోంది. ఇటీవల ఆయన అమరత్వం విప్లవోద్యమానికి తీరిన లోటు. ఆ ఉద్యమకారుడి లక్ష్యం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయడమే ఆయనకు ఇచ్చిన నివాళి.

- అల్లాడ లక్ష్మి (ఐద్వా),
శ్రీకాకుళం

జన హితుడిని సమాజం కోల్పోయింది

జనం కోసం పరితపించే హృదయం విజికె మూర్తిది. జనానికి మంచి చేసే ఆలోచనలు అనువణువునా నింప ుకున్న మానవతావాది..! 30 ఏళ్లుగా ఆయనతో ఉన్న అనుబంధంతో ఎన్నో కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా మూర్తి నుంచి ప్రజల సమస్యలపై స్పందించే లక్షణాన్ని నేర్చుకున్నాను. ఒక కార్యక్రమం నిర్వహించాలన్నా, ఒక పోరాటాన్ని రూపకల్పన చేయాలన్నా, సమస్యపై స్పష్టమైన విషయపరిజ్ఞానం కలిగి ఉండడం ముఖ్యమనే

ప్రాథమిక సూత్రాన్ని మూర్తి నుంచి నేర్చుకున్న వారిలో తాను ఒకరిని. గాంధీ మందిరంలో దక్షిణాది గాంధీగా పిలవబడిన పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ప్రతిష్టించి ఎక్కడా ఆయన పేరుని రాసుకోకుండా కార్యసిద్ధి తప్ప, ప్రచార ఆర్భాటం వద్దనుకునే ఉన్నత వ్యక్తిత్వం మూర్తి సొంతం. అలాంటి జనహితుడిని సమాజం కోల్పోయింది. ఆయన చూపించిన మార్గం ఎప్పటికీ సజీవం.

- ఎం.వి.ఎస్.ఎస్ శాస్త్రి,
గాంధీమందిరం సమన్వయకర్త

సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారు

సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారు. సుదీర్ఘకాలం కార్మిక రంగ నాయకుడిగా కొనసాగారు. ఆ కాలంలో తాను ఇఫ్టు కార్మిక నాయకునిగా జూట్ కార్మిక సమస్యలపై జాయింట్‌గా వారితో పనిచేసిన రోజులు గుర్తుకొస్తున్నాయి. ఆయనకు సాహిత్యంపై కూడా ఎక్కువ మక్కువ ఉండేది. విజికె మూర్తి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని నష్టం గురిచేస్తుంది. విజికె మూర్తి మరణించినంత వరకు వారు నమ్మిన కమ్యూనిస్టు

- మామిడి క్రాంతి,
సీనియర్ అడ్వకేట్, శ్రీకాకుళం

విజికె మూర్తి అందరివాడు

విజికె మూర్తి అందరివాడు. వామపక్ష భావజాలం ఉన్న వ్యక్తులకి ఎంతో ఆదర్శప్రాయం కలిగించే వి.జి.కె.మూర్తి మన మధ్య లేకపోవడం తీరనిలోటు. కార్మికుల, పేదప్రజల హక్కులకోసం ఎంతో కృషి చేశారు. వామపక్ష భావాజాలం ఉన్న వ్యక్తులతో పాటు న్యూట్రల్‌గా ఉన్న వ్యక్తులతో కూడా మంచి సంబంధాలు ఏర్పర్చుకున్నారు. ఆయన వంటి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులు ఉంటే వామపక్ష ఉద్యమం ఎంతో బల పడు తుంది. ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన వ్యక్తి విజికె మూర్తి.

- కె.వి శివానంద కుమార్,
విశ్రాంత ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్

మంచికి మారుపేరు

మంచికి మారు పేరు, మృదుస్వభావి, నిబద్ధత కలిగిన వ్యక్తి, సమస్యలపై పరిష్కార మార్గాలను చూపేవారు. మంచి విశ్లేషణ ఆయనకు ఆయనే సాటి. ఎలాంటి వారినైనా మోటివేషన్‌తో సమస్య పరిష్కరించేవారు. అందుకే అన్నివర్గాల వారు ఇష్టపడే వ్యక్తి మన విజికె. ఆయన మధురస్మృతులు ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయి. ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కొనసాగించాలి

-డి.విష్ణుమూర్తి,
ప్రొఫెసర్, ఐతమ్ కళాశాల, టెక్కలి

వ్యక్తిగత ప్రయోజనాలు ఆలోచించని వ్యక్తి

కామ్రేడ్ విజికె మూర్తి ఆకస్మిక మరణం వామపక్ష లౌకిక ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటు. వారి కుటుంబానికి తీవ్ర మనస్తాపం కలిగిస్తుంది. వారితో తన సుదీర్ఘ అనుబంధంలో ప్రజా ప్రయోజనం, ఉద్యమ ప్రయోజనమే తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏనాడూ ఆలోచించని గొప్ప మనిషి.

- ఎం.కృష్ణమూర్తి,
సిపిఎం సీనియర్ నాయకులు

తొలి తరం ఉద్యమ నాయకుడు

కామ్రేడ్ వి.జి.కె.మూర్తి మొదటి తరం ఉద్యమ నాయ కుడు. 1992లో సిఐటియు ఆవిర్భావ తొలి అధ్యక్షుడుగా పదవి బాధ్యతలు స్వీకరించి 2005 వరకు కొనసాగి జూట్, శాంపిస్టన్స్, భవన నిర్మాణ కార్మికులు, చందన, బొమ్మన షాపు ఉద్యోగులు, అంగన్వాడీ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, పంచాయతీరాజ్ వర్క్‌ఛార్జ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేసి వారి సమస్యల పరిష్కారానికి

ఎనలేని సేవలు అందించిన మహోన్నత వ్యక్తి విజికె మూర్తి.

- ఎస్.ఎ సలీం,
ముస్లిం జెఎసి జిల్లా కన్వీనర్

ప్రభావితం చేసే ఆత్మీయత

వి.జి.కె మూర్తి, నేను 1968-71 బిఎస్‌సిలో క్లాస్ మేట్స్. యుటిఎఫ్‌లో మాకు గైడ్‌గా మంచి సలహాలు ఇచ్చేవారు. తన దైనశైలిలో ఉద్యమాల్లో పాల్గొనే వారు. కడవరకు మంచిమిత్రులు గానే ఉన్నాం. విజికె, నేను విద్యార్థి దశలో సహాధ్యాయులం. ఉద్యమాల సహచరులం. సిపిఎం పార్టీలో కలిసి పనిచేశాం. విద్యార్థి దశ నుంచి కూడా ఆయనలోని గొప్పతనం ఏమిటంటే, పరిచ యాల ద్వారా, స్నేహం ద్వారా ఎదుటివారిని వేగంగా ప్రభావితం చేసేవారు. అదే ప్రధానంగా ఉద్యమ నిర్మాణాలకు ఉపయోగపడింది.

వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తి. సైద్ధాంతిక అవగాహన, ఆచరణలో ఆయన జీవితం పార్టీలోకి వచ్చే నూతన కార్యకర్తలకు ఒక పాఠ్యాంశం.

- బొడ్డేపల్లి మోహనరావు,
ఉద్యమ నాయకులు, న్యాయవాది

మిత భాషి విజికె మూర్తి

సమాజంలో ఏ అంశాన్నైనా అధ్యయనం చేసి అంచనా వేయగల సమర్థత ఉన్న అపర మేధావి విజికె మూర్తి. వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లలతోను, పెద్దవారితోను కలిసిపోయే మనస్థత్వం. మిత బాషి.. రచనలపైనే కాకుండా సామాన్య ప్రజల కష్టాలపై పూర్తి అధ్యయనం చేసిన మేధావి. ఆయన ఎంత ఎత్తుకెదిగినా ఎదుటి వారిపై గౌరవంతో మెలగడం, వారు మాట్లాడుతున్న అంశాలపై కూడా నిశిత పరిశీలన, పొరపాట్లు ఉన్నా సరిదిద్దే

స్వభావం కలిగి ఉన్న వ్యక్తి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నా ఎక్కడ ప్రజల హక్కులు కాల రాయ బడు తున్నాయో అక్కడ ప్రత్యక్షమై ఉద్యమ బాధ్యతలను చేపట్టేవారు. అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆయనకు ప్రజలిచ్చే నీరాజనాలే ఘనమైన నివాళి.

- చౌదరి పురుషోత్తం నాయుడు,
ఏపి ఎన్‌జిఒ అసోసియేషన్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బహుముఖ ప్రజ్ఞాశాలి

బహుముఖ ప్రజ్ఞాశాలి, కార్మికపక్ష నేత, సున్నితస్వభావస్తుడు. నిరంతర ప్రజాసేవకుడు స్నేహశీలి వి.జి.కె.మూర్తి. నాకు అన్ని విషయాల్లో అండగా ఉంటూ నా జీవితానికి స్ఫూర్తిగా నిలిచారు. కార్మికవర్గ ముందు శ్రేణి నాయకులుగా, సిఐటియు, సిపిఎంకు జిల్లా నుంచి మొదటి అధ్యక్షునిగా బాధ్యత స్వీకరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బాటలు వేశారన్నారు. తన ఆరోగ్యాన్ని సైతం పక్కన పెట్టి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. ఆయన అడుగుజాడల్లో నడవాలనే తపనతో ఉండేవాడిని. నేత్రదానం చేసి అందరిలో స్ఫూర్తి నింపారు. దేహాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాలకు అనువుగా రిమ్స్ వైద్య కళాశాలకు దానం చేసిన మహనీయుడు. అటువంటి వ్యక్తికి నేను మేనల్లుడిగా, ఆయన కుటుంబ సభ్యునిగా ఉన్నందుకు గర్వంగా ఉంది. తప్పకుండా ఆయన ఆలోచనలకు దగ్గరగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే విధంగా నడుచుకుంటామన్నారు.

- పుట్రేవు రవిశంకర్, మేనల్లుడు, వెంకట సూర్య డెంటల్ కేర్ మేనేజర్, పర్లాకిమిడి

లాల్ సలాం ప్రియ మిత్రమా!

మూర్తితో నా అనుబంధం ఆరు దశాబ్దాలు దాటింది. ఆరో తరగతిలో ప్రారంభమైన మా అనుబంధం అర్ధాంతరంగా ఇలా ముగియడం నేను మర్చిపోలేని బాధాకరమైన సంఘటన. మూర్తి నాకు ప్రాణ స్నేహితుడనే మాట చాలా చిన్నది. వ్యక్తిగత, యూనియన్ సమస్యలు వంటి ఏ సమస్య ఎదురైనా తనతో చర్చించి నిర్ణయం తీసుకోవడం నాకు పరిపాటి. విద్యార్థి జీవితంలో నాకు ఇద్దరే స్నేహితులు. మిగిలిన వారు క్లాస్మేట్స్. ఒకరు మూర్తి అయితే, రెండో వారు ప్రతి సంవత్సరం క్లాస్ ఫస్ట్ నిలిచిన చంద్రశేఖర్. తన స్థాయి చేరుకోవాలనే లక్ష్యంతో చంద్రశేఖర్‌తో స్నేహం చేశాను. మూర్తి వ్యక్తిత్వంపై ఆకర్షణితుడనై దగ్గర అయ్యాను. ఎమ్మెసి వరకు మేము ముగ్గురం కలిసి ప్రయాణించాం. నాగావళి బ్రిడ్జ్‌పైన, ఇసుక తిన్నెలపై కూర్చుని మేము చెప్పుకున్న కబుర్లు ఎన్నో. మూర్తి జీవితం అనేక ఒడిదొడుకుల మధ్య సాగింది. రాచకట్ల వారి వీధిలో వారి నివాసం ఉండేది. బాల్యంలోని తల్లిని కోల్పోయిన మూర్తి ఇబ్బందులు మధ్య పెరిగాడు. ఇంటికి వెళ్ళినప్పుడు చెల్లి సరోజను ఎత్తుకొని కన్పించేవాడు. తండ్రి ఖాదీలో రాష్ట్రస్థాయి ఉన్నత ఉద్యోగి. నిష్కలంకమైన జీవితం, ఉన్నత భావాలు గల మహామనిషి. అందుకే సంస్థలో, వారంటే గొప్ప గౌరవభావం. స్వాతంత్ర సమరయోధ ఫించన్ నాకు అవసరం లేదని తిరస్కరించడం ఆయనకే చెల్లింది. గాంధీ తాతలాగా ఉండేవారు. వారి ఇంటికి వెళ్లినప్పుడు మొదటి గదిలో ఆయన ఉండేవారు. ఆయన్ని దాటుకొని ఇంట్లోకి వెళ్లాలంటే బెరుగ్గా ఉండేది. అనేక సంవత్సరాలు ఇంటిల్లిపాది ఖాదీ దుస్తులు ధరించే వారు.

మూర్తి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆంధ్రా యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు లైట్ మ్యూజిక్ కాంపిటీషన్ నిర్వహించారు. మూర్తి ప్రయివేట్ ప్రేమ గీతం పాడాడు. పాట పూర్తయిన వెంటనే స్టేడియం మొత్తం కరతాళ ధ్వనులతో మారుమ్రోగిపోయింది. ప్రథమ బహుమతి మూర్తిదే. అప్పటి నుంచి మూర్తికి లేడీ ఫ్యాన్స్ పెరిగారు. రెండో సంవత్సరం మొదట్లోనే ఎల్ఐసి ఉద్యోగం రావడంతో ఎంఎస్‌సి పూర్తి చేయలేకపోయాడు. నాకు కూడా ఎల్ఐసిలో అదే బ్రాంచ్ లో (కొద్ది నెలలు వెనక) ఉద్యోగ రావడం, విజికెతో కలిసి పనిచేశాను. నా అపాయింట్‌మెంట్ ఆర్డర్ రీ డైరెక్టెడ్ అని శ్రీకాకుళం నుంచి టెలిగ్రామ్ ఇచ్చింది కూడా తనే. ఆ రోజు క్లాసుకు హాజరు కాకుండా పోస్టాఫీసు దగ్గరికి కూర్చున్నాను. కుటుంబ ఆర్థిక పరిస్థితిలో నా అవసరం అటువంటిదని విజికెకు తెలుసు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు, ఎల్ఐసిలో జాయిన్ అయినా అనతి కాలంలోనే బ్రాంచ్ యూనియన్ సెక్రటరీ అయ్యాడు. తర్వాత తాను నిర్వహించిన టియు బాధ్యతలు అనేకం. వాటి వివరాల్లోకి నేను వెళ్లడంలేదు. ఆఫీసు నాగావళి బిల్డింగ్‌లో ఉండేది. 1993లో కార్మిక సంఘం నాయకునిగా ఆయన మొదటి అరెస్టు అయ్యారు. ఆఫీసుకు వచ్చి పోలీసులు జీపు ఎక్కించి తీసుకెళ్లారు.

డిపార్ట్‌మెంట్ టెస్టుల్లో ఉన్నతమైన 'ఫెలోషిప్'లో ఆల్ ఇండియా స్థాయిలో మొదటి స్థానంలో రెండు కేటగిరిలలో నిలిచాడు. మూడు పేపర్లు మార్కులు కలిపి మొత్తంగా ఒకటి. 'మేనేజ్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్' పేపర్లో టాపర్‌గా నిలిచారు. బ్రాంచ్ తనిఖీకి వచ్చిన ప్రతి ఉన్నతాధికారీ ఉద్యోగోన్నతి తీసుకోమని ప్రోత్సహించేవారు. అప్పుడే తను ఉద్యోగోన్నతి తీసుకుంటే చాలా ఉన్నత స్థానంలో ఉద్యోగ విరమణ పొందేవారు. నాకు సమాజమే ముఖ్యమని దృఢ నిశ్చయంతో కార్మికోద్యమంలో కొనసాగాడు.. ఎదిగాడు. విజికె శ్రీకాకుళం బ్రాంచ్‌కే పరిమితం కాకుండా బదిలీపై బయటికి వస్తే ఎల్ఐసి యూనియన్‌లో ఆల్ ఇండియా స్థాయికి చేరుకునేవాడని యూనియన్ ఆల్ ఇండియా మాజీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళంలో ఉంటూనే ఇతర బ్రాంచ్‌ల, డివిజన్ల సమావేశాలకు వక్తగా హాజరైన సందర్భాలు ఎన్నో. డివిజన్, బ్రాంచ్‌ల నాయకత్వంలో విజికె పేరు తెలియని వారు బహుశా లేరు. ఆల్ ఇండియా స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు సిఐటియు వ్యవస్థాపక జిల్లా అధ్యక్షునిగా అందించిన విశిష్ట సేవలు మరో ఎత్తు.

నిస్వార్థ సేవకు మరో పేరు విజికె. దీనితోపాటు వివిధ సందర్భాల్లో విరాళాలు ఇవ్వడంలో తన చేతికి ఎముక లేదు. విజకె అంత ఇచ్చినప్పుడు నేను ఎంత ఇవ్వాలన్న ప్రశ్న నాకు అనేకసార్లు ఎదురైంది. వైవాహిక జీవితంలో మూర్తికి ఎదురు దెబ్బలు తగిలి, ముగ్గురు పిల్లలు తల్లి అయినా లక్ష్మి అర్ధాంతరంగా తనువు చాలించింది. కొన్నాళ్లు అమ్మా, నాన్న తనే అయి సాకాడు. పిల్లలు సంరక్షణకు రెండో పెళ్లి చేసుకోక తప్పలేదు. ముందు నుంచే విజికె వ్యక్తిత్వంపై ఆకర్షణ కలిగిన ప్రసున్నాంబ మూర్తితో పెళ్లి ప్రస్తావన వచ్చింది. ఆనందంగా మరో సంతానం ఉండకూడదని నియమంతో ఒప్పుకున్నారు. ఈ పెళ్లికి నేను ప్రధాన పాత్ర వహించడం ఆనందదాయకం. ముగ్గురు పిల్లలతో అమ్మ అని పిలిపించుకున్న ధన్యజీవి. ఆరోగ్యం లెక్కచేయకుండా విజికె కష్టపడుతున్నారని ఆమె అనే వారు. రకరకాలు వంటలు చేయడం ఆమె హాబీ. ఇంటికి వెళ్లినప్పుడు నేను చేశాను తిని చూడండి అని ఆప్యాయతతో నాకు పెట్టేవారు. భోజన ప్రియుడైన నాకు బోనస్ పాయింట్. అర్ధాంతరంగా ఆమె కూడా తనువు చాలించారు. ఆమె వైద్యంలో ఆస్పత్రి సిబ్బంది వైఫల్యమైన కూడా వారు అందించిన సేవలకు గుర్తింపుగా ఆస్పత్రికి వస్తు రూపంలో సహాయం చేయడం విజికెకే చెల్లింది.

ఒక విజయవంతమైన తండ్రి, మిత్రుడు, ఉద్యమనేత. అన్నింటికీ మించి అజాతశత్రువు. భిన్నాభిప్రాయాలు ఉన్న వ్యక్తులు కూడా తనకు అభిమానించేవారు. నూతన సంవత్సరం గ్రీటింగ్స్ రాసి మిత్రులకు ఇవ్వడం తన ఆనవాయితీ. దస్తూరి ఆణిముత్యాలు. మనకి ఎన్ని కావాలో ముందే ఇండెంట్ పెట్టాలి. మంచి వక్త, నటుడు. ఎల్ఐసి క్లబ్ తరపున అనేక నాటకాలలో నటించాడు. నాయకుడు, కార్యకర్త కూడా.

దశాబ్దాల క్రితం మాట... ఎల్ఐసి యూనియన్ విశాఖ డివిజన్ మహాసభ బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. హాల్ డెకరేషన్‌లో ప్రధాన పాత్ర విజికెదే. మరుసటి రోజు మహాసభ, మర్నాడు మహాసభకు హాజరు కావలసిన కారణంగా నేను రాత్రి 11 గంటల వరకు ఉండి ఇంటికి వెళ్లిపోయాను. మూర్తి తెల్లవారుజాము 4 గంటల వరకు ఉండి పనిపూర్తి చేసి ఇంటికి వెళ్లి మరలా ఏడు గంటలకు ప్రత్యక్షమయ్యారు. విసుక్కోకుండా ఓపిగ్గా పనిచేయడంలో తనకు తానే సాటి. ఉద్యోగ విరమణ అయిన 13 ఏళ్ల తరువాత, ఇప్పుడూ ఏజెంట్లు గౌరవంగా, ఆప్యాయతతో తనని పలకరించడం, విధి నిర్వహణలో తాను అందించిన ఉత్తమ సేవలకు నిదర్శనం.

మేము చదివిన ఎన్‌టిఆర్ఎంహెచ్ స్కూల్ వేరొక చోటికి తరలించి షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చేస్తారన్న ప్రతిపాదన వచ్చింది. దానిని అడ్డుకోవడానికి 'ఓల్డ్ బాయ్స్ అసోసియేషన్' ఆధ్వర్యాన విజికె చేసిన కృషి అపూర్వం. స్కూల్ అభివృద్ధికి అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వారి మద్దతు, విరాళాలు సేకరించారు. స్కూల్లో చదివిన విద్యార్థుల బ్యాచ్ వైజ్ సమావేశాల్లో పాల్గొన్నారు. వారిని ఉత్సాహపరిచి లక్షలాది రూపాయలు విరాళాలు సేకరించాడు. విజికె నాయకత్వంలో మా బ్యాచ్ 1968 విరాళంలో ప్రథమ స్థానం నిలిచింది.

మూర్తి ఆరోగ్యం అంతంత మాత్రమే. అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నాడు. అయినా ఆరోగ్య కారణంగా పనిని వెనక పెట్టిన సంఘటనలు చాలా అరుదు. కళ్లు సమస్య వల్ల చదవడానికి ఇబ్బందిగా ఉందంటూనే తన అధ్యయనం ఆపలేదు. ఇటీవల నాకు ఆపరేషన్ అయినప్పుడు ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులూ డాక్టర్‌తో మాట్లాడటం, అవసరాలను సమకూర్చడం, మెడీ క్లయిమ్ బిల్లు సబ్మిట్ చేయడంతో సహా మొత్తం తానే బాధ్యత వహించాడు. నేను ఇంటికి వచ్చిన తర్వాత కూడా నా పట్ల శ్రద్ధ వహించాడు. మూర్తి సేవా తత్పరతయయకు ఇదో నిదర్శనం. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో.

ప్రతి మొదటి సోమవారం ఎల్ఐసి పెన్షనర్స్ సమావేశం నిర్వహిస్తారు. యూనియన్ మ్యాగజైన్‌లో సంపాదకీయం ఎడ్యుకేటివ్‌గా ఉంది. దీనిపై నేను మాట్లాడుతానన్నాడు. వచ్చే సమావేశంలో నిర్వహించాల్సి ఉంది. ఈలోగా ఉపద్రవం. జనవరి 6న నిర్వహించిన గత సమావేశంలో, సరదాగా ఒక కవిత చదువుతూ ఈ దారిలో నువ్వు వచ్చావు, మరలా వస్తావో రావో (ఇదే ఆఖరి కావచ్చు జీవితం అనిచ్చితం అని అర్థంలో) అని ఒక కవిత చదివాడు. మహానుభావులకు తమ నిష్క్రమణ ముందే తెలుస్తుందంటారు. ఈ విధంగా ఇండికేషన్ ఇచ్చాడేమో!

తాడేపల్లిగూడెంలో ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించిన తరువాత కొడుకు శ్రీను, తాను నిర్మించుకున్న ఆర్గనైజేషన్ మొత్తం వదిలేసి తండ్రి కోసం శ్రీకాకుళం రిక్వెస్ట్ బదిలీపై వచ్చారు. మరలా మొదటి నుంచి పనిమొదలు పెట్టడం చాలా కష్టమైన పని. రిస్క్‌తో కూడుకున్నది. అటువంటి కొడుకుని కలిగి ఉండటమే పెద్ద విజయం.

రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాకు అనాథ శవాలే వస్తాయి. కానీ, కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో బంధుమిత్రులతో వచ్చి దేహదానం చేసిన సంఘటన నా జీవితంలో ఇదే ప్రథమం అన్నారు. మరణానంతరం కూడా నేను సమాజానికి ఉపయోగపడాలని బలమైన కాంక్ష కలిగి ఉండడం విజికె ప్రత్యేకత. సంతాప సభకు వచ్చిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ముగ్దులై రిమ్స్‌లో దేహదానం కార్యక్రమం పూర్తయిన వరకు ఉన్నారు. అంతేకాదు ఎన్‌టిఆర్ హైస్కూల్‌లో నూతనంగా నిర్మిస్తున్న హాల్‌కు విజికె పేరు పెడతామని, విజికె విగ్రహం పెడతామని సభాముఖంగా తెలియజేశారు. విజికె చేసిన కృషికి ఇదే నిదర్శనం.

దశాబ్దాలు తరబడి, వివిధ కోణాల్లో విజికెని సన్నిహితంగా చూసిన నాకు తన నిష్క్రమణ తీరని లోటు. నీవు లేని జీవితం ఊహించుకోవడం కష్టంగా ఉంది మిత్రమా!
తన జీవితమే మనకు సందేశం.
అశ్రునయవాలతో వీడ్కోలు
మిత్రమా ...

- మణికొండ ఆదినారాయణ మూర్తి, బాల్య మిత్రుడు

విజికె ప్రేరణ

పోస్టల్ ఉద్యోగులు వి.జి.కె మూర్తితో కలిసి దాదాపు రెండు దశాబ్దాల కాలం పాటు శ్రీకాకుళంలో ఐక్య ఉద్యమాలను నిర్వహించారు. బిజికె, విజికె మూర్తులు ఇద్దరూ కీలక పాత్ర పోషించిన చాలా సందర్భాల్లో నేను మా సీనియర్ నాయకుల ద్వారా తెలుసుకున్నాను. ఆరేళ్లుగా నేను నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజనల్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాను. ఏడు పదుల పైబడిన వయసులో కూడా మా పోస్టల్ ఉద్యోగుల ఉద్యమాలకు ప్రత్యక్షంగా హాజరై యువకులమైన మమ్ములను చైతన్యపరిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మూర్తి ప్రేరణతో నేను గతేడాది ఆగస్టు నెలలో మా పోస్టల్ ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. మృతిలో సైతం సామాజిక బాధ్యతను గుర్తెరిగి తన దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం అందించాలనే అతని గొప్ప ఆలోచనా, అతను చూసిన సమాజాన్ని మరొకరికి పరిచయం చేసేందుకు అతను చేసిన నేత్రదానం ప్రతిఒక్క ట్రేడ్ యూనియన్ కార్యకర్తను నిత్యం మేల్కొలుపుతూనే ఉంటాయి. 74 ఏళ్ల వయసులో కూడా సమాజంలో మార్పు కోసమని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించి ఎన్నో సమాజ శ్రేయస్సుకు దోహదపడే కార్యక్రమాలను చివరి శ్వాస వరకు నిర్వహిం చిన మహోన్నతమైన వ్యక్తి. అటువంటి గొప్ప వ్యక్తితో కలిసి గరిమెళ్ల విజ్ఞాన కేంద్రంలో సభ్యుడుగా పనిచేసే అవకాశం వచ్చినందుకు గర్విస్తున్నాను. అతని అకాల మరణానికి మిక్కిలి దు:ఖిస్తూ వారి కుటుంబ సభ్యులకు మా పోస్టల్ ఉద్యోగుల తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

పోస్టల్ ఉద్యోగుల ర్యాలీలో పాల్గొన్న వి.జి.కె మూర్తి (ఫైల్)

- కె.గణపతి, అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం గ్రూప్-సి రాష్ట్ర అధ్యక్షులు

నిక్కచ్చి మార్క్సిస్టు

నేను 2009లో శ్రీకాకుళం వచ్చినప్పటి నుంచి వి.జి.కె మూర్తితో పరిచయం ఏర్పడింది. ప్రజారోగ్య వేదిక కార్యాక్రమాలు మొదలు పెట్టిన తరువాత ఆయనతో సాన్నిహిత్యం పెరిగింది. ప్రతి విషయంలోనూ అంటే ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యోమాలు, కార్మికుల హక్కుల పరిరక్షణ పోరాటాల్లో, పార్టీ నియమావళి కార్యక్రమాల అమలు విషయంలో విజయవంతం చేయడానికి కృషి చేశారు.

అందరినీ అడుగుతునే గుర్తు చేసుకునేవారు. వాట్సాప్‌ని చక్కగా ఉపయోగించుకుంటూ నిరంతరం కృషి చేస్తూ... ఉండేవారు. అన్ని విషయాల్లోనూ పెద్ద దిక్కుగా, అపార అనుభవంతో అందరికీ దిశా నిర్దేశం చేస్తూ... ఉండేవాడు. నిక్కచ్చిమైన మార్క్సిస్టు. మా ప్రజారోగ్య వేదిక కార్యక్రమాలకు తనవంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ అందిస్తూ ఉండేవారు. జిల్లా పార్టీలో వెన్నెముకగా ఉన్న అతి కొద్ది మందిలో ఒకరు. విజికె హఠాన్మరణం పెద్దలోటు.

- డాక్టర్ మల్లేశ్వరరావు, ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షులు

వి.జి.కె ఆశయ సాధనకు కృషి

గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవస్థాప అధ్యక్షులు వి.జి.కె మూర్తి ఆకస్మిక మృతికి విజ్ఞాన కేంద్రం శ్రద్ధాంజలి ఘటిస్తుంది. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తాం. భావజాలరంగంలో జరుగుతున్న సంఘర్షణ, ఆర్థిక రంగంలో పెరుగుతున్న అసమానతలు తలెత్తుతున్న కుల, మత, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో సాంస్కృతిక రంగ ప్రాధాన్యతను గుర్తించి వి.జి.కె మూర్తి నాయకత్వంలో జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు కీర్తిశేషులు గరిమెళ్ల సత్యనారాయణ పేరుతో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం 2017లో ఆవిర్భవించింది. సమాజాన్ని ప్రభావితం చేసిన గురజాడ, శ్రీశ్రీ, జాషువ, వీరేశలింగం, మహాత్మాగాంధీ వంటి ప్రముఖుల జయంతులు, వర్ధంతులను నిర్వంచడం ద్వారా ఆ మహనీయుల ఆశయాలను, లక్ష్యాలను, ఆదర్శాలను నేటి తరానికి గుర్తు చేయడం బాధ్యతగా మూర్తి భావించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాల సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. భారత స్వాతంత్ర్యం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మత సామరస్యాన్ని ప్రభోదిస్తూ వివిధ మతాల పెద్దలు, విద్యార్థులతో శ్రీకాకుళంలో సమైక్యతా ర్యాలీ, 'దేశమును ప్రేమించుమన్న' పేరుతో సభ నిర్వహణ మూర్తి ఆలోచనలకు దర్పణం. జిల్లాలోని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి ఆ యోధుల త్యాగాలను గుర్తు చేయడం, సభ నిర్వహణలో మూర్తి కృషి ఎనలేనిది.

గరిమెళ్ల సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ,ప్రయివేటు కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి శ్రీకాకుళంలో సభ నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేయడం వంటి బృహత్తర కార్యక్రమాలకు ఆయన రూపకల్పన చేశారు. రెండేళ్ల క్రితం పోలాకి మండలం ప్రియాగ్రహారంలో గరిమెళ్ల ట్రస్టు ఆధ్వర్యాన గరిమెళ్ల సత్యనారాయణ పేరుతో తపాల కవరును తీసుకురావడానికి మూర్తి తమవంతు పూర్తి సహకారం అందించారు. తాజాగా గత సంవత్సరం నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం విజ్ఞాన కేంద్రం చేపట్టింది. దాదాపు 65 విద్యాలయాల్లో 16 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన మూర్తి స్వయంగా కొన్ని విద్యాలయాల్లో పాల్గొని స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. సమకాలిన ఆర్థిక, సామాజిక అంశాలను, తక్షణ సమస్యలను గుర్తించి సెమినార్లు క్రమం తప్పకుండా నిర్వహించడంతో చేసిన కృషి ప్రధానమైంది. సమస్యలను అధ్యయనం చేయడం, కార్యక్రమాలకు రూపకల్పన చేయడం మొదలు అమలు చేయడం వరకు మూర్తి కృషి అద్వితీయమైనది. అనితర సాధ్యమైనది.

- ఎం.ప్రభాకరరావు, కార్యదర్శి,
- పి.సుధాకరరావు, కోశాధికారి,
గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం

కుటుంబ సభ్యుల మనోగతం

నాన్న మార్గనిర్దేశకులు

నేను ఈరోజు ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విజయవంతం అయ్యానంటే అది నాన్న వల్లే. క్రమశిక్షణతో పెంచారు. ఇంటర్ చదువుతున్న సమయంలో ఆటలతో సమయం వృథా చేసేవాడిని. నన్ను ఒక మంచి మార్గంలో నడిపించింది నాన్నే. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఆంధ్రా యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు చదివించారు. అమ్మ 1991లో చనిపోవడం, ఆ తర్వాత ఐదు నెలల్లో నాన్నకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరగడం వంటి కష్టాలు పడ్డ నాన్నను ఆ రోజు చూస్తే ఇప్పటికీ దు:ఖం వస్తుంది. కాంట్రాక్టు లెక్చరర్‌గా ఉంటూనే ఆ అసోసియేషన్‌కు నాయకత్వం వహించిన సందర్భంలో నాన్న చాలా గైడెన్స్ ఇచ్చారు. మా కుటుంబంతో పాటు బంధువుల పిల్లల చదువులు, వారికి కావాల్సిన సాయం అందించేవారు. - వి.శ్రీనివాస కుమార్, కుమారుడు

కూతురుగానే చూసుకునేవారు

విద్యకు ప్రాధాన్యం ఇచ్చేవారు. చదువు, ఉద్యోగం తర్వాతే పెళ్లి చేసుకోవాలని మావయ్య చెప్పడంతో ఆయన సూచనలకనుగుణంగానే పనిచేశా. మావయ్య ప్రాక్టికల్‌గా ఆలోచించేవారు. ఏది మంచి, ఏది చెడు అనేది చెప్పేవారు. కూతురి మాదిరిగానే చూసుకునేవారు. - వి.సూర్యకుమారి, కోడలు

మాకే కష్టం రానీయకుండా పెంచారు

తల్లి లేకపోయినా అన్నీ తానే మాకు ఏ కష్టం కలగనీయకుండా పెంచారు. ఆయన ఉన్నంత వరకు మాకు పెద్ద దిక్కాచి. ఆయన సమిష్టితత్వాన్ని నమ్మి, అందరితో కలిసి పనిచేసేవారు. ఉద్యమాల్లో ఉన్నా కుటుంబ బాధ్యతలను ఏనాడూ విస్మరించలేదు. ఏదైని పని చేయాల్సి వచ్చినప్పుడు మాటలు చెప్పడం కాకుండా ఆచరించేవారు. జీవితంలో ఎదురైన కష్టాలను చిరునవ్వుతో స్వీకరించే వారు. హాస్య చతురతతో అందరినీ నవ్వించేవారు. అన్ని విషయాల్లో మా నాన్న మాకు ఆదర్శం. వాటిని కొనసాగించేందుకు మావంతు ప్రయత్నం చేస్తాం. - ఆలూరి భారతి, పెద్ద కుమార్తె

నాన్నది ఉన్నతమైన వ్యక్తిత్వం

నాన్న ప్రభావం నాపై చాలా ఉంది. నేనూ విద్యార్థి సంఘంలో పనిచేశాను. నా చదువుపై చాలా శ్రద్ధ చూపేవారు. ఆయన తన వ్యక్తిత్వంతో అందరికీ దగ్గరయ్యారు. మేమూ అదే బాటలో నడుస్తాం. ఆయన్నుంచి మేం చాలా నేర్చుకోవాల్సి ఉంది. - డి.ప్రవంతి, చిన్న కుమార్తె

తండ్రిలా ఆదరించారు

వివాహం తర్వాత కొన్ని ఇబ్బందులు పడ్డాను. ఒకటిన్నరేళ్ల చాలా బాధలు పడ్డాను. మా అమ్మ దగ్గర కంటే మావయ్య ఇంట్లోనే నాకు కష్టాల నుంచి ఉపశమనం కలిగేది. మావయ్య సొంత తండ్రి మాదిరిగా నన్ను చూసుకునేవారు. జీవితంపై ఆశలు కలిగేలా విశ్వాసం పెంపొందించారు. ధైర్యం చెప్పి నాకు ఒక మార్గం చూపారు. - అజ్జరాపు ప్రశాంతి, మేనకోడలు

తాత నాకు బెస్ట్ ఫ్రెండ్

తాత నాకు బెస్ట్ ఫ్రెండ్. ఇంటర్‌లో నాకిష్టమైన గ్రూపు తీసుకున్న తర్వాత తాతే నన్ను ప్రోత్సహించారు. నాకు డ్రాయింగ్ ఇష్టమని అన్నీ కొనిచ్చేవారు. నాకు అన్ని విషయాల్లో అండగా ఉండేవారు. - డి.మీనాక్షి, మనవరాలు (ప్రవంతి కూతురు)

మావయ్య మాకు ధైర్యం

తండ్రి మాదిరిగా నన్ను చూసుకున్నారు. అన్ని విషయాల్లో ధైర్యం చెప్పేవారు. సమస్య ఉంటే ఫోన్ చేయమని చెప్పేవారు. కులాంతర వివాహం సందర్భంగా కొన్ని ఇబ్బందులు పడ్డ సమయంలో మావయ్య నాకు అండగా ఉన్నారు. - ముళ్లపూడి ప్రవీణ్, మేనల్లుడు

మామయ్య మానవతావాది

కుటుంబ సభ్యుల, బంధువుల మధ్య సంబంధాలు, సంభాషణలు మరింతగా మెరుగుపరచడానికి నిరంతరం తపన పడే వి.జి.కె మూర్తి మామయ్య హఠాన్మరణం ఎంతగానో బాధ కలిగించింది. పిల్లలు ఉన్నత విద్య పేరిట, యుక్తవయసులో ఉద్యోగ అవకాశాలు, అవసరాలు రీత్యా ఇంటికి, కుటుంబాలకు దూరం కావలసిరావటంతో కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు క్రమంగా తరిగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేసేవారు. తన కుటుంబంలోని నాలుగు తరాలకు చెందిన సుమారు 120 మంది బంధుగణంతో 'మన ఫ్యామిలీ' ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసి పెద్దలందరినీ సత్కరించి ప్రేమాభిమానాలను పంచిపెట్టి ఆ క్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లేలా ప్రోత్సాహించారు. తండ్రి హనుమంతరావు తన, తన తోబుట్టువుల కుటుంబాలలోని పిల్లలకు, మనవల ఉన్నతి కోసం మార్గదర్శనం చేసేవారు. ఆ ఒరవడిని కొనసాగించిన మూర్తి మామయ్య ఆ వారసత్వాన్ని తన పిల్లలకూ అందచేశారు. ఇరుగు పొరుగు సమాజంలోని వారికి అదే రీతిలో సహాయ సహకారాలు అందించేవారు. అంతటి గొప్ప మానవతా విలువలు కలిగిన వ్యక్తి హఠాత్తుగా మమ్మల్ని విడిచి వెళ్లడం మా కుటుంబాలకు తీరని లోటు. - పి.సుధాకరరావు, మేనల్లుడు

వేదనకు గురిచేసింది

నేను అనునిత్యం స్మరించుకునే విజికె మామయ్య మరణ వార్త మా కుటుంబ సభ్యులను ఎంతో వేదనకు గురి చేసింది. నేను చిన్నప్పటి నుంచి రంగస్థలంపై పెంచుకున్న మోజుని గుర్తించి ప్రోత్సహించారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొంది, ఎన్నో అవార్డులు పొందిన రంగస్థల నటుడిగా ఎదగడంలో ఆయన పాత్ర మరువ లేనిది. నా ప్రదర్శన ఎక్కడ ఉన్నా వెళ్లి చూసి నా భుజం తట్టే వారు. అలాంటి మామయ్య హఠాత్తుగా ఇలా దూరం కావడం చాలా బాధాకరంగా ఉంది. - ముళ్లపూడి రామచంద్రరావు, మేనల్లుడు (చిన్నక్కయ్య కుమారుడు)

వి.జి.కె మూర్తి ఉద్యమాలతో ప్రజలతో నిరంతరం మమేకమవుతూనే కుటుంబ సభ్యులకూ సమయం వెచ్చించారు. అందరిపైనా ప్రేమానురాగాలు చూపేవారు. పిల్లలతో పిల్లవాడిగా, పెద్దలతో పెద్దవాడిగా ఉంటూ అందరికీ తలలో నాలుకలా వ్యవహరించేవారని కుటుంబసభ్యులు తమ మనోగతం వెల్లడించారు. తల్లి లేకపోయినా అన్నీ తానై తమ తండ్రి చూసుకున్నారని కుమార్తెలు, కుమారుడు గుర్తు చేసుకున్నారు. తమ చదువులకు మార్గదర్శకం చేశారంటూ మనవళ్లు, మనవరాళ్లు అభిప్రాయపడ్డారు. తమకు అన్ని విధాలుగా అండగా నిలిచారంటూ మేనల్లులు, మేనకోడళ్లు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

కుటుంబ బాంధవ్యాలకు విలువిచ్చేవారు

మావయ్య ఒక మానవతావాది. బంధువుల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆయన స్పందించేవారు. ఆయన తోచిన సాయం చేసేవారు. కుటుంబ బాంధవ్యాలకు విలువిచ్చేవారు. కుటుంబంలో ఉన్న చిన్న పిల్లలు మొదలు వృద్ధుల వరకు అందరినీ ఆప్యాయంగా పలకరించేవారు. - దేవులపల్లి శ్రీనివాసరావు, చిన్నల్లుడు

ప్రేమగా చూసుకునేవారు

తాత నన్ను ప్రేమగా చూసుకునేవారు. చదువు విషయంలో చాలా కఠినంగా ఉండేవారు. శ్రద్ధగా చదువుకోవాలని చెప్పేవారు. మేం వచ్చినప్పుడల్లా చాక్లెట్ కొని ఇచ్చేవారు. తాతతో కలిసి చాలాసార్లు ఆడుకున్నాను. - అజ్జరాపు సత్యశ్రీ నిత్య, ప్రశాంతి కుమార్తె

రుణపడి ఉంటాం

జగ్గా అని మనసారా పిల్చే వి.జి.కె మూర్తి మామయ్య లేడంటే నేను నమ్మలేకపోతున్నా. మా అనుబంధం కాకినాడలో ప్రారంభమైంది. చదువులో నన్ను వెన్నంటి ఉండి ఇంటర్ పూర్తి చేయించాడు. మామయ్య అని, ఇలా సమస్య ఉంది అంటే తగిన సలహా ఇచ్చి ముందుండి నడిపే వాడు. రాయడానికి పుస్తకాలు చాలవు. అన్ని సుగుణాలు ఉన్న మామయ్య నా వెన్నంటే ఉంటాడు. మా కుటుంబం మొత్తం రుణ పడి ఉంటాం. - జగన్నాథం, మేనల్లుడు

నా పాటలంటే తాతకు ఇష్టం

నేడు ఏడో తరగతి చదువుతున్నప్పుడు నాన్నకు బదిలీ అయిన తర్వాత నేను తాత ఇంట్లో ఉండేవాళ్లం. నా పాటలంటే తాతకు ఇష్టం. జాను సినిమాలోని పాట అంటే తాతకి చాలా ఇష్టం. ఇంగ్లీష్‌పై తాతకి చాలా పట్టుంది. మాకు ఇంగ్లీష్ బాగా రావడానికి ఆయనే కారణం. - వి.ఎ.ఎల్ సహస్ర, మనవరాలు (శ్రీనివాస్‌కుమార్ పెద్ద కూతురు)

ఏ పనైనా ఇష్టంగా చేయమనేవారు

హైదరాబాద్ వచ్చినప్పుడు నాకు చాలా మంచి విషయాలు చెప్పేవారు. నేను చేస్తున్న పనిలో కష్టాలు ఏమైనా వచ్చాయా అడిగేవారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏ పని ఆపొద్దని చెప్పేవారు. ఏ పనైనా ఇష్టంగా చేయమనేవారు. మంచి ఆహారపు అలవాట్లు చెప్పేవారు. రోజువారీ దినపత్రికల్లో వచ్చిన కష్టమైన పదాలను ఒక చోట రాసి డిక్షనరీ చూడమనేవారు. అప్పట్నుంచీ నాకు ఇంగ్లీష్ పదాలపై కొంత పట్టు వచ్చింది. - రిషి వాత్సవ్, మనవడు (భారతి కుమారుడు)

ఆయనది నిస్వార్థ వ్యక్తిత్వం

తనతో పాటు తన నలుగురు అక్కాచెల్లెళ్ల బాగోగులను ఆయన చూసేవారు. ఉద్యోగం వచ్చిన తర్వాత తన తొలి జీతాన్ని నలుగురికి పంచిపెట్టారు. మాది ప్రేమ వివాహం. పెళ్లి సమయంలో ఇబ్బందులేర్పడకుండా నాకు సాయం చేశారు. ఆయన లేకపోవడం మాకు చాలా లోటు. - పి.సోమశేఖర్ శర్మ, మేనల్లుడు

క్రమశిక్షణ ముఖ్యమని చెప్పేవారు

ఏదైనా పని చేసేటప్పుడు ఆత్మవిశ్వాసంతో చేయమనేవారు. మనం ఏ రంగంలోనైనా రాణించాలంటే క్రమశిక్షణ ముఖ్యమని చెప్పేవారు. జీవిత విలువలను బోధించేవారు. తప్పులను సరిదిద్దుకోమనేవారు. - మధు ప్రణయ్, మనవడు (ప్రవంతి కొడుకు)

పట్టుదల గల వ్యక్తి

ఏ పని ప్రారంభించినా అది పూర్తయ్యే వరకు విశ్రమించేవారు కాదు. పట్టుదలగా దాన్ని పూర్తి చేసేవారు. సమయం చాలా విలువైనదిగా భావించేవారు. ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకునే వారు. ఆయన్నుంచి మేం చాలా నేర్చుకున్నాం. - ఆలూరి రవికుమార్, పెద్దల్లుడు

నేను వేసిన బొమ్మలు మెచ్చుకునేవారు

తాత అంటే చాలా ఇష్టం. ఆయనతో ఆడుకునే దాన్ని. నాకు ఇంగ్లీష్, హిందీ చెప్పేవారు. నేను వేసిన డ్రాయింగ్ చూసి మెచ్చుకునేవారు. చనిపోవడానికి కొద్ది రోజుల ముందు కలర్ పెన్సిల్స్, బుక్స్ కొనిచ్చారు. - వి.జి చైతన్య, మనవరాలు

వి.జి.కె సేవలు అమూల్యం

ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, విశాఖపట్నం డివిజన్ మాజీ ఉపాధ్యక్షునిగా, సిఐటియు జిల్లా జిల్లా వ్యవస్థాపకులు, మొదటి ప్రధాన కార్యదర్శి వి.జి.కె.మూర్తి హఠాన్మరణం నాకు దిగ్భ్రాంతి కలిగించింది. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఎస్‌సి పూర్తి చేసిన తరువాత 1973లో భారతీయ జీవిత బీమా సంస్థ శ్రీకాకుళం బ్రాంచిలో ఉద్యోగంలో చేరారు. 1977లో ఫెలో షిప్ ఆఫ్ ఇన్స్యూరెన్స్ ఇన్స్టిట్యూట్ ఉత్తీర్ణత పొందడమే కాకుండా, అందులో హ్యూమన్ రిసోర్సెస్ పేపర్లో అఖిల భారత స్థాయిలో ప్రథములుగా నిలిచారు. శ్రీకాకుళం బ్రాంచ్ యూనిట్ కార్యదర్శిగా పనిచేయడమే కాకుండా జిల్లాలో సుమారు 30 ఉద్యోగ కార్మిక సంఘాలను సమీకరించారు. వాటికి తన సహాయ, సహకారాలు అందించారు. జిల్లా ఉద్యోగ, కార్మిక సంఘాల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, దానికి ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. విశాఖపట్నం డివిజన్ ఇన్స్యూరెన్స్ ఉద్యోగుల సంఘానికి 30 ఏళ్లకు పైగా తన అమూల్య సహకారాన్ని అందించారు. పెన్షనర్స్ అసోసియేషన్ తన అమూల్యమైన సహకారాన్ని చివర వరకు అందించారు. ఆయన చివరి వరకు కమ్యూనిస్టుకు అందించిన సహకారం అద్వితీయం. ఆయన మంచి గాయకుడే కాకుండా మంచి వక్త. ఈ సంవత్సరమూ సంక్రాంతికి చుట్టు పక్కల వీధుల వారికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన నాకు అత్యంత సన్నిహిత మిత్రుడు. మంచి విలువలతో ఉన్న కామ్రేడ్. ఆయన అకాల మరణం ఒక నిబద్ధత కలిగిక కామ్రేడిని మనందరికే కాకండా అనేక మంది ప్రజానీకానికి తీరని లోటు. విజికె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలిజేస్తున్నాను.

- కె.వేణుగోపాల్,
మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి,
అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సంఘం



మణిపూస

అధ్యయనం, అవగాహన, ఆచరణ కలకలిపిన మనిషి వి.జి.కె మూర్తి. అన్ని వయసుల వారిలోను, అన్ని భావావాలు ఉన్న వారితోను కలిసి పనిచేయగల నేర్పరి. ఆయనకు ప్రధాన గుణం ఉంది. మనుషుల్లోకి, వారి మనసుల్లోకి ప్రవహిస్తాడు. ఆయన మాటలోను, పనుల్లోను, స్పర్శలోను తడితగులుతుంది. ఆయన భావాలను వీధుల్లో కాకుండానే ఇతరులతో పనిచేసి, పనిచేయించేవారు. అందుకే ఆయన నిండైన మనిషిగా జీవించి చూపించారు.

'అవును కాలమే
అనంతమైనది కాలమే
అజరామరమైన కాలమే
జనిస్తున్నచోటే మరణిస్తునది
మరణిస్తున్న చోటే జనిస్తున్నది
కాలానికి లెక్కలేమిటీ
లెక్కల్లో కాలముంటుంది గాని
మనిషికే మరణం గాని
కాలంతో కలిసి పనిచేసి ప్రవహించిన
విజికె ఆచరణాత్మకమైన జీవితం
అనుసరనీయం'. **- చీకటి దివాకర్, రచయిత**



విజికె దార్శనికుడు

జిల్లా ప్రజానీకం ఒక మంచి నాయకుడిని కోల్పోయింది. తమను బేషరతుగా ప్రేమించే ఒక మానవతా మూర్తిని కార్మికవర్గం చైతన్యం కలిగించే ఒక దార్శనికుడు వి.జి.కె.మూర్తి. ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు మిగిల్చింది. క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ, నిరాడంబరత, సమగ్ర మానవతా దృష్టి మూర్తీభవించిన వ్యక్తి. బహుముఖ ప్రజ్ఞ పాటవాలు గల విజికె తను ఎంచుకున్న కార్మికవర్గ విముక్తి సిద్ధాంత బాటలో కడదాకా కొనసాగారు. ఆరోగ్యపరమైన కుటుంబ పరమైన ఇబ్బందులు ఏవీ ఆయన ప్రస్థానాన్ని ఆటంకపరచలేదు. ఉద్యోగంలో చేరింది మొదలు కార్మికులు, ఉద్యోగులు ఇతర పీడిత ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకునే వారు. శ్రీకాకుళం, పలాసలో ఉద్యోగులు, కార్మికుల సమన్వయ సంఘం ఏర్పరిచి సంఘీభావ ఉద్యమాలను నిర్మించారు. ఎల్ఐసి యూనియన్ నాయకులుగా, సిఐటియు నాయకులుగా కార్మికవర్గానికి విశేష సేవలు అందించారు. కార్మికవర్గ ప్రయోజనాల

సాధనకు పోరాటాల్లోనే వారిని చైతన్యపరచడం వారి లోపాలను ఎత్తిచూపడం, ఐక్యతకు కృషి చేయడం ఒక క్రమ పద్ధతిలో కొనసాగించారు. యాజమాన్యాలతో చర్చల్లో పట్టువిడుపు ప్రదర్శించడం యాజమాన్య ప్రతినిధులను నొప్పించకుండానే కార్మికుల డిమాండ్లను సాధించడంలో ఆయనది అందెవేసిన చేయి. మంచి ఉద్యోగోన్నతికి పోకుండా కార్మికవర్గ ప్రయోజనాలకు కట్టుబడి తన నిబద్ధతను చాటుకున్నారు. ఒడిదుదుడుకులు వ్యక్తిగత జీవితంలో ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలకు బాసటగా నిలిచారువ పత్రిక, సాహిత్యం, సామాజిక సేవ, కళా, సాంస్కృతిక రంగాల్లో వివిధ సంస్థలకు ఆయన అందించిన మార్గదర్శకత్వం చిరస్మరణీయమైనది. మంచి ఉపన్యాసకుడు, గాయకుడు, ఆణిముత్యాలు లాంటి చేతిరాత, కవి, రచయిత, ఆంగ్ల భాషపై మంచి పట్టు ఉంది. విజికె తన ప్రతిభను ప్రజలకే ఉపయోగపెట్టారు. దళితులు, మైనారిటీలు, మహిళల హక్కుల కోసం నికరంగా నిలబడ్డారు. కుటుంబంలో కూడా తన వారి అందరికీ వారి అవసరాలను అర్థం చేసుకొని అవసరమైన సహాయం అందించేవారు. మంచి పలకరింపు, చిరునవ్వుతో కొత్త వారిని సైతం ఆకర్షించి వారిని తన ఆప్తమిత్రులుగా మార్చే సుకోవడం ఆయన ప్రత్యేకత. తన సమయాన్ని మొత్తం సమాజ సేవకే వినియోగించిన త్యాగశీలి. ఆయన మృతి బంధువుగా ఒక సహోద్యోగిగా ఒక సహచర కార్యకర్తగా నాకు తీరనిలోటు. ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ... ఆశయ సాధనకు పునరంకితమవు తాయని ప్రతిజ్ఞ చేయడమే ఆయనకు నివాళి.

- కేతవరపు శ్రీనివాసు

ఐక్య ఉద్యమాల సారథి

ఉత్తరాంధ్రకు ఐక్య ఉద్యమాల ఆవశ్యకత చాటి చెప్పిన మహోన్నతమైన మనిషి వి.జి.కె.మూర్తి. సహజ సౌమ్యులు. వ్యక్తిగత శ్రేయస్సుకన్నా వ్యవస్థ మనుగడ ఐక్య ఆవశ్యకతను ఆచరణాత్మకంగా ఆచరించిన వ్యక్తి. సామ్రాజ్యవాదం, ఎల్పిజి, నయా ఉదారవాదం యావత్ ప్రపంచాన్ని కబళిస్తున్న వేళ ఐక్య ఉద్యమాల ప్రాధాన్యతను గుర్తించారు. 18 సార్వత్రిక సమ్మెల నిర్వహణలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారు. మధ్యతరగతి ఉద్యోగులనందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి పోరాటాల్లో భాగస్వామ్యులను చేయడంలో అనన్య సామాన్యమైన పాత్ర పోషించారు. సమాజ శ్రేయస్సు, బడుగు బలహీన వర్గాల అస్థిత్వాన్ని, సమాజంలో కాపాడడానికి కృషిచేస్తూనే జీవనయానంలో తారసపడిన ప్రతివ్యక్తి అభివృద్ధి దిక్సూచిగా నిలిచారు. నిరంతరం తోడ్పాటునందించారు. ప్రజల గుండెల్లో ఉన్నతమైన స్థానం సంపాదించారు. చైతన్య రహితంగా నిర్వీర్యం అవుతున్న బ్యాంకింగ్ రంగ ఉద్యమ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల పరిరక్షణకు వెన్నుదన్నుగా నిలిచారు. బ్యాంకింగ్ రంగ ఉద్యమాలతో ఆయన ఉపన్యాసాలు అనేకానేక సందర్భాల్లో ఉద్యోగులను సామూహికంగా, వ్యక్తిగతంగా ప్రభావితం చేశాయన్నది నిర్వివాదంశం. బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) ఉద్యమ నిర్మాణంలో నాకు సైద్ధాంతిక రాజకీయ చైతన్యం కల్పించారు. ప్రభుత్వ విధానాలపై, వర్గ దృక్పథాన్ని అలవరుచుకోవడంలో కరదీపికగా నిలిచారు. ప్రజలతో మమేకమై, వ్యక్తులతో గాకుండా, విధానాలతో పోరాడడం ఆయనని అజాత శత్రువుగా నిలబెట్టింది. సమాజంలో ఆయన ఉనికి ఆవశ్యకతను తెలియజెప్పే విధంగా నేత్రదానం, శరీరదానం నిర్ణయాలు ఆయన జీవన ప్రస్థానంలో పరమోత్కృష్టమైన ఘట్టంగా చెప్పుకోవచ్చు.

- మండ శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు,
ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్

స్నేహశీలి

వి.జి.కె మూర్తి గురించి చెప్పడానికి ఎన్నో సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఆయన స్నేహశీలి. ఎవరైనా మాట్లాడానికి వెళ్తే వారి సమస్య తెలుసుకొని వారిని అర్థం చేసుకొని తగు సూచనలు చేసేవారు. అలాగే ఆయన సూటిగా మాట్లాడడం ఆయన నైజం. ఆయన లేని లోటు మరెవ్వరు తీర్చలేరు.

- అల్లు మహాలక్ష్మి,
జిల్లా గౌరవాధ్యక్షులు
మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం

గొప్ప వ్యక్తి

గొప్ప వ్యక్తి. మా కుటుంబానికి ఆప్తులు. సిపిఎం నాయకులు వి.జి.కె మూర్తి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ... ఆయన ఎప్పుడూ తన ఆశయాలు, ఆలోచనలతో ప్రజలతో, మనతో ఉంటారని ఆశిస్తూ... జోహార్ కామ్రేడ్.

- డి.ఆర్.కె నాయుడు కుటుంబ సభ్యులు

నిబద్ధత గల వ్యక్తి

నాకు తెలిసిన వి.జి.కె మూర్తి స్నేహశీలి. నిబద్ధతగల వ్యక్తి. విప్లవ భావజాలాన్ని సున్నితంగా ఎదుటివారి మనస్సులోనికి చొప్పించగల సమర్థుడు. ఎవరితోనైనా 'మంచి మిత్రుడు' అనిపించుకోగలిగే వ్యక్తి. అతని అకాల మరణం నాకు చాలా బాధాకరం.

- డాక్టర్ కె.సుధీర్, ఐఎంఎ మాజీ అధ్యక్షులు

ఎందరికో స్ఫూర్తి

గురుతుల్యులు, తండ్రి సమానులైన వి.జి.కె మూర్తి కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేశారు. చివరి క్షణం వరకు పడిన తపన మరువ లేనిది. అపర మేధావి అయిన మీరు మీ జ్ఞానాన్ని అంతటినీ ప్రజాసేవకు ఉపయోగించారు. నిష్కల్మషమైన, నిస్వార్థమైన మీ జీవన ప్రయాణం ఎందరికో స్ఫూర్తి. మీ మార్గదర్శకత్వం మాలో కష్టమైన సమయంలో కూడా తట్టుకొని నిలబడే ధైర్యాన్ని నింపింది. మీ నిరంతర ధీరత్వం నేటి యువతకు ఆదర్శనీయం.

- జి.రామకృష్ణారావు, లెక్చరర్
- బి.శాంతిశ్రీ, ఐసిడిఎస్ పీడీ

నా తొలి గురువు

1985 ఆగస్టులో ఎల్ఐసి పలాస బ్రాంచ్‌లో అసిస్టెంట్‌గా నా మొదటి ఉద్యోగం. అప్పుడు అక్కడ వి.జి.కె మూర్తి హెచ్‌జిఎగా పనిచేశారు. అప్పుడే ఆయనతో నా మొదటి పరిచయం. అలా ఆయనతో ఏడాది కాలం కలిసి ఆ బ్రాంచ్ లో పనిచేసే అవకాశం దొరికింది. అప్పటికే మూర్తి పలాస బ్రాంచ్ ఐసిఇయు యూనిట్ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, పలాస-కాశీబుగ్గ ప్రాంతంలో ఉద్యోగులను, ఉపాధ్యాయులను ఐక్యంచేసి ఉద్యోగ, ఉపాధ్యాయ సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కన్వీనర్‌గా ఉంటూ అనేక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ కార్యక్రమాల్లో ఆయనతో కలిసి పాల్గొనడం ద్వారా నేను అనేక విషయాలను నేర్చుకున్నాను. ఆయన పలాస నుంచి శ్రీకాకుళం బ్రాంచ్‌కు బదిలీపై వెళ్తూ... సమన్వయ కమిటీని కొనసాగించే బాధ్యత తనను తీసుకోమని చెప్పి ప్రోత్సహించారు. ఆ విధంగా అనుభవాలు తర్వాత విజయనగరంలో ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కో-ఆర్డినేషన్‌లో పనిచేయడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆయనతో కలిసి పనిచేసే సందర్భంలో సమన్వయ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన ఓ కార్యక్రమం ఇప్పటికీ నాకు ఎంతో స్ఫూర్తినిస్తుంది. అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌టిఆర్ ప్రభుత్వం ఎటువంటి విచారణ లేకుండా ఉద్యోగులను తొలగించే దుర్మార్గమైన జిఓ జారీ చేసింది. ఆ జిఓ ఆధారంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిని తొలగించింది. ఈ జిఓకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించాలని నిర్ణయించాం. విజికె మంచి ఆర్టిస్టు. ఆయన పోస్టర్లు తయారు చేసేవారు. నేను వాటిని ఊరంతా గోడలకు అంటించేవాడిని. రెండు, మూడు రాత్రులు ఈ కార్యక్రమం చేసేవాళ్లం. సదస్సుకు ప్రధాన వక్తగా అప్పటి ఐసిఇయు విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్‌ను ఆహ్వానించాం. ఈ సదస్సు విజయవంతమైంది. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కేవలం మన ఉద్యోగుల వరకే పరిమితం కాకుండా, బయట విస్తారమైన ఉద్యోగులు, కార్మికులకు సహకారం అందించాలని చెబుతుంది. విజికె సాహచర్యంలో పనిచేయడం వల్లే ఐసిఇయు, సిఐటియు, ఇతర ప్రజాతంత్ర ఉద్యమాల్లో భాగం పంచుకోడానికి దోహదపడిందని కచ్చితంగా చెప్పగలను.

- ఎం.శ్రీనివాస, ఎల్ఐసి ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక

విప్లవమే ఊపిరిగా...

వి ప్లవమే ఊపిరిగా విజికె జీవించారు.
జి జ్ఞాస జీవన పరమావధిగా భావించారు.
కె రటంలా పడిలేచే ఉద్యమ తరంగంలా శ్రమించారు.
మూర్తీ భవించిన మీ ఆశయాలను మా ముందుంచి, ఈ భౌతిక ప్రపంచాన్ని విడిచి మమ్ములను అశ్రునయనాల్లో ముంచినారు.
మీ అడుగుజాడల్లో సమాజ జాగృతికి కృషి చేయు బాధ్యతను మాకు అందించారు... నివాళితో...

- డాక్టర్ సనపల నరసింహమూర్తి,
ఇండియన్ మెడికల్ అసోసియేషన్
జిల్లా అధ్యక్షులు

కమ్యూనిస్టు విలువల 'మూర్తి'మంతం

కమ్యూనిజంలో కేవలం సామాజిక మార్పుకు సంబంధించిన రాజకీయ సిద్ధాంతమే కాదు... కమ్యూనిస్టు సభ్యులు కలిగి ఉండాల్సిన విలువల గురించిన సూత్రీకరణలు పాటించాల్సిన క్రమశిక్షణ గురించిన నిబంధనలూ ఉంటాయి. అంచేతనే మిగిలిన రాజకీయ వేత్తలకూ, కమ్యూనిస్టు రాజకీయ వేత్తలకూ స్పష్టమైన తేడా కన్పిస్తుంది. కమ్యూనిస్టుల మాటలకు, చేతలకు తేడా ఉండదు. తాను మారుతూ, సమాజాన్ని మార్చే కృషి ఏకకాలంలో కమ్యూనిస్టు చేస్తాడు. పురోగామిక భావజాలాన్ని అన్నివేళలా కలిగి ఉంటారు. క్రమశిక్షణతో నడయాడుతారు. త్యాగాలకు వెనుదీయరు. నిరాడంబరంగా ఉంటారు. సరిగ్గా ఈ లక్షణాలు, విలువలే కమ్యూనిస్టులపై ప్రజలకు గౌరవం, నమ్మకం కలుగుతుంది. వారి అడుగుజాడల్లో నడవడానికి ప్రజలు సిద్ధం అవుతారు. సరిగ్గా ఈ విలువలన్నీ మూర్తీభవించిన వ్యక్తి విజికె.

దాదాపు 40 ఏళ్ల కిందట నేను తొలిసారిగా విశాఖ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎటు మేము నిర్వహించిన ధర్నా శిబిరం వద్ద మూర్తిని చూశాను. మా ధర్నాకు మద్దతుగా ఉపన్యసించారు. ధర్నా విజయవంతం కావడానికి మేము చేయాల్సిన పోరాట ఎత్తుగడలను తెలియజేస్తూ... మాతో కడదాకా నిలబడ్డారు. తెల్లనిఛాయ, వినసొంపైన కంఠం... నన్ను ఆకర్షించాయి. అయితే అంతవరకే, తరవాత మరో పదేళ్లకు నాకు మూర్తితో పరిచయం ఏర్పడలేదు.

అప్పుడు మేము శ్రీకాకుళ సాహితి వేదిక ఏర్పాటు చేసిన సందర్భంలో పరిచయమైంది. వేదిక ప్రకటించిన లక్ష్యాలతో ఏకీభవిస్తూనే, వేదిక కార్యకలాపాల్లో వ్యక్తమయే ధోరణుల (ఎంఎల్ లైన్ వేపు మొగ్గు)పై మూర్తికి అభ్యంతరాలు ఉండేవి. ఆ అభ్యంతరాలతో మూర్తి వేదిక నుంచి దూరం జరిగారు. అంతేగానీ మాకు దూరం కాలేదు. బహుశా ఇలా దూరం కావడానికి కేవలం అభ్యంతరాలే కారణాలు కావు. అప్పటికి మూర్తి కార్మిక రంగంలో ఉద్యమాల్లో ప్రధాన పాత్ర పోషించడం కూడా కారణం కావచ్చు. ఎందుకంటే మూర్తి అభిప్రాయ భేదాలను (కమ్యూనిస్టు మిత్రుల మధ్య) చర్చిస్తారు. తన అభిప్రాయంపై దృఢంగా ఉంటూనే మిత్రులతో అంతే దృఢంగా చర్చిస్తారు. నూరు పూలు వికసించని, వేయి ఆలోచనలు ఘర్షించని అనే సూక్తికి మూర్తి కట్టుబడి ఉండే కమ్యూనిస్టు.

అంచేతనే మళ్లీ మూర్తి ఉద్యోగ విరమణ, కార్మికరంగం నుంచి సాహిత్య,

సామాజిక చింతన, ఉద్యమాల నిర్మాణంవైపు వచ్చాక నేను, వారూ దగ్గరయ్యాం. ఎన్నెన్నో కార్యక్రమాలు నిర్వహించాం. సాహితీ స్రవంతి బాధ్యులుగా ముఖ్యంగా జాతీయోద్యమ కవి గరిమెళ్ల పాట 'మాకొద్దీ తెల్ల దొరతనం'కు వందేళ్లు నిండిన సందర్భంలో ఆ పాటను లేమినేటెడ్ పేపర్‌లో వందల కాపీలు ముద్రించాం. పంపిణీ చేశాం. గరిమెళ్ల రచనలను, గరిమెళ్లపై వచ్చిన వ్యాసాలను ఒక సంకలనంగా తేవడం, గరిమెళ్ల స్ఫూర్తిగా కవిత్వం జిల్లాలోని రచయితల నుంచి సేకరించి కవితా సంకలనం వేయడం, బాపూజీ కళామందిర్‌లో పెద్ద సభని నిర్వహించాం. ఈ మొత్తం కృషిలో ప్రధాన భాగం మూర్తిదే. కార్యక్రమాన్ని నిర్ణయించాక అది విజయవంతం కావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతారు మూర్తి. తాను పనిచేస్తూ... మిత్రులతో పనిచేయించ గలగడం మూర్తి ప్రత్యేకత. నా నవల బహుళ ఆవిష్కరణను డబ్బై ప్రజా సంఘాలతో నిర్వహించడంలో ఐక్యకార్యాచరణ చేయడంలో ఏలా కమ్యూనిస్టులు ప్రవర్తించాలో మూర్తి నుంచి ఆ సందర్భంలో గ్రహించాను. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం బాధ్యులుగా మూర్తి అనేక సభలు నిర్వహించారు. మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా, రాజ్యాంగానికి పాలకులు తూట్లు పొడుస్తున్న తీరుకు వ్యతిరేకంగా, వన్ నేషన్, వన్ ఎలెక్షన్‌కి వ్యతిరేకంగా నిర్వహించిన సభల విజయవంతంలో ప్రధానపాత్ర మూర్తిదే. ప్రధానంగా శ్రీకాకుళంలో అన్నీ శ్రేణుల వారిని ఐక్యం చేసి, కార్యక్రమాలు నిర్వహించడంలో అవలంబించాల్సిన ప్రజాస్వామిక పద్ధతులను మూర్తి నుంచి నేర్చుకోవాల్సిందే. శ్రీకాకుళం ఒక ఉమ్మడి శక్తిని కోల్పోయిం ది. ఒక కమ్యూనిస్టు విలువల మూర్తిమం తాన్ని కోల్పోయింది. మూర్తి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని అందరం విశాల ప్రజా ఉద్యమాలను నిర్మించడమే మూర్తికి నిజమై న నివాళి.

- అట్టాడ అప్పలనాయుడు,
కవి, రచయిత

కామ్రేడ్ వి.జి.కె మూర్తి జ్ఞాపకాల దృశ్యమాలిక

వి.జి.కె మార్గం స్ఫూర్తిదాయకం

వి.జి.కె మూర్తితో నాకు 37 ఏళ్ల అనుబంధం ఉంది. పార్టీ క్రమశిక్షణ, నిబంధనలకు ఆయన ఒక ప్రత్యక్ష ఉదాహరణ. మార్క్సిస్టు పార్టీ సిద్ధాంతాలను తూచా తప్పకుండా ఆచరించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆయన కమ్యూనిస్టుగా ఉండడమే కాకుండా తన కుటుంబానికీ ఆ విధమైన చైతన్యం కలిగించారు. వాక్కు ప్రవర్తన, ఆచరణ సమపాళ్లలో మూర్తీభవించిన వ్యక్తి. సిపిఎంకి అవసరమైన సందర్భంలో ఆయన తన సహాయ సహకారాలను అందించేవారు. ఐదు దశాబ్దాల పాటు పార్టీలో క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా జీవితం గడిపారు. ఆయనకున్న విస్తృత సంబంధాలు పార్టీకి ఎంతగానో దోహదపడ్డాయి. దళిత సంఘాలకు వారు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రజాస్వామ్యవాదిగా, లౌకికవాదిగా ఆయన విస్తృత సంబంధాలను ఏర్పరచుకున్నారు. జిల్లాలో ట్రేడ్ యూనియన్ల విస్తరణ, బలోపేతం బాధ్యతలను ఆయన తన భుజానికి ఎత్తుకున్నారు. ఆయన ఆచరించిన మార్గం అందరికీ స్ఫూర్తిదాయకం.

- భవిరి కృష్ణమూర్తి,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు